జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989894528

కృష్ణ | సోమవారం 11 మే 2026 | సంపుటి : 01 | సంచిక : 107 | పేజీలు : 12 | వెల :3/- | PRGI No. APTEL/26/A0119,

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




# ఏపీకి జాతీయస్థాయి గుర్తింపు

పంచాయతీ రాజ్ అవార్డుల్లో దేశంలోనే రెండో స్థానం

దేశంలోనే రెండో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్

సుపరిపాలన, మహిళా మిత్ర విభాగాల్లో తొలి ర్యాంకులు

తలా రూ.కోటి గెలుచుకున్న శృంగవరం, బొక్కసంపాలెం పంచాయతీలు

**అమరావతి**

గ్రామ స్వరాజ్యంలో ఆంధ్రప్రదేశ్ మరోసారి సత్తా చాటింది. పల్లెల అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించిన జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డుల్లో ఏపీ దుమ్మురేపింది. రాష్ట్రానికి చెందిన ఐదు పంచాయతీలు ఈ ప్రతిష్టాత్మక పురస్కారాలను దక్కించుకున్నాయి. జాతీయ స్థాయిలో అత్యధిక అవార్డులు సాధించిన జాబితాలో మన రాష్ట్రం రెండో స్థానంలో నిలిచింది. ఈ విజయాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలోనే ఈ ఘనత సాధ్యమైందని కొనియాడారు. ఉత్తమ పనితీరు కనబరిచే పల్లెలను ప్రోత్సహించేందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఏటా ఈ పురస్కారాలు ఇస్తుంది. ఈ క్రమంలో 'దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్-2025' పేరిట అవార్డులు ప్రకటించారు. ఇందులో మన రాష్ట్రం నుంచి రెండు పల్లెలు జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకులు సాధించాయి. శృంగవరం విశాఖపట్నం జిల్లా నాతవరం మండలానికి చెందిన పంచాయతీ ఇది. 'సుపరిపాలన' విభాగంలో ఇది దేశంలోనే తొలి ర్యాంకు సాధించింది. బొక్కసంపాలెం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలానికి చెందిన ఈ ఊరు 'మహిళా మిత్ర' విభాగంలో అద్భుత పనితీరు కనబరిచి, జాతీయ స్థాయిలో తొలి ర్యాంకు దక్కించుకుంది. ఈ విజయాలకు గానూ ఈ రెండు పంచాయతీలు రూ. కోటి చొప్పున భారీ నగదు బహుమతిని గెలుచుకోవడం విశేషం. మరికొన్ని కీలక విభాగాల్లోనూ మన పల్లెలు జాతీయ స్థాయిలో అగ్రశ్రేణి ర్యాంకులు సాధించాయి. చెముళ్లపల్లి వైఎస్సార్ కడప జిల్లా కాజీపేట మండలానికి చెందిన పంచాయతీ ఇది. 'పేదరిక నిర్మూలన - మెరుగైన జీవనోపాధులు' విభాగంలో ఇది పోటీ పడింది. అద్భుత పనితీరుతో జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. రూ. 75 లక్షల ప్రైజ్‌మనీని తన ఖాతాలో వేసుకుంది. గుండమాల ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలానికి చెందిన గ్రామమిది. 'స్వావలంబన పూర్వక మౌలిక వసతుల సాధన' విభాగంలో ఈ పంచాయతీ - మిగతా3లో



## చంద్రబాబు, పవన్ నివాసాలకు వెళ్లిన ప్రధాని మోదీ

- గంటకుపైగా భేటీ
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసాలకు వెళ్లిన ప్రధాని నరేంద్రమోదీ
- తొలుత పవన్ ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించిన మోదీ
- అనంతరం చంద్రబాబు నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసిన మోదీ

**హైదరాబాద్/అమరావతి**

హైదరాబాద్ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసాలకు వెళ్లారు. తొలుత పవన్ ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. సైనస్ సమస్య కారణంగా పవన్ కల్యాణ్‌కు ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. - మిగతా3లో

# ఈ ప్రపంచానికి పునాది అమ్మే

- ప్రతి జీవం అమ్మ ప్రేమ, త్యాగం, లాలనతోనే మొదలవుతుంది: సీఎం చంద్రబాబు
- మదర్స్ డే సందర్భంగా మాతృమూర్తులకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు
- ప్రతి జీవం అమ్మ ప్రేమతోనే మొదలవుతుందన్న ముఖ్యమంత్రి
- తల్లి స్ఫూర్తితోనే బడిలో నైతిక విలువల పాఠాలు ప్రవేశపెట్టామన్న లోకేశ్




**అమరావతి**

ఈ సృష్టికి మూలం అమ్మ. ఆ త్యాగమూర్తికి ఎంత చేసినా రుణం తీర్చుకోలేం. నేడు అంతర్జాతీయ మాతృ దినోత్సవం (మదర్స్ డే) సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత తదితరులు తల్లులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అమ్మ గొప్పదనాన్ని, ఆమె త్యాగాలను వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. వివిధ నాయకుల సందేశాలు, కార్యక్రమాల పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతి జీవం అమ్మ - మిగతా3లో



## డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రగామి

- రాజకీయాలు, ప్రభుత్వాల కంటే సమాజమే శక్తివంతం
- ఆర్ట్ ఆఫ్ లివింగ్ 45వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ
- ధ్యాన్ మందిరాన్ని ప్రారంభించిన ప్రధాని భారత ఆధ్యాత్మిక విలువలు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయని వ్యాఖ్య



## పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి

- 15 మంది పోలీసులు మృతి..
- ముగ్గురికి గాయాలు
- ఘటన సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి

# వైద్యసేవలను సమర్థంగా అందించే 'సంజీవని'




- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు
- ఏపీలో 5.20 కోట్ల మంది ఆరోగ్య సేవల లక్ష్యంతో డిజిటల్ వ్యవస్థ
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు


**అమరావతి**

ఏపీలో వైద్యసేవలను సమర్థంగా అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ సంజీవని. అయితే ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలను సులభంగా అందుబాటులోకి తేవడం, రోగనిర్ధారణ నుంచి కోలుకునే వరకూ నిరంతర పర్యవేక్షణ, ముందస్తు పరీక్షలతో వ్యాధి తీవ్రత, వ్యాప్తి కట్టడి మెరుగైన ఆరోగ్యసేవలు అందించడమే దీని ప్రధాన ఉద్దేశం. కుప్పంలో ప్రయోగాత్మకంగా మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టు ఏపీవ్యాప్త అమలుకు ప్రభుత్వం భారీగా సన్నాహాలు చేస్తోంది. ప్రాథమికంగా మధుమేహం, రక్తపోటు ఉన్న - మిగతా3లో



## నేను మీ అందరివాణ్ని

- తమిళనాట లౌకిక, సామాజిక, న్యాయశకం మొదలైందన్న సీఎం విజయ్
- ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే ఫైల్‌పై తొలి సంతకం
- సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారం
- ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ప్రముఖులు హాజరు
- ప్రమాణ స్వీకారం అనంతరం సచివాలయానికి వెళ్లి బాధ్యతలు చేపట్టారు.



## ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగిస్తాం

- కీలక దశకు చర్చలు..
- వెల్లడించిన రష్యా అధ్యక్షుడు పుతిన్
- త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధం ముగిసే అవకాశం ఉంది
- ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నాం

# నేను మీ అందరివాణ్ని

తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన జోసెఫ్ విజయ్, ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ఆ తర్వాత యాంటీ డ్రగ్ టాస్క్‌ఫోర్స్, మహిళల రక్షణకు ప్రత్యేక దళం దస్త్రాలపై విజయ్ సంతకాలు చేశారు. తమిళనాడుకు ఇది సరికొత్త ప్రారంభమని ప్రమాణస్వీకార కార్యక్రమంలో వెల్లడించారు. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో విజయ్‌తో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ సీఎంగా ప్రమాణం చేయించారు. అయితే సీఎంగా ప్రమాణం చేశాక విజయ్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తమిళనాట లౌకిక, సామాజిక, న్యాయశకం మొదలైందని అన్నారు. తాము సాధ్యమయ్యేవే చెబుతామని, చెప్పిందే చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మిత్రులైనా శత్రువులైనా అందరికీ ఒకే చట్టమని స్పష్టం చేశారు. తాను విజయ్ మామ అని, అన్నీ మంచి పనులు చేస్తాడని చెప్పారు.

డైరెక్టర్ కుమారుడు నేడు సీఎం అయ్యాడని, తాను అందరివాడినని విజయ్ తెలిపారు. ఎన్నో కష్టాలను అధిగమించి ఈ స్థాయికి వచ్చానని, తనను ఎంతోమంది ఎన్నోరకాలుగా ఇబ్బందిపెట్టారని ఆరోపించారు. కానీ అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని తెలిపారు. టీవీకేలో ఒకే ఒక అధికార కేంద్రం ఉందని, అది విజయ్ మాత్రమేనని స్పష్టం చేశారు. తమిళనాడులో ఇప్పుడు ప్రజా ప్రభుత్వం వచ్చిందని తెలిపారు. హామీల అమలుకు కొంత సమయం ఇవ్వండని, డీఎంకే ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లిందని ఆరోపణలు చేశారు.

"మహిళలు, యువకులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, మత్స్యకారులు మన టీవీకే ప్రభుత్వంలో అందరూ బాగుంటారు. పుట్టుకతో ప్రతి ఒక్కరూ



సమానమే అనేది మన రాజీలేని ప్రాథమిక సిద్ధాంతం. మైనారిటీ సోదరులారా, మన టీవీకే ప్రభుత్వం మీకు అండగా నిలుస్తుంది. ఇందులో మీకు ఎలాంటి సందేహం అవసరం లేదు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అందరి ప్రతిరూపమే ఈ విజయ్ ముఖం. మీరు నూరు శాతం ఈ విజయ్‌ను నమ్మవచ్చు. ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించిన తమిళనాడు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నేను ముఖ్యంగా ఇంకొకరికి కూడా కృతజ్ఞతలు చెప్పాలి వాళ్లే ఈ విజయ్ మామ చిట్టి నేస్తాలు. వాళ్ల వల్లే ఇదంతా సాధ్యమైంది. మీ రుణం ఎలా తీర్చుకోవాలో మీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఈ విజయ్ మామ మీ కోసం అన్ని మంచి పనులు చేస్తాడు. నమ్మకంతో ఉండండి. రండి, మనమంతా కలిసి ఒక సరికొత్త పరిపాలనను అందిద్దాం"

**సచివాలయానికి వెళ్లి బాధ్యతలు**

ప్రమాణ స్వీకారం అనంతరం సచివాలయానికి వెళ్లిన విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నూతన సీఎంకు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. తమిళనాడు కేబినెట్‌లో ప్రస్తుతం మిత్రపక్షాలకు నేతలకు చోటు దక్కలేదు. మిత్రపక్షాలను సంప్రదించి తర్వాత కేబినెట్ విస్తరణ చేయనున్నట్లు సమాచారం. విజయ్ తల్లిదండ్రులు చంద్రశేఖర్, శోభా చంద్రశేఖర్, ఇతర కుటుంబ సభ్యులు, టీవీకే నాయకులు, మద్దతు ఇచ్చిన పార్టీ నాయకులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలివచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు. కార్యకర్తలు, సినీ ప్రముఖులు సైతం విజయ్ ప్రమాణ స్వీకారానికి వచ్చారు.

**మోదీ, ఖర్గే విషెస్**

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్?కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఆయన పరిపాలన అద్భుతంగా సాగాలని ఆకాంక్షించారు. ప్రజల అభివృద్ధి కోసం అన్ని రకాలుగా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తుందని అన్నారు. మరోవైపు విజయ్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందనలు తెలిపారు. రాష్ట్ర రాజకీయ, సామాజిక చైతన్యాన్ని దీర్ఘకాలంగా నిర్వచిస్తూ వస్తున్న ఆదర్శాలు, పాలనను ముందుకు నడిపిస్తాయని తనకు పూర్తి నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు. "తమిళనాడు వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ప్రజలు, ముఖ్యంగా ఆశయాలు కలిగిన యువత, టీవీకేపై తమ నమ్మకాన్ని ఉంచారు. ఆయన నాయకత్వంలో ఆదర్శాలు పాలనను ముందుకు నడిపిస్తూనే, దేశానికి స్ఫూర్తినిస్తాయని నాకు పూర్తి నమ్మకం ఉంది. కరుణ, సమ్మిళితత్వం, అంకితభావంతో ప్రజలకు సేవ చేయడంలో కొత్త ప్రభుత్వం గొప్ప విజయాన్ని సాధించాలని ఆశిస్తున్నాను" అని తెలిపారు.

# డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రగామి

రాజకీయాలు, ప్రభుత్వాల కంటే సమాజమే అత్యంత శక్తివంతమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సమాజ శక్తిని మేల్కొల్పినప్పుడే ఏ ఉద్యమమైనా విజయవంతమవుతుందని అన్నారు. సమాజాన్ని ఏకం చేయడంలో గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ స్థాపించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ విశేష పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ఆదివారం బెంగళూరు పర్యటనలో భాగంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ 45వ వార్షికోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తగా నిర్మించిన ధ్యాన్ మందిర్?ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'భారత ఆధ్యాత్మిక విలువలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ పురాతన సంప్రదాయాల నుంచే స్ఫూర్తి కొనసాగుతోంది. ఆ స్ఫూర్తితోనే 45 ఏళ్ల క్రితం శ్రీశ్రీ రవిశంకర్ 45 ఏళ్ల క్రితం ఆర్ట్ ఆఫ్ లివింగ్ అనే విత్తనం నాటారు. ఈరోజు అది మహా వటవృక్షంలా ఎదిగింది. ఏ ఉద్యమమైనా సమాజ శక్తి తోడైతేనే విజయం సాధిస్తుంది. ప్రతి ముఖ్యమైన కార్యక్రమానికి సమాజ శక్తిని మేల్కొలపడం అత్యవసరం. నేను ఎప్పుడూ ఒక విషయాన్ని నమ్ముతాను. రాజకీయాలు, ప్రభుత్వాల కంటే సమాజమే ఎక్కువ శక్తివంతం. దేశ నిర్మాణంలో ప్రజలు చురుకుగా పాల్గొంటేనే ఏ ప్రభుత్వం విజయవంతమవుతుంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**'తన కోసం కాదు- ఇతరుల కోసం జీవించడం'**

భిన్నత్వంలో ఏకత్వమే మన దేశాన్ని కలిపి ఉంచుతోందని ప్రధాని మోదీ అన్నారు. 'భారత్ అనేక వైవిధ్యాలతో నిండిన దేశం. ఎన్నో భాషలు, సంప్రదాయాలు, ఆచారాలు, పూజా



విధానాలు ఉన్నాయి. ఈ అంతా కలిపి ఉంచే మూల సూత్రం ఏమిటన్న ప్రశ్న మనలో తలెత్తుతుంది. దానికి సమాధానం మన కోసం కాకుండా ఇతరుల కోసం జీవించడం. సంకల్పం స్పష్టంగా ఉండి, సేవాభావంతో పని చేస్తే ప్రతి ప్రయత్నం మంచి ఫలితాలనే ఇస్తుంది.' అని మోదీ చెప్పారు. సభ జరిగిన ప్రాంగణంలోని పద్మాకార పైకప్పును ప్రస్తావిస్తూ ప్రధాని సరదాగా వ్యాఖ్యానించారు. 'ఇంకేం జరిగినా మనమందరం కమలం నీడలోనే ఉన్నాం. గురుదేవ్ ఆశీస్సులతో ఈ కమలం దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుంది' అని పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో భారత్ సాధిస్తున్న పురోగతిని కూడా ప్రధాని ప్రస్తావించారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిందని చెప్పారు. స్టార్టప్ వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని, మౌలిక వసతులు, అంతరిక్ష సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుత పురోగతి సాధిస్తోందని తెలిపారు. ఈ విజయాల వెనుక యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. భారత్ కేవలం శాస్త్రీయ ఆవిష్కరణల్లో భాగస్వామి మాత్రమే కాదని, అనేక రంగాల్లో నాయకత్వం వహిస్తోందని అని మోదీ పేర్కొన్నారు. సాంకేతికత ద్వారా దూరంగా ఉన్నవారు కూడా వెంటనే కలిసే పరిస్థితి వచ్చిందని, అయితే ప్రపంచంతో అనుసంధానం ఎంత ముఖ్యమో మనతో మనం అనుసంధానం కావడం కూడా అంతే అవసరమని ప్రధాని వ్యాఖ్యానించారు. మానసిక ప్రశాంతత కలిగిన, సామాజిక బాధ్యత గల యువతే వికసిత్ భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. యోగా, ధ్యానం, మానసిక ఆరోగ్య కార్యక్రమాల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా వివరించారు.

**'ఎకాలజీ, ఎకానమీని వేరు చేయలేం'**

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్లు ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణలో మరింత చురుకుగా పాల్గొనాలని ప్రధాని పిలుపునిచ్చారు. "ఈరోజు అనారోగ్యానికి కూడా ప్రజలు సహజ చికిత్సల వైపు చూస్తున్నారు. మన భూమాతకూ సహజ వైద్యం అవసరం. రసాయన ఎరువులు భూమిని దెబ్బతీశాయి. భూమాతను రసాయనాల నుంచి రక్షించడం కూడా ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో భాగమే. ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలి. పర్యావరణ పరిరక్షణ లేకుండా స్థిరమైన అభివృద్ధి సాధ్యం కాదు. ఎకాలజీ, ఎకానమీని వేరు చేయలేం' అని మోదీ పేర్కొన్నారు.

# 5లక్షల మొక్కలు నాటిన ఒడిశా ట్రీమ్యాన్

ఒడిశాలోని పూరీ జిల్లాలో ఓ అరుదైన దృశ్యం అందరినీ ఆకట్టుకుంటోంది. రోడ్ల రెండు వైపులా వరుసగా ఉన్న చెట్లు, మొక్కలకు శంఖాలు, దేవుడి ఫొటోలు ఉన్న వస్త్రాలు కట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది. చెట్లను కాపాడేందుకు ఓ వ్యక్తి చేపట్టిన ఆ వినూత్న ప్రయత్నం ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది. పర్యావరణ పరిరక్షణ కోసం తన జీవితాన్నే అంకితం చేసిన ఆ వ్యక్తి పేరు విశ్వనాథ్ ప్రధాన్. ప్రస్తుతం ఆయన ట్రీమ్యాన్?గా గుర్తింపు పొందారు. జిల్లాలోని పిపిలి సమీపంలోని పోపరంగా పంచాయతీ హైస్కూల్‌లో విశ్వనాథ్ ప్రధాన్ ప్యూన్?గా పనిచేస్తున్నారు. సాధారణ ఉద్యోగి అయినా ప్రకృతి పట్ల ఆయనకున్న ప్రేమ మాత్రం అసాధారణం. చిన్నప్పటి నుంచే మొక్కలు నాటాలనే అభిరుచి ఉన్న ఆయన, ఇప్పుడు అదే పనిని జీవిత ధ్యేయంగా మార్చుకున్నారు. గత 25 ఏళ్లుగా నిరంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. ఇప్పటి వరకు 5 లక్షలకుపైగా మొక్కలు నాటారు. విశ్వనాథ్ ప్రధాన్ మాట్లాడుతూ, "చిన్నప్పటి నుంచే మొక్కలు నాటాలనే కోరిక ఉండేది. వర్షాకాలంలో గుంతలు తవ్వి విత్తనాలు వేస్తే అవి పెద్ద చెట్లుగా మారతాయని నమ్మకం. అందుకే ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా విత్తనాలు నాటుతాను. ప్రజలకు కూడా మొక్కలు నాటాలని చెబుతుంటాను. చెట్లు ఉంటే పర్యావరణం బాగుంటుంది" అని తెలిపారు. ఆయన ముఖ్యంగా వేప, మర్రి, రావి, బెల, కదంబ వంటి చెట్లను ఎక్కువగా నాటుతున్నారు. రోడ్ల పక్కన, స్కూల్ ప్రాంగణాల్లో, ఖాళీ స్థలాల్లో వేల సంఖ్యలో మొక్కలు నాటారు. కేవలం మొక్కలు నాటడమే కాదు అవి పెద్ద చెట్లుగా ఎదిగే వరకు వాటిని కంటికి రెప్పలా కాపాడుతున్నారు. నీళ్లు పోయడం, కలుపు తొలగించడం, విరిగిన కొమ్మలను సరిచేయడం వంటి పనులు కూడా స్వయంగా చేస్తున్నారు.

**పవిత్రంగా భావిస్తారట**

ప్రస్తుతం విశ్వనాథ్ చేపట్టిన మరో వినూత్న చర్య అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. చెట్లను ఎవరూ నరకకుండా ఉండేందుకు



వాటికి శంఖాలు, దేవుడి ఫొటోలు ఉన్న వస్త్రాలు కడుతున్నారు. దీనివల్ల ప్రజల్లో ఆ చెట్లపై ఆధ్యాత్మిక భావన పెరిగి వాటిని నరికేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని ఆయన చెబుతున్నారు. "శంఖం, శాలువా కడితే అది పవిత్రంగా భావిస్తారు. అలా చెట్లను కాపాడుకోవచ్చు" అని ఆయన వివరించారు. స్వల్ప జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటూనే విశ్వనాథ్ ప్రకృతి కోసం నిశ్శబ్దంగా సేవ చేస్తున్నారు. ఇప్పటివరకు ఐదు లక్షలకు పైగా మొక్కలు నాటినట్లు ఆయన చెబుతున్నారు. పాఠశాలకు వెళ్లే ముందు విత్తనాలు సేకరించి నర్సరీలో మొక్కలు పెంచుతారు. స్కూల్ ముగిసిన తర్వాత, సెలవు రోజుల్లో స్కూటర్‌పై తిరుగుతూ వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటుతుంటారు. పూరీతో పాటు కేంద్రాపడా, జగత్సింగ్‌పూర్, మయూరభంజ్, ఢెంకనాల్, నయాగఢ్, కటక్ వంటి జిల్లాల్లో కూడా విశ్వనాథ్ వేలాది మొక్కలు నాటారు. ప్రకృతిని పచ్చగా మార్చాలనే లక్ష్యంతో ఆయన చేస్తున్న కృషి స్థానికులను ఎంతగానో ప్రభావితం చేస్తోంది. పోపరంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శశిభూషణ్ మహాపాత్ర మాట్లాడుతూ, "ప్రపంచంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న ఈ సమయంలో చెట్లు నాటడం చాలా అవసరం. మనిషి బతకడానికి ఆక్సిజన్ ఎంత ముఖ్యమో అందరికీ తెలుసు. విశ్వనాథ్ స్కూల్ పని ముగిసిన తర్వాత కూడా మొక్కల సంరక్షణ కోసం బయటకు వెళ్తుంటారు. ఆయన చేస్తున్న సేవ నిజంగా గొప్పది" అని ప్రశంసించారు.

**నిజంగా ప్రకృతి సేవకుడు**

అయితే ఇంత పెద్ద సేవ చేస్తున్నప్పటికీ విశ్వనాథ్‌కు ఇంకా ప్రకృతి మిత్ర పురస్కారం రాకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇలాంటి వ్యక్తులను గుర్తించి గౌరవించాలని అభిప్రాయపడ్డారు. పోపరంగా పంచాయతీ మాజీ సర్పంచ్ అజయ్ ప్రధాన్ కూడా విశ్వనాథ్ సేవలను కొనియాడారు. "తన జీతంలోనే డబ్బులు ఖర్చు చేసి వివిధ జిల్లాల్లో మొక్కలు నాటుతున్నారు. ఆయన నిజంగా ప్రకృతి సేవకుడు. ప్రభుత్వం ప్రత్యేకంగా సత్కరించాలి" అని కోరారు.

స్థానికులు కూడా విశ్వనాథ్ పనిపై గర్వపడుతున్నారు. స్థానిక నివాసి ఉగ్రసేన్ బరాల్ మాట్లాడుతూ, "తన సొంత డబ్బులతో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం చిన్న విషయం కాదు. ఆయన వల్ల ఎంతోమంది చెట్ల నీడను పొందుతున్నారు" అని చెప్పారు. పర్యావరణవేత్త సరోజ్ కుమార్ జేనా మాట్లాడుతూ, "ప్రకృతిని ప్రేమించే వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరం. విశ్వనాథ్ ఎప్పుడూ బ్యాగ్‌లో మొక్కలు పెట్టుకుని తిరుగుతుంటారు. ఎక్కడ చెట్టు విరిగినా దాన్ని సరిచేస్తారు. ఇలాంటి వ్యక్తులను సమాజం ప్రోత్సహించాలి" అని అన్నారు. ఒక సాధారణ స్కూల్ ఉద్యోగి తన జీవితాన్ని ప్రకృతికి అంకితం చేసి వేలాది చెట్లకు జీవం పోస్తుండటం ఇప్పుడు అందరికీ ఆదర్శంగా మారింది. చెట్లను కాపాడేందుకు శంఖాలు, శాలువాలు కట్టి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్న విశ్వనాథ్ ఆలోచన ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణలో వినూత్న ప్రయత్నంగా నిలుస్తోంది.

## పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి



పాకిస్తాన్‌లో భారీ ఆత్మాహుతి దాడి జరిగింది. బన్ను ప్రాంతంలోని ఒక పోలీస్ చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి జరిగిన ఆత్మాహుతి దాడిలో 15 మంది పోలీసులకు మరణించారు. మరో ముగ్గురికిపైగా గాయపడ్డారు. అంతర్జాతీయ మీడియా కథనం ప్రకారం.. బన్ను ప్రాంతంలోని ఫతే ఖేల్ పోలీస్ చెక్‌పోస్టు వద్దకు పేలుడు పదార్థాలతో కూడిన ఒక వాహనం శనివారం రాత్రి దూసుకొచ్చింది. ఆ వెంటనే పేలుడు జరిగింది. ఈ ఘటనలో అక్కడ విధులు నిర్వహిస్తున్న 15 మంది పోలీసులు మరణించారు. వాహనంలో పేలుడు పదార్థాలు భారీగా ఉండటంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంది. చాలా మంది పోలీసులు చాలా దూరం ఎగిరిపడ్డారు. కొందరు పోలీసులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారి మృతదేహాల్ని బయటకు తీశారు. ఈ ఘటనతో అక్కడి నిర్మానం పూర్తిగా కూలిపోయింది. గాయపడ్డ వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు. రాత్రంతా సహాయక చర్యలు చేపట్టినట్లు స్థానిక డీఐజీ సజ్జాద్ ఖాన్ తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఆత్మాహుతి దాడిలో పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో చుట్టుపక్కల చాలా దూరం వరకు నివాసాలు, ఇతర బిల్డింగులు కూడా ధ్వంసమైనట్లు పోలీసులు తెలిపారు. కొన్ని చోట్ల పేలుడు తీవ్రతకు ఇంటి పైకప్పులు కూడా కూలిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సహాయక చర్యలు చేపడుతుండగా, ఉగ్రవాదులు మళ్లీ దాడి చేసే అవకాశం ఉందన్న భయంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో భారీ స్థాయిలో పోలీసుల్ని మోహరించినట్లు చెప్పారు. ఈ ఘటనను స్థానిక నేతలు ఖండించారు. మరోవైపు తాము పది చోట్ల దాడులకు పాల్పడినట్లు బలూచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్ సంస్థ ప్రకటించుకుంది.

## ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగిస్తాం



నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. శనివారం రష్యాలోని మాస్కోలో జరిగిన విక్టరీ డే సెలబ్రేషన్స్‌లో పుతిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధం ముగిసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ యుద్ధం ముగించేందుకు యురోపియన్ యూనియన్‌తో కూడా చర్చలు జరుపుతానని పుతిన్ వెల్లడించాడు. ఈయూ అండతోనే ఉక్రెయిన్.. రష్యాపై యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా యురోపియన్ యూనియన్ (ఈయూ)తో చర్చల కోసం జర్మనీ మాజీ ఛాన్సలర్ గెర్హార్డ్ ష్రోడెర్ పేరును పుతిన్ సూచించారు. ఈ చర్చల ద్వారా ఈయూతో రక్షణ ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కూడా పుతిన్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌తో కాల్పుల ఒప్పందానికి అంగీకరించారు. అలాగే, రెండు దేశాల మధ్య 1,000 మంది సైనిక ఖైదీల అప్పగింతకు కూడా అంగీకరించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా, యుక్రెయన్ మధ్య కుదిరిన కీలక ఒప్పందం ఇది. ఈ యుద్ధం 2022, ఫిబ్రవరిలో ప్రారంభమైంది. నాలుగేళ్లైనా ఇంకా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధంలో రష్యాకు ఉత్తర కొరియా సైన్యం కూడా సహకరించినట్లు ఆరోపణలున్నాయి. తాజాగా మాస్కోలో జరిగిన విక్టరీ పెరేడ్‌లో కొరియా సైనికులు కూడా పాల్గొనడం ఈ ప్రచారానికి బలం చేకూర్చింది.

## ఒకే చెట్టుకు 14 రకాల మామిడి పండ్లు

### చూసేందుకు జనం క్యూ- ఓ రైతు ప్రయోగాల ఫలితం

ఏ రకం మామిడి చెట్టుకు ఆ రకం మామిడి పండ్లే కాస్తాయి. కానీ ఓ ప్రగతిశీల రైతు ఇంటి ప్రాంగణంలో ఉన్న మామిడి చెట్టుకు ఏకంగా 14 రకాల మామిడి పండ్లు కాస్తాయి. అత్యంత అరుదైన దేశీయ రకాల మామిడి పండ్లు ఈ చెట్టుకు కాస్తున్నాయి. సాధారణంగానైతే మామిడి సీజన్ 2-3 నెలలే. కానీ ఈ స్పెషల్ మ్యాంగో ట్రీపై 14 రకాల పండ్లు వేర్వేరు సమయాల్లో పూతకు, కాపునకు వస్తాయి. దాదాపు 6 నెలల పాటు నిరంతరం ఏదో ఒక రకం మామిడి పండ్లను ఈ చెట్టు ఇస్తూనే ఉంటుంది. ఇంతకీ ఈ విశిష్టమైన వృక్షం ఎక్కడుంది? దీనికి 14 రకాల మామిడి పండ్లు ఎలా కాస్తున్నాయి? ఇందుకోసం ఆ ప్రగతిశీల రైతు ఏం చేశారు? ఈ కథనంలో తెలుసుకుందాం. గుజరాత్‌లోని అమ్రేలి జిల్లా గిర్ కేసర్ రకం మామిడి పండ్ల తోటలకు నిలయం. ఈ జిల్లాలోని ధారి తాలూకా దిటాలా గ్రామానికి చెందిన ఓ ప్రగతిశీల రైతు పేరు ఉకాభాయ్ భట్టి. ఆయన ఇంటి ప్రాంగణంలో ఒక దేశీయ మామిడి చెట్టు ఉంది. ఆ చెట్టుపైనే 14 రకాల మామిడి పండ్లను పండించాలని ఉకాభాయ్ భావించారు. ఇందుకోసం ప్రయోగాత్మకంగా మల్టిపుల్ టాప్ వర్కింగ్ అనే ప్రత్యేకమైన అంటుకట్టే పద్ధతిని ఆయన ఉపయోగించారు. దేశీయ మామిడి చెట్టుకు ఉన్న ప్రధానమైన లావుపాటి కొమ్మలను కొంత ఎత్తులో కత్తిరించారు. కత్తిరించిన కొన్ని రోజులకు ఆ గాయాల భాగాల నుంచి కొత్తగా లేత కొమ్మలు పుట్టుకొచ్చాయి. గుజరాత్‌లోని ప్రసిద్ధ గిర్ కేసర్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 14 రకాల నాణ్యమైన మామిడి చెట్ల కొమ్మలను ఉకాభాయ్ సేకరించారు. చెట్టుకు ఉన్న 14 వేర్వేరు కొత్త కొమ్మలపై, సేకరించిన 14 రకాల మామిడి కొమ్మలను విడివిడిగా అంటుకట్టారు. ఒక కొమ్మపై కేసర్, ఇంకొక కొమ్మపై అల్ఫోన్సో, మరో కొమ్మపై లంగ్డా ఇలా ప్రతీ కొమ్మకూ ఒక రకాన్ని అమర్చి గ్రాఫ్టింగ్ టేప్‌తో గాలి చొరబడకుండా గట్టిగా కట్టేశారు. కొన్ని వారాల్లోనే ఆ 14 రకాల కొమ్మలు ప్రధాన వృక్షంతో పూర్తిగా కలిసిపోయి, ఆ చెట్టు నుంచి వచ్చే పోషకాలతో స్వతంత్రంగా పెరగడం ప్రారంభించాయి. ఆయా గ్రాఫ్టింగ్ జాయింట్ల కింద వచ్చే నాటు చిగుళ్లను ఆయన ఎప్పటికప్పుడు తుంచేస్తూ, కేవలం అంటుకట్టిన రకాలే పెరిగేలా జాగ్రత్త పడ్డారు. ఈ విధంగా ఒకే చెట్టుపై 14 రకాల మామిడి పండ్లను ఉకాభాయ్ విజయవంతంగా పండించారు. గుజరాత్‌లో మామిడి సీజన్ మార్చి నెల మధ్య నుంచి జూన్ వరకు ఉంటుంది. ఈ సీజన్ మే నెలలో గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. ఏటా మామిడి సీజన్‌లో ఉకాభాయ్ ఇంట్లోని చెట్టు వివిధ రంగులు, ఆకారాలు, రుచులతో కూడిన మామిడి పండ్లతో కళకళలాడుతుంటుంది. సాధారణంగా మామిడి సీజన్ 2 నుంచి 3 నెలలు మాత్రమే ఉంటుంది. కానీ ఈ చెట్టుపై ఉన్న 14 మామిడి రకాలు వేర్వేరు సమయాల్లో పూతకు, కాపునకు వస్తాయి.

# ఈ ప్రపంచానికి పునాది అమ్మే



-మొదటిపేజీ తరువాయి
ప్రేమతోనే మొదలవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా ఆయన ప్రత్యేక సందేశం ఇచ్చారు. అమ్మ త్యాగం, లాలన వెలకట్టలేనివని చెప్పారు. కరుణకు మారుపేరుగా అమ్మ నిలుస్తుందన్నారు. ఆమె నిశ్శబ్ద శక్తికి నిలువుటద్దం అని కొనియాడారు. " అమ్మ స్వభావం చాలా సున్నితమైనది. కానీ ఆమె ఆత్మస్థైర్యం మాత్రం ఎంతో గొప్పది. తల్లుల అంకితభావమే కుటుంబాలను చక్కగా తీర్చిదిద్దుతుంది. సమాజానికి దిశానిర్దేశం చేస్తూ మానవత్వాన్ని కాపాడేది అమ్మే" అని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. బిడ్డలకు గురువు, దైవం, మార్గదర్శి అన్నీ ఆమేనని స్పష్టం చేశారు.

**తల్లి స్ఫూర్తితోనే నైతిక విలువల పాఠాలు - మంత్రి లోకేశ్**

కనిపించే ప్రతి స్త్రీ, కని పెంచిన అమ్మతో సమానమని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమ్మకు చెప్పలేని పని ఎప్పుడూ, ఎవ్వరూ చేయొద్దని సూచించారు. ఇదే ప్రతి అమ్మ కోరుకునే అసలైన కానుక అని చెప్పారు. చిన్నప్పటి నుంచే మహిళలను గౌరవించడం అమ్మే నేర్పిందన్నారు. స్త్రీ, పురుషులు సమానం అనే భావన తనలో తల్లి వల్లే కలిగిందని గుర్తుచేసుకున్నారు. తన తల్లి స్ఫూర్తితోనే విద్యా శాఖలో నైతిక విలువల పాఠాలను ప్రవేశపెట్టామని లోకేశ్ వెల్లడించారు. మహిళా సాధికారతే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2 పథకం కింద ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని వివరించారు.

**వృద్ధాశ్రమాల్లో వదిలేయొద్దు - హోంమంత్రి అనిత**

ప్రతి మనిషి జీవితంలో తల్లి పాత్ర చాలా కీలకమని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. కృష్ణా జిల్లా గోశాలలోని బంధం వృద్ధాశ్రమాన్ని ఆమె ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌తో కలిసి సందర్శించారు. వృద్ధ మాతృమూర్తులకు పండ్లు, చీరలు పంపిణీ చేశారు. ఆ దేవుడు కూడా మొదటి స్థానాన్ని తల్లికే ఇస్తాడని ఆమె గుర్తు చేశారు. జన్మనిచ్చే సమయంలో తల్లి 50 కత్తిపోట్ల నొప్పులను భరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పస్తులున్నా, పిల్లలకు కడుపు నిండా పెట్టి పెంచుతుందని చెప్పారు. వయసు పైబడిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వదిలేయొద్దని పిల్లలకు సూచించారు. వారిని చూసుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. తల్లి విలువ తెలియాలనే తన పిల్లలను కూడా ఆశ్రమానికి తీసుకొచ్చానని అనిత తెలిపారు.

**కర్నూలులో అమ్మకు పాదపూజ**

మాతృదినోత్సవం సందర్భంగా కర్నూలులో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. అవోపా ఆధ్వర్యంలో తల్లులకు పాదపూజ నిర్వహించారు. నగరంలోని అవోపా భవనంలో జరిగిన ఈ వేడుకలో పిల్లలు తమ తల్లుల పాదాలను కడిగి పూజలు చేశారు. భారతీయ సంస్కృతిలో తల్లి పూజకు ఎంతో విశిష్టత ఉందని మహిళా సభ్యులు తెలిపారు. ప్రతి రోజూ తల్లి పాదాలకు వందనం చేస్తే అంతా మంచే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు, పిల్లలు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు.

# వైద్యసేవలను సమర్థంగా అందించే 'సంజీవని'

-మొదటిపేజీ తరువాయి
71 లక్షల మందితోపాటు, వసతిగృహ విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. సంజీవని ప్రాజెక్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5.20 కోట్ల జనాభాకు డిజిటల్ ఆరోగ్య సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**గతేడాది ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన సీఎం**

కుప్పంలో గతేడాది జులైలో టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభంతో సంజీవని పైలట్ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఇక్కడ 3 లక్షల మందిని డిజిటల్ వేదికతో అనుసంధానం చేసి ఆరోగ్య పరిస్థితి పర్యవేక్షిస్తున్నారు. ఫలితమివ్వడంతో చిత్తూరు జిల్లావ్యాప్తంగా 18 లక్షల మందికి సంజీవని సేవలు చేరువ చేసే చర్యలు చేపట్టారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా నారావారిపల్లె, అన్నమయ్య జిల్లా పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం మండలాలకూ సేవలు విస్తరిస్తున్నారు. 33 మండలాల్లోని ఒక ప్రాంతీయ ఆసుపత్రి, సీహెచ్‌సీ, 66 పీహెచ్‌సీలు, 484 విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సేవలు అందుబాటులోకి తెచ్చారు.

**సంజీవని సిటిజన్ వెల్‌నెస్ యాప్**

సంజీవని ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ డెలివరీ ప్లాట్‌ఫామ్ (ఐహెచ్‌డీపీ) ద్వారా ఇప్పటివరకు 1.75 లక్షల ఓపీలు నమోదయ్యాయి. 3.69 లక్షల మందికి మందులు పంపిణీ చేశారు. 21,441 మందికి ల్యాబ్ పరీక్షలు చేశారు. ఇంటిగ్రేటెడ్ కేర్ కోఆర్డినేషన్, కమాండ్ కంట్రోల్ సేవలు 1.24 లక్షల మంది పొందారు. టెలి కన్సల్టేషన్ అండ్ రిమోట్ కేర్ విభాగంలో 1.20 లక్షల మందికి సేవలు అందించారు. సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా 5,275 మందికి స్పెషలిస్టు కన్సల్టేషన్లు అందించారు. ఏఐ ఆధారిత వైద్యసేవలు, ఆరోగ్య రికార్డుల సదుపాయం ఉన్న సంజీవని సిటిజన్ వెల్‌నెస్ యాప్‌ను 4,691 మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు.

**అమలుకు సిద్ధమవుతోన్న ప్రభుత్వం**

సంజీవని ప్రాజెక్టు రాష్ట్రవ్యాప్త అమలుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. 108, 104 అత్యవసర సంచార సేవలతోపాటు ఆయుష్ వైద్య విధానాలనూ అనుసంధానం చేయాలని నిర్ణయించింది. ఆర్థిక, సాంకేతిక ఇతరత్రా అడ్డంకులతో ప్రాజెక్టు అమలులో జాప్యం జరుగుతోంది. జులై నుంచి ప్రాజెక్టు అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తున్నా మరో నాలుగైదు నెలలు పట్టొచ్చనే వాదన వినిపిస్తోంది. ప్రత్యేక విభాగాలు, ఐటీ వ్యవస్థలు, మౌలిక సదుపాయాలు, మానవ వనరులు సమకూరకపోవడమే ఇందుకు కారణం.

**జిల్లాకో సమన్వయ అధికారి**

సంజీవని అమలుకు జిల్లాకో సమన్వయ అధికారిని, అమలు దశలో సాంకేతిక, నిర్వహణ సహకారం అందించడానికి ప్రతి జిల్లాకు ఐదుగురు ఇంప్లిమెంటేషన్ స్పెషలిస్టులు, ప్రతి నియోజకవర్గానికో ప్రత్యేక అధికారి, ఆరోగ్య కేంద్రం స్థాయిలో పేషెంట్ కేర్ మేనేజర్, కోఆర్డినేటర్, బ్యాకప్ కోఆర్డినేటర్లను నియమించాలి.

# సైలెంట్‌గా కేతిరెడ్డి?

**అనంతపురం :** ఏపీ వైసీపీలో ఆ లీడర్ స్టైలే వేరు. ఎడ్యుకేటేడ్. వాస్తవాలకు దగ్గరగా..ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే మనస్తతత్వం ఉన్న ఆయన..గత ఎన్నికల్లో ఓటమి తర్వాత కొన్నాళ్లు మౌనంగా ఉండిపోయారు. ఆ తర్వాత తెరమీదకు వచ్చి ప్రెస్‌మీట్లు, ఫీల్డ్‌లో ఆందోళనలు, కూటమి సర్కార్‌పై అటాక్ చేస్తూ లైమ్‌లైట్‌లో కొనసాగారు. ఇప్పుడేమైందో ఏమో తెలియదు కానీ మళ్లీ సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో ఎప్పుడూ ప్రజల్లో ఉండే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మళ్లీ సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడే కేతిరెడ్డి..ఎన్నికల ఫలితాల తర్వాత కొన్నాళ్లు మౌనంగా ఉండిపోయారు. ఈ మధ్యకాలంలో ఫుల్ యాక్టివ్ అయ్యారు. ప్రెస్‌మీట్లు, ఆందోళనలు, క్యాడర్‌తో మీటింగ్‌లు పెట్టి లైమ్‌లైట్‌లో కనిపించారు. ఇప్పుడు మళ్లీ కేతిరెడ్డి ఎక్కడా కనిపించట్లేదన్న టాక్ వినిపిస్తోంది. అయితే ఆయన మళ్లీ సైలెంట్ కావడానికి వైసీపీలో నాయకుల మధ్య ఉన్న విభేదాలే కారణమా లేక మరేదైనా రీజన్ ఉందా.? అనే చర్చ మొదలైంది.రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మధ్య వైరం నడుస్తోందట. ధర్మవరంలో రాప్తాడు నియోజకవర్గం వైసీపీ పార్టీ ప్రారంభిస్తానని ప్రకాష్ రెడ్డి స్టేట్‌మెంట్ ఇవ్వడంతో ఇద్దరి మధ్య కోల్డ్ వార్ స్టార్ట్ అయిందట. పార్టీ అధికారంలో ఉన్నప్పటి నుంచే తోపుదుర్తి, కేతిరెడ్డి మధ్య గ్యాప్ కొనసాగుతుందని వైసీపీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఇక ధర్మవరంలో పార్టీ ఆఫీస్‌ను పెడుతానంటూ తోపుదుర్తి ప్రకటించడంతో కేతిరెడ్డి కౌంటర్ ఇచ్చారు. ధర్మవరంలో ఆఫీస్ పెట్టడం ఎందుకు..ఫోన్ ఎత్తి సమాధానం చెప్తే సరిపోతుంది కదా అంటూ సెటైర్ వేశారు. ముందుగా రాప్తాడులో పార్టీ ఆఫీస్ పెట్టుకోమనంటూ అంటూ కేతిరెడ్డి గట్టిగానే సమాధానం ఇచ్చారు.అయితే కేతిరెడ్డిపై పైచేయి సాధించే ఉద్దేశంతో ఎలాగైనా ధర్మవరం వైసీపీకి కొత్త నాయకుడిని తేవాలని తోపుదుర్తి ఇంటర్నల్‌గా గట్టి ప్రయత్నాలే చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కేతిరెడ్డి ప్రత్యర్థి అయిన అంగబలం, అండ బలం ఉన్న ఓ మాజీ ఎమ్మెల్యేను వైసీపీలోకి తీసుకొచ్చేందుకు ప్రకాష్ రెడ్డి శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నట్లు టాక్. అయితే




ధర్మవరంలో కేతిరెడ్డిని కాదని వైసీపీ అధిష్టానం మరొకరికి అవకాశం ఇస్తుందా? అంతటి సాహసం చేస్తుందా అనేది చర్చనీయాంశంగా మారింది.కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి వైసీపీ అధిష్టానంతో మంచి సంబంధాలే ఉన్నాయట. కేతిరెడ్డి దూకుడు, ప్రత్యర్థులపై విరుచుకుపడే తత్వం చూసిన అధిష్టానం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా నియమించాలని చూసిందట. కానీ సామాజిక సమీకరణాల నేపథ్యంలో బీసీలకు కేటాయించినట్లు చెబుతున్నారు. ధర్మవరం నియోజక వర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి వైసీపీలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఆయన పార్టీ మారతారని గుసగుసలు వినిపించాయి.రాజకీయాలలో గెలుపోటములు సహజం అంతమాత్రాన కన్నతల్లి లాంటి పార్టీని వీడుతామా అంటూ..తాను వైసీపీ అధినేత జగన్ వెంటే ఉంటానని ప్రచారానికి ఫులిస్టాప్ పెట్టారు కేతిరెడ్డి. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుంది అప్పుడు 2.ఓలో తామేంటో చూపిస్తామంటూ వైసీపీ క్యాడర్‌లో ఉత్తేజాన్ని నింపే ప్రయత్నం చేశారు. అయితే కేతిరెడ్డి ఎప్పుడు ఫుల్ యాక్టివ్ మోడ్‌లోకి వస్తారోనని ఎదురు చూస్తోంది ధర్మవరం వైసీపీ క్యాడర్.ఉమ్మడి అనంతపురం జిల్లా వైసీపీలో ప్రకాశ్ రెడ్డి వర్సెస్ కేతిరెడ్డి మధ్య 2019 నుంచి కోల్డ్ వార్ నడుస్తోందట. అప్పట్లో మంత్రి పదవి విషయంలో ఇద్దరి మధ్య కాస్త డిఫరెన్సెస్ వచ్చాయట. వైసీపీ హయాంలో జిల్లాలో కురుమ సామాజిక వర్గానికి మంత్రి పదవి రావడానికి, రెడ్డి సామాజిక వర్గానికి అమాత్యయోగం దక్కకపోవడానికి కేతిరెడ్డే కారణమని అని తోపుదుర్తి కినుక వహించారట. దీంతో అప్పటి నుంచి ఇద్దరి మధ్య గ్యాప్ నడుస్తోందట. అదీకాక ధర్మవరం వైసీపీ టికెట్‌ను గోరంట్ల మాధవ్‌కు ఇప్పించాలని తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కాస్త గట్టిగానే ట్రై చేశారట. ఈ ఇష్యూతో కేతిరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి మధ్య గ్యాప్ మరింత పెరిగిందట. ఓ వైపు పార్టీ ఓడిపోయి ప్రతిపక్షంలో ఉండగా..నేతల గొడవతో తమను ముందుండి నడిపించే నాయకులు లేరని..క్యాడర్ ఆందోళన చెందుతోందట. ఇప్పటికైనా కేతిరెడ్డి యాక్టివ్ మోడ్‌లోకి వచ్చి..ధర్మవరం పార్టీ యాక్టివిటీని స్పీడప్ చేయాలని రిక్వెస్ట్ చేస్తున్నారట

## ఏపీకి జాతీయస్థాయి గుర్తింపు

-మొదటిపేజీ తరువాయి
దేశంలోనే మూడో ర్యాంకు దక్కించుకుంది. రూ. 25 లక్షల నగదు బహుమతిని సొంతం చేసుకుంది.

**బ్లాక్ పంచాయతీగా 'కుప్పం' సత్తా**

గ్రామ పంచాయతీలతో పాటు బ్లాక్ పంచాయతీల విభాగంలోనూ ఏపీకి అవార్డు దక్కింది. కేంద్రం 'నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్-2025' పేరిట బ్లాక్ పంచాయతీలకు అవార్డులు ప్రకటించింది. ఇందులో ఉత్తమ బ్లాక్ పంచాయతీగా చిత్తూరు జిల్లా 'కుప్పం' ఎంపికైంది. దేశవ్యాప్తంగా కుప్పం బ్లాక్ పంచాయతీ మూడో ర్యాంకు సాధించింది. ఈ ర్యాంకుతో పాటు రూ. 1.50 కోట్ల భారీ నగదు బహుమతిని చేజిక్కించుకుంది.

**విజేతలకు డిప్యూటీ సీఎం అభినందనలు**

రాష్ట్రంలోని పంచాయతీలు జాతీయ స్థాయిలో సత్తా చాటడం పట్ల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయాలన్నది సీఎం చంద్రబాబు నాయుడి దృఢ సంకల్పం అని ఆయన అన్నారు. సీఎం నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని పవన్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్థానం దక్కడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో జాతీయ అవార్డులు సాధించిన శృంగవరం, బొక్కసంపాలెం, చెముళ్లపల్లి, గుండమాల, కుప్పం పంచాయతీల సర్పంచులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు ఆయన అభినందనలు తెలిపారు. అలాగే అధికార యంత్రాంగానికి, గ్రామ ప్రజలకు తన ప్రశంసలు తెలిపారు. స్థానిక సంస్థలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న సీఎం చంద్రబాబుకు పవన్ కల్యాణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**దేశంలో ఏపీ స్థానం ఎక్కడంటే?**

ఈ ఏడాది ప్రకటించిన జాతీయ పంచాయతీ అవార్డుల్లో ఏపీ అత్యుత్తమ పనితీరు కనబరిచింది. మొత్తం ఆరు అవార్డులు సాధించిన కర్ణాటక రాష్ట్రం దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. ఐదు అవార్డులు సాధించిన ఆంధ్రప్రదేశ్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. అలాగే, ఒడిశా రాష్ట్రం కూడా ఐదు అవార్డులతో ఏపీతో పాటు సంయుక్తంగా రెండో స్థానాన్ని పంచుకుంది.

**వచ్చే నెల 3న ఢిల్లీలో వేడుక**

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పురస్కార్ కింద దేశవ్యాప్తంగా మొత్తం 34 గ్రామ పంచాయతీలకు కేంద్రం ర్యాంకులు ఇచ్చింది. వీటికి రూ. 25 లక్షల నుంచి కోటి రూపాయల వరకు నగదు బహుమతులు అందుతాయి. అలాగే, నానాజీ దేశ్‌ముఖ్ పురస్కార్ కింద దేశవ్యాప్తంగా 8 బ్లాక్ పంచాయతీలను ఎంపిక చేసి, రూ. 50 లక్షల నుంచి రూ. 5 కోట్ల వరకు నగదు ఇవ్వనున్నారు. ఈ జాతీయ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని వచ్చే నెల(జూన్) 3వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలో అట్టహాసంగా నిర్వహించనున్నారు. అవార్డులు సాధించిన పల్లెల సర్పంచులు, అధికారులు ఆ వేదికపై ఈ పురస్కారాలను అందుకోనున్నారు. ఈ ఘనత సాధించడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## చంద్రబాబు, పవన్ నివాసాలకు వెళ్లిన ప్రధాని మోదీ

-మొదటిపేజీ తరువాయి
ఈ నేపథ్యంలో పవన్ ఇంటికి మోదీ వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంద్రబాబు నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ఆత్మీయ భేటీ గంట పది నిమిషాల పాటు సాగింది. ఇరువురు నేతలు పలు అంశాలపై చర్చించుకున్నట్లు సమాచారం. చంద్రబాబు నివాసానికి వెళ్లిన ప్రధానమంత్రి మోదీని నారా కుటుంబ సభ్యులు ఆత్మీయంగా స్వాగతించారు. అనంతరం ప్రధాని మోదీని చంద్రబాబు, లోకేశ్ లోపలికి తోడ్కొని వెళ్లారు. అనేక సందర్భాల్లో సీఎం చంద్రబాబు, నారా లోకేశ్ భేటీ అయినా స్వయంగా ప్రధాని మోదీ వారి ఇంటికి రావడాన్ని నారా కుటుంబం ప్రత్యేకంగా భావించింది. మోదీని స్వాగతించడం నుంచి ఆతిథ్యం వరకు అన్ని విషయాలను మంత్రి నారా లోకేశ్ దగ్గరుండి పర్యవేక్షించినట్లు తెలిసింది.

**తెలుగు సంప్రదాయం ఉట్టిపడే వంటకాలు**

ప్రధానికి ఇచ్చే ఆతిథ్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడే వంటకాలు ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు సమాచారం. ప్రభుత్వాలు, రాజకీయ లెక్కలకు భిన్నంగా లోకేశ్?తో ప్రధాని మోదీ అనుబంధం నెలకొంది. లోకేశ్ భవిష్యత్?కు స్వయంగా ప్రధాని మోదీ ఇప్పటికే పలు సూచనలు చేశారు. గతంలో ఢిల్లీలో స్వయంగా లోకేశ్?ను ఇంటికి ఆహ్వానించి, సుమారు రెండున్నర గంటల పాటు సమయం వెచ్చించారు. స్వయంగా ప్రధాని మోదీ తమ ఇంటికి రావడాన్ని నారా కుటుంబం ప్రత్యేకంగా చూస్తుంది. ఇదొక గొప్ప సందర్భమని చంద్రబాబు, లోకేశ్?లు భావిస్తున్నట్లు సమాచారం. ప్రధాని తమ ఇంటికి రావడాన్ని ప్రత్యేకమైన, గత సమావేశాలకు భిన్నమైన సందర్భంగా చూస్తున్నారు.

**ఎప్పటికీ గుర్తుంచుకోదగిన చిరస్మరణీయమైన రోజు**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమ నివాసంలో ఘన స్వాగతం పలకడం మాకు దక్కిన గొప్ప గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఈరోజు తమ కుటుంబం ఎప్పటికీ గుర్తుంచుకోదగిన ఒక చిరస్మరణీయమైన రోజని కొనియడారు. ప్రధాని మోదీ తన నివాసానికి రావడం పై ముఖ్యమంత్రి చంద్రబాబు తన 'ఎక్స్' ఖాతాలో ట్వీట్ చేశారు.
మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా తన నివాసానికి వచ్చి పరామర్శించటం పట్ల పవన్ కల్యాణ్ స్పందించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

**స్పందించిన ప్రధాని**

సీఎం చంద్రబాబు నివాసానికి వెళ్లిన ఫొటోలను ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. చంద్రబాబు నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యుల్ని కలిసినట్లు తెలిపారు. వారందరినీ కలవడం, ఎన్నో విభిన్నమైన అంశాలపై అభిప్రాయాల్ని పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

## కేంద్ర కేబినెట్ లో మార్పులు


**విజయవాడ :** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చాయి. భారతీయ జనతా పార్టీకి అనుకూల ఫలితాలు ఇవి. పశ్చిమ బెంగాల్ చేజిక్కడం.. అస్సాంలో రెండోసారి అధికారంలోకి రావడం భారతీయ జనతా పార్టీ దూకుడు అప్రతిహాసంగా కొనసాగుతోంది. మరోవైపు పుదుచ్చేరిలో సైతం తిరిగి ఎన్ డి ఏ గెలుపొందడం ఆ పార్టీకి మరింత ఊపు తెచ్చింది. మరోవైపు కేరళలో మూడు అసెంబ్లీ స్థానాలతో ఉనికి చాటుకుంది. తమిళనాడులో ఆ పార్టీ గెలవకపోయినా అస్తవ్యస్త వాతావరణం తనకు అనుకూలంగా మార్చుకునే పనిలో ఉంది బిజెపి. అయితే ఇదే ఊపుతో మిగతా రాష్ట్రాలపై దృష్టి పెట్టాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. ఇప్పటికే 29 రాష్ట్రాలకు గాను.. 20 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉంది. అందుకే మిగతా రాష్ట్రాలపై ఫుల్ ఫోకస్ పెడుతోంది. అందులో భాగంగా కేంద్ర క్యాబినెట్ విస్తరణ చేపట్టి.. అన్ని రాష్ట్రాలకు సమప్రా ధాన్యం ఇవ్వాలని చూస్తోంది. ఏపీ నుంచి ఇద్దరికీ మంత్రి పదవులు ఖాయమన్న టాక్ నడుస్తోంది.ప్రస్తుతం ఏపీ నుంచి కేంద్ర మంత్రివర్గంలో ముగ్గురు ఉన్నారు. క్యాబినెట్ హోదాలో కింజరాపు రామ్మోహన్ నాయుడు ఉన్నారు. స్వతంత్ర హోదాలో గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. సహాయ మంత్రిగా బిజెపి ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ కొనసాగుతున్నారు. ఎన్డీఏకు 21 మంది ఎంపీలు ఉండగా.. అందులో ముగ్గురికి కేంద్ర మంత్రి పదవులు ఉన్నాయి.. ఇంకా 18 మంది ఎంపీలు ఉన్నారు. అయితే ఇప్పుడు రెండు మంత్రి పదవులు ఇస్తే ఏ పార్టీకి కేటాయిస్తారు అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే టిడిపి తో పాటు బిజెపికి రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉంది. ఇప్పుడు లేనిది ఒక్క జనసేనకు మాత్రమే.ఈసారి కచ్చితంగా కేంద్రమంత్రివర్గంలోకి జనసేన వెళ్లడం ఖాయమని తెలుస్తోంది. ప్రస్తుతం జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. కాకినాడ నుంచి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, మచిలీపట్నం నుంచి వల్లభనేని బాలసౌరి ఉన్నారు. ఆ ఇద్దరిలో ఒకరికి మంత్రి పదవి ఖాయమని ప్రచారం సాగుతోంది. బాలశౌరి కాపు సామాజిక వర్గానికి చెందిన నేత. గతంలో రెండు సార్లు ఎంపీగా కూడా ఎన్నికయ్యారు. ఆయనకు తప్పకుండా కేంద్ర క్యాబినెట్లో చోటు దక్కుతుంది అన్న టాక్ నడుస్తోంది. మరోసారి బిజెపికి ఛాన్స్ ఇస్తే మాత్రం దగ్గుబాటి పురందేశ్వరికి బెర్త్ లభించే అవకాశం ఉంది. సీఎం రమేష్ కూడా ఒక ఆశావహుడిగా ఉన్నారు. టిడిపికి ఇస్తే మాత్రం రాయలసీమ నుంచి.. రెడ్డి సామాజిక వర్గ పరంగా, మహిళా నేతపరంగా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కి ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# కీ.శే. శ్రీ పి.వి. రావు గారి 78వ జయంతి వేడుకలు

**నంద్యాల:మే= 10 ప్రజాజ్యోతి** ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బొంత మహేష్ షెడ్యూల్డు కులాల వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్మించి, మాల మహానాడు సంస్థను స్థాపించి, ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం సాగించిన ప్రముఖ దళిత నాయకులు కీ.శే. పివి రావూగారి 78వ జయంతి వేడుకలను మే 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాలలో ఘనంగా నిర్వహించారుఎస్సీ ఎస్టీ జిల్లా అధ్యక్షుడు బొంత మహేష్ అదివారం పివి రావు చిత్ర పటానికి పులమాలలవేసి కేక్ కట్ చేసి ఘనంగా జయంతి వేడుకలు జరుపుకొన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చట్టాన్ని సవాలు చేస్తూ సాగిన న్యాయపోరాటంలో, 2004లో సుప్రీంకోర్టు ఆ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన తీర్పులో పి.వి.రావు గారి పాత్ర విశేషమని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో నిలబెట్టి, సామాజిక న్యాయం, సమాన హక్కులు, దళితుల గౌరవం కోసం జీవితాంతం కృషి చేసిన పి.వి.రావు



గారు మాల సమాజానికి ఆదర్శప్రాయ నాయకులని తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు శ్రేణులు, యువత,



ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని జయంతి కార్యక్రమాలను విజయవంతం చేశారు

# పోలవరం నిర్వాసితుల సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి

## ట్రక్చర్ వ్యాల్యుయేషన్,ఆర్ఈఆర్ ప్యాకేజీపై వినతిపత్రం!.. ఎమ్మార్పీఎస్ మండల కమిటీ నాయకులు
## ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వెంకన్న!..
## ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బింగి విష్ణుమూర్తి!..





**వి.ఆర్.పురం,మే10(ప్రజాజ్యోతి ప్రతినిధి)**పోలవరం ప్రాజెక్టు కోసం,నిర్వాసితుల త్యాగం,నిర్వాసితులు పడుతున్న ఇబ్బందులు,స్ట్రక్చర్ వెలివేషన్ (నిర్మాణాల విలువ నిర్ధారణ) మరియు ఆర్"అండ్"ఆర్, పరిహారం త్వరితగతిన అందించాలని కోరుతూ పోలవరం జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్, ఎమ్మార్పీఎస్,కమిటీ వినతిపత్రాన్ని సమర్పించి విషయాన్ని వివరించామని, ఎమ్మార్పీఎస్ కమిటీ నాయకులు,పోలవరం జిల్లా,ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వెంకన్న,జిల్లా కన్వీనర్ బింగి విష్ణుమూర్తి,పేర్కొన్నారు. ఆదివారం,చింతూరు పర్యటనలో ఉన్న కలెక్టర్‌ను కమిటీ ప్రతినిధులు కలిసి నిర్వాసితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించామని తెలిపారు. ముంపు ప్రాంతాల్లోని ఇళ్లు,ఇతర నిర్మాణాలకు సంబంధించి శాస్త్రీయంగా విలువకట్టి,పెరిగిన ధరలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని, ఆర్ ఆర్, ప్యాకేజీ: అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా పునరావాస ప్యాకేజీని ఎటువంటి జాప్యంలేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. సర్వేలసమయంలో తలెత్తిన లోపాలనుసరిదిద్ది నిజమైన నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరామని వివరించామని పేర్కొన్నారు. ఎమ్మా ర్పీఎస్ కమిటీ వినతిపై కలెక్టర్ దినేష్ కుమార్ సానుకూలంగా స్పందించారని వారు సంతోషం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టువల్ల ఇళ్లు, భూములు,కోల్పోయిన గిరిజన, గిరిజనేతర కుటుంబాలకు ప్రభుత్వంఅండగా ఉంటుందని, జిల్లా కలెక్టర్,దినేష్ కుమార్, భరోసా ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయంజరిగేలా అధికారులకు ఆదేశాలుజారీ చేస్తామని, ప్రక్రియనువేగవంతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారనిసూచించారు.ఈకార్యక్రమంలోమండల అధ్యక్షులు గడ్డం కృపారావు,ఎమ్మార్పీఎస్ యూత్ నాయకులు ఉంగు టూరి వినోద్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# ఇది 100% నిజంఅమ్మ ప్రేమకు చిరునామా

**సీనియర్ న్యూస్ రిపోర్టర్ యాలం సీతారామయ్య!..**

**వి.ఆర్.పురం,మే10(ప్రజాజ్యోతి ప్రతినిధి)**సృష్టి ఆరంభంలోనే శ్రమించిన అమృత ధార,నిర్వచనం లేని ప్రేమానురాగాల సాగరం,నిస్వార్థానికి మారుపేరు,నిత్యసత్య స్వరూపిణి,మానవరూపంలో ఉన్న దైవంఅమ్మని సీనియర్ న్యూస్ రిపోర్టర్ యాలం సీతారామయ్య,వివరించారు. ఆదివారం,మాతృమూర్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని,99 సంత్సరాల, తనతల్లితో ప్రేమాభిమానాలు ఇప్పటికీ పొందుతున్నానని ప్రజాజ్యోతి,రిపోర్టర్ కి,వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,9ఏళ్ల తొమ్మిది నెలలు గర్భాన మోసి,కడుపులో నన్నుదాచి ఎముకలు కరిగిపోతున్నా, నవ్వుతూ భరించిందిఅమ్మే అనే విషయాన్నిమరవొద్దని ఆయన సూచించారు.ఎంతోఆవేదన,ప్రాణాన్నిపణంగాపెట్టి,నాకుప్రాణం పోసిన అద్భుతం ఆఅమృత మూర్తి అమ్మని పేర్కొన్నారు. కన్నుతెరిచి చూడకముందే,భవిష్యత్తుపై కలలుక న్నావు, మొదటిశ్వాసలో నీ రూపాన్నిచూసి,లోకాన్నే జయించాననే ధీమా ఇచ్చావు!కనురెప్పలాకాచావు,నీడలా నడిపావని ఆయన చెప్పారు.ఆకలినవ్వులకు నాన్నను అడిగావు,కన్నీటిచుక్కకు నీకన్నులనే ధారపోశావు అమ్మా! నీఒడి ఒకపవిత్ర క్షేత్రం. నీకౌగిలి ఒకఅభయహస్తం,నీలాలన ఒకజోలపాట, నీఆశీస్సులు, ఒకరక్షాకవచం,గెలుపులో నీనవ్వు,ఓటమిలో నీధైర్యం, అడుగ డుగునానీవే!ఊపిరిలోనీవే! త్యాగానికి నిలువెత్తు రూపం



అమ్మా అంటూ ఆనంద బాష్ప యాలు వస్తున్నాయని వివరించారు.ప్రేమకుఅర్థం చెప్పిన కావ్యం, నిజమైన దైవంఎదురుగా ఉంటే, కళ్ళల్లో దేవున్ని వెతికేది ఎందుకు?అమ్మే దైవం,ఈమట్టిలో పుట్టిన అక్షరసత్యంమని కొనియాడారు. సృష్టిలో ఏ ప్రేమఅడగదు ప్రతిఫలం,ఆత్యాగానికి దక్కదు ఏబహుమతి, నీరుణం తీర్చుకోవడం ఈజన్మకు సాధ్యమా అమ్మాని



ఆనందిచారు.నీచరణాల సేవలో తరించడమే భాగ్యం అమ్మా.అమ్మకు వందనం.. !అభివందనం !వివిధ పత్రికల్లోపనిచేసేమి త్రులకు,శ్రేయోభిలాషులకు మాతృ మూర్తులు అందరికీ మాతృదినోత్సవ శుభాకాంక్షలతో అంటూ ఆయన ముగించారు.

# తూకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు





**చాగలమర్రి , మే 10( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా చాగలమర్రి గ్రామంలో గత మూడు రోజుల నుంచి చికెన్ షాపు , మటన్ షాపుల్లో తూకాలు కొలతలు తనిఖీలు నిర్వహించారు.డోన్ ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ చికెన్ మటన్ షాపుల్లో, కిరాణా షాపుల్లో , బంగారు దుకాణాల్లో నిర్వహకులు తూకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తూనికలు , కొలతలశాఖ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ జిలాన్ బాషా తెలిపారు.ఆదివారం చాగలమర్రిలోని కిరాణా షాపులు , చికెన్ మటన్ దుకాణాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్ర లేకుండా కాటాలు వాడుతున్న దుకాణదారులపై కేసు నమోదు చేశామన్నారు.ప్రతి ఏడాది కాటాలు రెన్యువల్ చేసుకోవాలని ఆదేశించారు.తూకాల్లో తేడాలు వచ్చినట్లు ఫిర్యాదులు వస్తే ఆ దుకాణాన్ని సీజ్ చేస్తామన్నారు.

# మాలల ఆశాజ్యోతి పివిరావు 78 వ జయంతి వేడుకలు




**బనగానపల్లె :మే= 10 ప్రజాజ్యోతి** మాలల ఆశాజ్యోతి పివి రావు అని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి అన్నారు పి వి రావు గారి 78వ జయంతి సందర్భంగా ఆదివారం నాడు బనగానపల్లె పట్టణంలో మాల మహానాడు కార్యాలయంలో పివి రావు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ 1952 వ సంవత్సరం తూర్పుగోదావరి జిల్లా మార్టూరులో పివి రావు గారి జన్మించారని వృత్తిరీత్యా ఐఏఎస్ ఆఫీసర్ అయిన మాల జాతి కోసం ఉద్యోగ సైతం లెక్కచేయకుండా రాజీనామా చేసే మాలలు హక్కుల కోసం పోరాటం చేసిన పోరాటయోధుడిని చివరకు తన ప్రాణాలు సైతం లెక్కచేయకుండా మాల జాతి కోసం త్యాగం చేశారని ఆయన చేసిన సేవలను కొనియాడారు అందరూ పివి రావు ఆశయ సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మారం నాగరాజు జిల్లా కార్యదర్శి కే శివుడు మలమాలు మండల అధ్యక్షుడు కొత్తపేట నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు -తిరుపతి నంద్యాల కడప తొలి ఎక్స్ ప్రెస్ రైలు



**నంద్యాల :మే=10 ప్రజాజ్యోతి** రైలు నం. 17261/17262 గుంటూరు–తిరుపతి–గుంటూరు (వయా–నంద్యాల, కడప) ఎక్స్ ప్రెస్ రైలును తిరుచిరాపల్లి వరకు పొడిగించేందుకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ గారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశం అరుణాచలం(తిరువణ్ణామలై)కు, నడవనున్న మొట్టమొదటి డైలీ ఎక్స్ ప్రెస్ రైలు. గుంటూరు–నంద్యాల మార్గం నుండి చిత్తూరు(కాణిపాకం), వెల్లూరు(గోల్డెన్ టెంపుల్), తిరువణ్ణామలై(అరుణాచలం), శ్రీరంగం తదితర పర్యాటక ప్రదేశాలకు నేరుగా నడవనున్న తొలి రైలు.

# ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారి సహకారంతో దేవాలయాల అభివృద్ధికి 12 లక్షలు నిధులు మంజూరు.

**ఎంఎల్ఏ కు ధన్యవాదాలు తెలిపిన గుంపరమానుదిన్నె గ్రామస్తులు.**



**ఆళ్లగడ్డ( శిరివెళ్ల):మే = 10 ప్రజాజ్యోతి** ఆళ్లగడ్డ నియోజకవర్గం శిరివెళ్ల మండలం గుంపరమానుదిన్నె గ్రామములో దేవాలయాల అభివృద్ధికి 12 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని టిడిపి నేత కుందూరు మోహన్ రెడ్డి పేర్కొన్నారు గుం పరమానుదిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి స్వామి దేవాలయమనకు విమాన గోపురం నిర్మాణానికి 12 లక్షల నిధులు మంజూరైందని అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 140 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన దేవాలయాలు చరిత్రకు సాక్షాలన్నారు.కాలానికి అనుగుణంగా దేవాలయాలు అభివృద్ధికి నోచుకోక పోవడంతో గుంపరమానుదిన్నె గ్రామ ప్రజలు ఎంఎల్ఏ భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేస్తానని గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం దేవాలయమునకు 12 లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు.గత 25 సంవత్సరమల క్రితం శ్రీ ఈశ్వరస్వామి మరియు శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయాల అభివృద్ధికి భూమా శోభానాగిరెడ్డి దంపతులు నిధులు మంజూరు చేసిన విషయం గ్రామస్థులు గుర్తుకు చేసుకొని ఇప్పుడు వారి కుమార్తె భూమా అఖిలప్రియ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయమునకు విమాన గోపుర నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ భూమా అఖిలప్రియ గారికి గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


# గంగమ్మ జాతరకు హాజరైన ఇరిగెల బ్రదర్స్



**ఆళ్లగడ్డ ఆర్ (కృష్టాపురం) ప్రజాజ్యోతి** ఆళ్లగడ్డ మండలం ఆర్.కృష్ణాపురం గ్రామ ఇరిగెల బ్రదర్స్ అభిమాని రాముడు ఆహ్వానం మేరకు అత్యంత వైభవంగా జరుగుతున్న గంగమ్మ (ఆవుల పబ్బము) జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న ఆళ్లగడ్డ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు ఇరిగెల రాంపుల్లా రెడ్డి గారు, ఇరిగెల సూర్య నారాయణ రెడ్డి గారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగమ్మ తల్లిని దర్శించడం చాలా సంతోషాన్ని ఇచ్చింది అని తెలిపారు. గ్రామ జనసేన పార్టీ నాయకులు మరియు గ్రామ ప్రజలు , భక్తులు చూపిన ఆత్మీయ అనురాగాలు, వారి ఘన స్వాగతం మనసును తాకిందనీ తెలిపారు. ఈ పవిత్ర సందర్భంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా ప్రార్థించామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ క్రృష్ణాపురం జనసేన పార్టీ నాయకులు దాది రాముడు కుటుంబ సభ్యులు మరియు నాగ లింగమయ్య గౌడ్,రాంపల్లె రామకృష్ణ, తలారి పెద్ద బాలయ్య, కే తేజోనాథ్ (తేజ), సి మధు, చంద్ర నాని, బల రామిరెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్న రు

# అత్యంత వైభవంగా శ్రీ ఎల్లమ్మ తల్లి తిరుణాల





**ప్రజా జ్యోతి చెన్నూరు మే10** చెన్నూరు గ్రామసమీపంలోని కె ఓ ఆర్ కాలనీలో వెలసిన శ్రీ ఎల్లమ్మ తల్లి తిరుణాల అత్యంత వైభవంగా ఆదివారం జరిగింది. ఉదయం అమ్మవారికి బోనాల సమర్పించి, జంతుబలిని ఇచ్చారు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. సాయంకాలం కోలాటం, చెక్కభజన, జబర్దస్త్ ప్రోగ్రామ్లను ప్రజలు తిలకించారు, తిరునాళ్లకు చుట్టుపక్కల గ్రామ ప్రజలే కాకుండా ఇతర మండల ప్రజలకు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ముక్కులు చెల్లించారు. తిరుణాల వద్ద భక్తులకు చల్లని మజ్జిగ, చల్లని మంచినీళ్లు ఉచితంగా పంపిణీ చేశారు సాయంత్రం నాలుగు గంటల నుంచి పోతులూరి స్వామిని ఊరేగింపుగా చెన్నూరు గ్రామం నుండి ఎల్లమ్మ తల్లి గుడి వద్దకు తీసుకొచ్చారు గ్రామంలో, తిరుణాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు

# గడ్డివాము దగ్ధం పై సమగ్ర విచారణ చేపట్టాలి

**బాధిత రైతుకి నష్టపరిహారం చెల్లించాలి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండ్**



**నంద్యాల (బేతంచర్ల):మే=10 ప్రజాజ్యోతి** బేతంచర్ల మండలం అంబాపురం గ్రామంలో గడ్డివాము దగ్ధమైన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధిత రైతుకు న్యాయం చేయాలని అంబాపురం గ్రామ సీపీఐ శాఖ నాయకులు శ్రీరాములు, సోమన్న, నాగేశ్వరరావు, చంద్రమోహన్ లు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదం గ్రామంలో గ్రామానికి చెందిన సురేంద్రనాథ్ రెడ్డి గడ్డివాము మరియు ట్రాక్టర్ మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైందని, గడ్డివాములో నిల్వ ఉంచిన పశువుల మేత, ఎండుగడ్డి పూర్తిగా కాలిపోయిందని, ప్రమాదంలో భారీ నష్టం సంభవించిందన్నారు. అగ్నిప్రమాదాన్ని గమనించిన స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే గడ్డివాము పూర్తిగా కాలిబూడిదైందని, అగ్నిప్రమాదంతో నష్టపోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని, ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, ప్రమాదానికి గల కారణాలను బహిర్గతం చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు రైతులకు నష్టం చేకూర్చే సంఘటనలపై ఎంతటి వారినైనా ఉపేక్షించకూడదని కోరారు.

# తమిళనాడు దళపతికి అభినందనలు తెలిపిన మాదిగ ఉద్యోగుల సమాఖ్య

**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ మే 10 (ప్రజా జ్యోతి)** దక్షిణ భారతదేశంలొ తమిళనాడు రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన జోసెఫ్ విజయ్ కి బద్వేల్ నియోజకవర్గ మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ఎంఆర్పిఎస్, ఎంఎస్పి, అనుబంధ సంఘాల మరియు దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బద్వేల్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద విగ్రహమునకు పూలమాలవేసి తదనంతరం బాణసంచాలు పేల్చి సంబరాలు జరపడమైనది. విజయ్ గారికి బద్వేల్ నియోజకవర్గం లోని దళితుల ద్వారా శుభాకాంక్షలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేయడం జరిగినది. ఈ కార్యక్రమం లో నాయకులు ఎర్రబల్లి ఓబయ్య, హను మంతు వెంకటసుబ్బయ్య, ముండ్లపాటి పిచ్చ య్య, జాల గురవయ్య, అనకర్ల సుందరయ్య, సోమిరెడ్డి పల్లె జయచంద్ర,బాల ఓబన్న, రవి, వీరయ్య, మల్లికార్జున, భాస్కర్, దివాకర్, దిలీపు, ప్రతాపు, మల్లికార్జున, ప్రసాదు, రమణ, కేశవయ్య చంద్ర, పంతులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ అధికారుల్లో ఉల్లాసాన్ని నింపేందుకే క్రీడలు





**ప్రారంభించిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**వాహనదారులకు హెల్మెట్ల ఆవిష్కృతపై బైక్ ర్యాలీ నిర్వహించిన**

**పోలవరం జిల్లా ఎస్పీ అమిత్**

**చింతూరు మే 10 ప్రజాజ్యోతి** రెవెన్యూ శాఖ పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది,ఐటీడీఏ అధికారులు, సిబ్బందికి క్రీడల్లో ఉల్లాసాన్ని నింపే విధంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ ఎస్పీ అమిత్ బర్ధర్ పేర్కొన్నారు. ఆదివారం చింతూరు డివిజన్ కేంద్రంలోని చింతూరు సంత మార్కెట్లో క్రికెట్ టోర్నమెంట్ కు రెవిన్యూ శాఖ తరపున జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ కెప్టెన్ గా,ఐటీడీఏ టీం తరపున చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్ కెప్టెన్గా పోలీస్ శాఖ తరపున ఎస్పీ క్రికెట్ బరిలో దిగి మొదటి మ్యాచు ప్రారంభించారు. మొదటగా టాస్ గెలిచి చింతూరు ఐటీడీఏ టీం తరపున ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ మొదటిగా బ్యాటింగ్ ఎంచుకొని 20 ఓవర్లలో 109 రన్స్ చేసి ఆల్ అవుట్ అవ్వగా జరిగింది .అనంతరం రెవిన్యూ టీం తరపున పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మొదటి బంతిలోనే ఫోర్ కొట్టి ఆటను ప్రారంభించారు. అదేవిధంగా రెవెన్యూ తరపున పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ వారి టీము 20 ఓవర్లలో 110 రన్స్ చేసి రెవెన్యూ టీము తరపున విజయం సాధించారు. రెవిన్యూ తరపున కెప్టెన్గా వ్యవహరించి రెవిన్యూ శాఖకు క్రికెట్ టోర్నమెంట్లో విజయం సాధించినందుకు రెవిన్యూ అధికారులు సిబ్బంది జిల్లా కలెక్టర్ వారికి అభినందనలు తెలియజేయడం జరిగింది.ప్రతి సంవత్సరం ఐటీడీఏ అధికారులకు, రెవిన్యూ శాఖ అధికారులకు సిబ్బందికి, అదేవిధంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు సిబ్బందికి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసి ఉద్యోగులలో ఆత్మవిశ్వాసాన్ని నింపే విధంగా ఎప్పటికప్పుడు ఉల్లాసంగా ఉండేవిధంగా ఇటువంటి క్రికెట్ టోర్నమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వ ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తి, ఐక్యత మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు మరియు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు క్రీడల్లో కూడా పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం మరియు శారీరక దృఢత్వం పెరుగుతాయని తెలిపారు.పరస్పర సహకారం,జట్టు భావన పెంపొందించడంలో ఇలాంటి టోర్నమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. టోర్నమెంట్లో రెవెన్యూ,పోలీస్, వైద్య, పంచాయతీరాజ్ తదితర 8 శాఖల జట్లు పాల్గొనడం జరుగుతుందని విజేతలకు ట్రోఫీలు, మెమెంటోలు మరియు ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా పోలవరం జిల్లాలోని రెండు చక్రాల వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించి రెండు చక్రాల వాహనంలో ప్రయాణం చేసే విధంగా జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, అల్లూరి జిల్లా పోలీస్ సూపర్డెంట్ అమిత్ బర్దర్ బైక్ ర్యాలీని ప్రారంభించి రెండు చక్రాల వాహనంలో చింతూరులో హెల్మెట్ ధరించాలి,ప్రాణాల రక్షించుకోవాలని నినాదంతో ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కొంతమంది వాహనదారులకు జిల్లా కలెక్టర్ ఎస్పీ చేతులమీదుగా హెల్మెట్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చింతూరు ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్,డీఎఫ్ ఓ శివకుమార్ గంగల్, ఓ ఎస్ డి పంకజ్ మీనా, ఎ.ఎస్.పి .బి. హేమంత్, సీఐ మురళీకృష్ణ ఎస్ఐ సంతోష్ కుమార్ తాసిల్దార్ హుస్సేన్,ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## శరభవరం గ్రామంలో మురళిరాజు గా పర్యటనలి



**కాకినాడ జిల్లా మే 10(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** రంగనాధం వారి వివాహ వేదిక లో పాల్గొన్న వరుపుల సుబ్బారావు. ,మురళిరాజు ప్రత్తిపాడు మండలం శరభవరం గ్రామంలో రంగనాధం రామచంద్రరావు కుమారుడు లిచిన్న వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన మాజీ శాసనసభ్యులు వరుపుల సుబ్బారావు ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ఒ నరసాపురం పార్లమెంటు పరిశీలకులుఒ ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో శరభవరం ఎంపీటీసీ అమరాది కాశీ ,రంగనాధం అబ్బాయి ,గోనగల అజయ్ ,అమరాది బాబ్జి ,బొల్లు నాగేశ్వరరావు ,జువ్వల దొరబాబు ,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు



**బనగానపల్లె :మే=10 ప్రజాజ్యోతి** బిడ్డను కంటికి రెప్పలా కాపాడే మాతృమూర్తులందరికి నా పాదాభివందనం కనిపించని దేవుడైన బిడ్డను కని పెంచిన అమ్మ తర్వాతే తల్లి గర్భంలో ఉన్నప్పుడు నుంచి యుద్ధం ఎలా చేయాలో నేర్పించింది అమ్మ ఆమె చల్లని ఒడిలో మొదలయింది ఈ జన్మ అన్నం కలిపి గోరుముద్ద పెట్టినప్పుడు అందరికీ అన్నం ముద్దలు మాత్రమే కనపడతాయి ఆ తల్లికి మాత్రమే తెలుసు అన్నం తోపాటే ప్రేమ కూడా కలిపి తినిపిస్తుందని ఆ బిడ్డ ఎంతో ఇష్టంగా ముద్దలు తింటుంటే ఆ బిడ్డ కడుపు నిండుతుందో లేదో తెలియదు కానీ ఆ తల్లి కడుపు మాత్రం ప్రేమతో నిండిపోతుంది ఇది చెప్పటానికి మాటలు సరిపోవు కానీ ఆ ప్రేమ మాత్రం అద్భుతం. మహిళగా నీ త్యాగం ఎప్పటికీ మరువలేనమ్మ.

## కనిపిచే ప్రతిస్త్రీ కనిపెంచిన అమ్మతో సమానం



**బనగానపల్లె:మే= 10 ప్రజాజ్యోతి** కనిపించే ప్రతి స్త్రీ.. కని పెంచిన అమ్మతో సమానం. మనల్ని ఈ లోకానికి పరిచయం చేసిన అమ్మకు చెప్పలేని పని ఎప్పుడూ, ఎవ్వరూ చేయొద్దు. ఇదే ప్రతి అమ్మ కోరుకునే కానుక. చిన్నప్పటి నుంచే మహిళలను గౌరవించడం, స్త్రీ పురుషులు సమానం అనే భావన నాలో పెంపొందించింది అమ్మ. నా తల్లి స్ఫూర్తితోనే విద్యా శాఖలో నైతిక విలువల పాఠాలు ప్రవేశపెట్టాం. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మహిళలకు స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2 పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తుంది. బిడ్డలకు గురువు, దైవం, మార్గదర్శి రూపంలో అన్నీ తానైన మాతృమూర్తులందరికీ మదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. లవ్ యూ అమ్మా..

## శక్తి యాప్ మహిళలు, పిల్లలకు రక్షణ

**- ప్రతీ ఒక్కరూ శక్తి యాప్ ను సద్వినియోగం చేసుకోవాలి**

**- ఆమదాలవలస సర్కిల్ ఇంచార్జి తమ్మినేని అమ్మాజీ**




**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్ :** శక్తి యాప్ మహిళల ,పిల్లల రక్షణకు వజ్రాయుధం వంటిదని ఆమదాలవలస సర్కిల్ ఇంచార్జి తమ్మినేని అమ్మాజీ అన్నారు. మండలం లక్ష్మి నగర్ కాలనీ నందు సుమారు 150 మంది ప్రయాణికులకు, మహిళలు కు శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవడం గురించి, మహిళలకు పిల్లలకు ఏవిధంగా ఈ యాప్ ఉపయోగ పడుతుంది అనే విషయాన్ని తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ప్రోగ్రాం ముఖ్యంగా బాల బాలికలు వారి యొక్క స్వీయ రక్షణ నిమిత్తము, ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు వారికి సహాయంగా పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్స్ గూర్చి, మరియు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 ల గురించి ,నేషనల్ హైవే , రూరల్ రోడ్లపై ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్లు ధరించాలని, విధిగా లైసెన్స్ తీసుకోవాలని, మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరం అని, మద్యం సేవించి వాహనం నడపటం ప్రమాదకరం అని తెలిపారు. నేషనల్ హైవే హెల్ప్ లైన్ నెంబర్ 1073, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్స్,100, 112 , 1091,1096, నెంబర్లు యొక్క వినియోగం గూర్చి, మహిళలు వేధింపులు గృహహింస రక్షణ కొరకు181, సైబర్ మోసానికి గురైనట్లయితే 1930 నెంబర్ వాడకం,మాదక ద్రవ్యాలు సరఫరా వినియోగం నిర్మూలన కోసం 1972 (యాంటీ డ్రగ్స్), 1098 బాల్య వివాహాలు ,బాల కార్మికుల నిర్మూలన కొరకు, పోక్సో చట్టం గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమం నందు ఆమదాలవలస పోలీసు స్టేషన్ ఉమెన్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ జాన్సీ, రైటర్ అప్పారావు, సిబ్బంది, టీం సభ్యులు పాల్గొన్నారు.

# ఉచితంగా ఇసుక దోపిడీ అధిక ధరలకు విక్రయాలు

**అక్రమ రవాణాలు. ఉచిత ఇసుక పాలసీని అమలపరచడంలో విఫలం అవుతున్న అధికార యంత్రాంగం. అనంతగిరి మండలం.**

**మే 10. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** కూటమి ప్రభుత్వం అమలుపరిచిన ఉచిత ఇసుక పాలసీ అనంతగిరి మండలంలోనీరు కారుతుంది. ఎక్కడ చూసినా ఇసుక దోపిడీ లారీలు.ట్రాక్టర్లతో మైదాన ప్రాంతాలకు రవాణా. లక్షలాది రూపాయలతో లావాదేవీలు. అల్లూరి సీతారామరాజు జిల్లా.అనంతగిరి మండలం కాశీపట్నం. చిలకలగేడ్డ పంచాయతీల పరిధి జిలుగులపాడు. కాశీపట్నం గ్రామాల సరిహద్దు గోస్తానిజలాల నుండి సహజ సిద్ధంగా వెలువడుతున్న ఇసుకను గిరిజన నేతర మైదాన ప్రాంత వ్యాపారులు లక్షలాది రూపాయలు విలువ చేసే ఇసుకను దోపిడీ చేస్తూ లారీలు.ట్రాక్టర్లతో రాత్రి పగలు అని తేడా లేకుండా బహిరంగ అక్రమ రవాణా జరుపుతున్నారు. ఇసుక భూ బకాసురులుఅక్రమ దోపిడీ వల్ల మండల వాసులకు ఇసుక దొరకక ఇల్లులు. ఇతర నిర్మాణాలుజరుపు కోలేనిపరిస్థితి ఏర్పడుతుంది. అంతేకాకుండా ఉచితంగా దోపిడీ చేసిన ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇంతజరుగుతున్న స్థానిక మండల రెవెన్యూ యంత్రాంగం మౌనం వహిస్తున్నారు



తప్ప కూటమి ప్రభుత్వం అమలుపరిచిన ఉచిత ఇసుక పాలసీని ఇంతవరకు అమలపరిచిన దాఖలు లేవు. అనంతగిరి మండల రెవెన్యూ అధికారి వీరభద్రా చారి ఇసుక అక్రమ రవాణా పై నిఘా ఏర్పాటు చేసి ఉచిత ఇసుక పాలసీని కట్టుదిట్టంగా అమలుపరిచి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇసుక దోపిడీ అక్రమ రవాణా పై ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుచేస్తామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆదివారం నాడు అనంతగిరిలో ప్రజా జ్యోతి దినపత్రికకు కలిసి తెలిపారు. వైయస్సార్ ప్రభుత్వం పాలన నుండి దోపిడీ వ్యవహారం జరుగుతుందని గుర్తు చేశారు. దోపిడి వ్యవహారం ఎలా జరుగుతుందో చిత్రంలో ఉన్న ట్రాక్టర్ నుచూడండి.

# అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి చేయూత

**- రూ. 82 వేల ఆర్థిక సహాయం అందజేత**



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** పొందూరు మండలం కింతలి గ్రామానికి చెందిన సనపల రాజు గత కొద్ది రోజులుగా కాన్సర్ తో బాధపడుతున్నారు. దీంతో ఈ మధ్యకాలంలో ఆపరేషన్ చేయించుకోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వెనుకబడిన ఆ కుటుంబానికి చేయూత అందించేందుకు ఖర్చుల నిమిత్తం తమ వంతు సహాయంగా వారి 10 వ తరగతి ( 1998-99 ) పైడి లక్ష్మీ నారాయణ జిల్లా పరిషత్ కింతలి బ్యాచ్ బాల్యమిత్రులందరూ ఒకటిగా చేరి ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు రూ.82 వేల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కుటుంబానికి దాతలు, అండగా నిలవాలని 9908731587 ఈ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**గత 23 సంవత్సరాల తర్వాత అపూర్వ కలయిక**



**నందవరం మే 10 (ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలోని ముగతి గ్రామం లో జడ్పీహెచ్ఎస్ స్కూల్ లో 2002-2003 సంవత్సరం 7 వ తరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు హెచ్ఎం శ్రీరాములు, సుధాకర్, చంద్రమ్మ, జానకి దేవి వారికీ పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గత 23 సంవత్సరాల ముందు వారి పాఠశాల జ్ఞాపకాలను విద్యార్థులతో ఉపాధ్యాయులు పంచుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇన్నేళ్ల తరువాత చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు తో అనుభవాలను పంచుకున్నారు.పూర్వ విద్యార్థులు పాఠశాలలో తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు.23 సంవత్సరాల తరువాత కూడా తమను గుర్తుపెట్టుకుని ఆహ్వానించి గౌరవించడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ గురువులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో మునిస్వామి గౌడ్, ఆలమ్మర్ది గౌడ్,రమేష్ గౌడ్, వై రాముడు, సూర్య, కీర్తి, సోమేశ్వరి,తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్య రంగంలోకి ప్రవేశించిన అల్లూరి విక్రమాదిత్య

**- అల్లూరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం**



**తాళ్లపూడి, మే 10, ప్రజాజ్యోతి న్యూస్** సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు, రాజకీయంగా పేరు పొందిన అల్లూరి విక్రమాదిత్య వైద్యరంగంలో ప్రవేశించడం జరిగింది. తాళ్లపూడి లో ఆర్ రవికుమార్ రెడ్డి నడుపుతున్నఆర్ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను అల్లూరి మెమోరియల్ ట్రస్ట్ గా అల్లూరి విక్రమాదిత్య సారథ్యం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యుల పరిచయ కార్యక్రమం హాస్పిటల్ లో ప్రాంగణంలో చేపట్టారు. విక్రమాదిత్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని ఉద్దేశంతో అల్లూరి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆర్ఆర్ హాస్పిటల్ మల్టీస్పెషలాటి హాస్పిటల్ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. డాక్టర్ ఆర్ రవి కుమార్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో అల్లూరి విక్రమాదిత్య ఆధ్వర్యంలో జనరల్ ఫిజీషియన్, పీడియాట్రిక్స్, గైనకాలజీ, ఆర్థోపెటిక్, ఆప్తమాలజీ వంటి విభాగాలు ప్రారంభించడం జరుగుతుందని వైద్యులు ఈ అవకాశాన్ని సద్విని చేసుకొని ప్రజలకు నాణ్యమైన వైద్యం కోసం కృషి చేయాలని కోరారు. హాస్పిటల్ వ్యవహారాల చూసేందుకు మాజీ ఎంపీటీసీ పెదపాటి కృష్ణమోహన్ ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ పార్ట్నర్ శ్రీనివాస్, ఆర్ఎంపీ డాక్టర్లు పాల్గొన్నారు

# పద్మశ్రీ మందకృష్ణ మాదిగను కలిసిన బేడ,బుడగజంగల నాయకులు



**మే 10 ( ప్రజా జ్యోతి ఎమ్మిగనూరు ప్రతినిధి)** ఈరోజు హైదరాబాదు నందు ఈదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ హైదరాబాద్ కు రానున్నందువలన మందకృష్ణ మాదిగ హైదరాబాద్ కు వచ్చారు, ఈ విషయం తెలుసుకున్న బేడ, బుడగ జంగం సంక్షేమ సంఘం నాయకులు మరియు తెలంగాణ బిజెపి అధ్యక్షుడు పస్తం దేవుడు గారు, సిరిపాటి వేణు లు మర్యాద పూర్వకముగా కలవడం జరిగింది. బేడ, బుడగ జంగల రిజర్వేషన్ సమస్యపై గట్టి పోరాటం చేయండి అని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రాక్షల దస్తగిరి మరియు తాటికొండ కొండన్న గారు మందకృష్ణ మాట్లాడి సమస్యను పరిష్కారం చేయాలనీ వారు తెలియజేసారు.

# సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

**జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్**



**గుంటూరు మే 10 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఇటీవల రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో చోటుచేసుకున్న సంఘటనల నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంపై గుంటూరు జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ తెలిపారు. మత విద్వేషాన్ని రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు, ఫేక్ న్యూస్ ప్రచారం చేయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా మతపరమైన ద్వేషాన్ని ప్రోత్సహించే సందేశాలు, ఫోటోలు, వీడియోలు లేదా రెచ్చగొట్టే వ్యాఖ్యలను షేర్ చేయడం చట్టపరంగా నేరమని ఎస్పీ స్పష్టం చేశారు. సమాజంలో శాంతి, సామరస్యాలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఒక్క సోషల్ మీడియా పోస్ట్ కూడా సమాజంలో అశాంతికి కారణమయ్యే అవకాశం ఉంది. పోస్టులు చేసే ముందు వాటి ప్రభావాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి అని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.సోషల్ మీడియా గ్రూప్ అడ్మిన్‌లు తమ గ్రూపుల్లో షేర్ అవుతున్న సందేశాలను పరిశీలిస్తూ ఉండాలని, అభ్యంతరకరమైన లేదా ద్వేషపూరిత కంటెంట్ గుర్తిస్తే వెంటనే తొలగించాలని సూచించారు. అలాగే అలాంటి పోస్టులు పంపించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.తప్పుడు ప్రచారం, మార్ఫింగ్ ఫోటోలు, ఫేక్ వీడియోలు లేదా అసత్య సమాచారాన్ని సృష్టించడం, ఫార్వర్డ్ చేయడం లేదా వైరల్ చేయడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలగవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. ఏ సమాచారం వచ్చినా అధికారిక వర్గాలు లేదా విశ్వసనీయ వార్తా సంస్థల ద్వారా నిజానిజాలు నిర్ధారించుకున్న తర్వాతే నమ్మాలని ప్రజలకు సూచించారు. వదంతులు లేదా మత విద్వేషాన్ని వ్యాప్తి చేసే చర్యలపై సైబర్ క్రైమ్ మరియు ఇతర చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

# వేరుశనగ పొట్టు చోరీ కేసును విచారణ చేపట్టిన పోలీసులు



**కంబదూరు మే 10:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,కంబదూరు మండల పరిధిలో ఇటీవల జరిగిన వేరుశనగ పొట్టు దొంగతనం ఘటనపై కంబదూరు పోలీసులు కృష్ణమూర్తి హరిప్రసాద్ విచారణ చేపట్టారు. ఆదివారం ఉదయం ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధిత రైతులు మరియు స్థానికులను అడిగి ఘటనకు సంబంధించిన సమాచారం తెలుసుకున్నారు.దుండగులు ఎలాంటి మార్గంలో వచ్చారు, ఎటువైపు వెళ్లారు అనే కోణంలో పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. ఘటన స్థలంలో ఉన్న ఆనవాళ్లను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు రాత్రి వేళ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.**

# పీజీఆర్ఎస్‌లో ప్రజా అర్జీల స్వీకరణ

**హెల్మెట్‌తోనే రావాలి : కలెక్టర్ వినోద్ కుమార్**



**బాపట్ల మే 10 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)తో పాటు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ ఐఏఎస్ తెలిపారు.జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు గతంలో అందిన అర్జీల పరిష్కార స్థితిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలు ఇంకా పరిష్కారం కాకపోయినా లేదా ఫిర్యాదుల స్థితి తెలుసుకోవాలన్నా టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100ను సంప్రదించవచ్చన్నారు. అలాగే మీకోసంపోర్టల్ ద్వారా కూడా అర్జీలు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. నడవలేని స్థితిలో ఉన్నవారు, మంచాలకు పరిమితమైనవారు లేదా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కార్యక్రమానికి తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ కోరారు.

# పూర్వ విద్యార్థులు సమ్మేళన కలయిక



**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** కూడేరు మండలం మరుట్ల 2 వ కాలనీ గ్రామంలో జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ నందు 2004-2005 వ సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మరుట్ల జడ్పీహెచ్ఎస్ స్కూల్లో గ్రాండ్ గా ఫంక్షన్ నిర్వహించడం జరిగింది. ఎన్నో సంవత్సరాలకు చిన్ననాటి స్నేహితులు కలిసి ఒక పెద్ద పండగ లాగా అంతా ఒక్కటే పూర్వ విద్యార్థులను కలిసిన ఆనందాలు మధుర జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచి పోతాయని ఆనందాలు మరిచిపోయినటువంటి గుర్తుకు. చేసుకున్నారు. అంతా కలిసిఅలాగే గురువులు హెడ్మాస్టర్ కేసీ నాగన్న, పి ఈ టి రమేష్ బాబు, కే.ఎర్రిస్వామి, వి గంగావర్ధన్ రాజు లను ఘనంగా సన్మానించి విద్యార్థులు ఒకరికొకరు కాసేపు ముచ్చటించారు అలాగే తల్లిదండ్రులను గురువులను పూజించాలని తెలియజేశారు.

# నిమ్మలపాడు మైనింగ్ మాఫియా వ్యక్తులపై అనంతగిరి

**మే 10. ప్రజా జ్యోతి న్యూస్.** రిపోర్టర్ శంకర అల్లూరిసీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం వాలాసి పంచాయతీ పరిధి నిమ్మలపాడు గ్రామంలో శుక్రవారంజరిగిన వివాహ వేడుకకు తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గం ఇంచార్జ్ దొర కుటుంబీకులు హాజం య్యారు. అనంతరం గ్రామానికి దగ్గరలో గల మైనింగ్ ప్రాంతాన్ని సరదాగా చూసేందుకు వెళ్ళగా నిమ్మలపాడు మైనింగ్ మాఫియా అన్యాయంగా దౌర్జానికి దిగి ఇద్దరు వ్యక్తులను గాయపరిచారు.సదర వ్యక్తులు శనివారం నాడు అనంతగిరి పోలీసులకుఫిర్యాదు చేయగా అనంతగిరి ఎస్సై శంకర్రావు కేసు నమోదు చేశారు. కేసు నమోదు సమాచారం తెలుసుకున్న మాఫియా పరార అయ్యారు. వీళ్ళ కోసం అనంతగిరి పోలీసు బృందం ముమ్మర గాలింపు వేట ప్రారంభించారు.

# ప్రజల సమస్యలను తక్షణమే ఫోన్‌లో పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే

**పర్చూరు గ్రీవెన్స్‌లో ప్రజలకు భరోసా**

**పర్చూరు మే 10 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలనే లక్ష్యంతో పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల సమస్యలను నేరుగా విని, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టించారు. పర్చూరులో నిర్వహించిన ఈ గ్రీవెన్స్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పెన్షన్లు, విద్యుత్ సమస్యలు, భూమి వివాదాలు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంబంధిత శాఖల అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్ని అంశాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలు త్వరగా పరిష్కారం కావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, ప్రతి సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అధికారులు కూడా ప్రజల సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలు ఎమ్మెల్యే స్పందనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ తమ సమస్యలను వెంటనే పట్టించుకోవడం అభినందనీయమని తెలిపారు.

# అకాల వర్షంతో ఉక్కపోతకు ఉపశమనం-రైతుకు మాత్రం నష్టమే





**బుట్టాయగూడెం మే10(ప్రజాజ్యోతి):-** ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బుట్టాయగూడెం ఏజెన్సీ ప్రాంతం అనుకోకుండా కురిసిన వర్షంతో ఒక్కసారిగా చల్లబడింది. మండలంలోని ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఇంచుమించు రెండు గంటలు కురిసిన అకాల వర్షంతో ఈ ప్రాంతం చల్లబడినప్పటికీ రైతులను మాత్రం ఆందోళనకు గురిచేసింది. చేతికొచ్చిన పంటలు నేలపాలు అయ్యాయి. అనుకోకుండా వచ్చిన గాలివానతో మామిడి, జీడిమామిడి ,మిరప, మొక్కజొన్న,పొగాకు పంటలు పండిస్తున్న రైతులకు అంతా నష్టమే తప్ప లాభం లేదని అంటున్నారు. గాలివానకు చాలా చోట్ల చెట్లునేల కొరిగాయి. రోడ్లకు అడ్డంగా,విద్యుత్ తీగలు పైన చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీనితో ఈ ప్రాంతంలో తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీనితో ఏజెన్సీ గ్రామాలన్నీ ఒక్కసారిగా చీకటి మయమైనాయి. విద్యుత్ అంతరాయంతో చాలా గ్రామాలలో వాటర్ ట్యాంక్ ల వద్ద మోటర్లు తిరగక ప్రజలు త్రాగునీరుకి,ఇతర అవసరాలకు ఉపయోగించుకొనే నీరు లేక చాలా ఇబ్బంది పడ్డారు. ఆదివారం కావడంతో మారుమూల అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లిన భక్తులు వర్షంలో తడుస్తూ వాహనాలపై కేరింతలు కొట్టుకుంటూ వారి స్వగ్రామాలకు తిరిగి వెళ్ళారు. ఏదిఏమైనాగాని ఉక్కపోతతో ఉన్న ఏజెన్సీ ప్రజలు మాత్రం ఈ వర్షంతో ఒకింత ఉపశమనం పొందారని చెప్పవచ్చు. రైతుకు మాత్రం ఈ అకాల వర్షంతో అంతా నష్టమే అని చెప్పొచ్చు.

# బాపట్లలో సోషల్ మీడియాపై పోలీసుల ప్రత్యేక నిఘా

**అసత్య ప్రచారాలు, విద్వేష పోస్టులపై కఠిన చర్యలు తప్పవు**

**బాపట్ల మే 10 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేస్తూ అసత్య ప్రచారాలు, మతపరమైన లేదా వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సోషల్ మీడియా కార్యకలాపాలపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా నిరాధార సమాచారం, రెచ్చగొట్టే సందేశాలు, మార్ఫింగ్ చేసిన ఫోటోలు లేదా వీడియోలను షేర్ చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అలాంటి చర్యలు ప్రజల్లో అపోహలు, ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. సోషల్ మీడియా వినియోగదారులు ఏ సమాచారం వచ్చినా వెంటనే ఫార్వర్డ్ చేయకుండా, ముందుగా అధికారిక వనరుల ద్వారా నిజానిజాలు తెలుసుకోవాలని సూచించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించడం ప్రతి పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల అడ్మిన్‌లు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తెలిపారు. తమ గ్రూపుల్లో అభ్యంతరకరమైన లేదా విద్వేషపూరిత పోస్టులు కనిపించిన వెంటనే తొలగించడంతో పాటు సంబంధిత వ్యక్తులను గ్రూప్ నుంచి తొలగించాలని సూచించారు. అలాంటి చర్యలు తీసుకోకపోతే గ్రూప్ అడ్మిన్‌లపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా అసత్య ప్రచారాలు, మత లేదా వర్గ విభేదాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 112 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. జిల్లాలో శాంతి సామరస్యాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# సొద్దల రామాంజనేయులు మృతి బాధాకరం

**కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన**

**మంచూరు సూర్యనారాయణ రెడ్డి**

**బద్వేలు స్టాఫ్ రిపోర్టర్ మే 10 (ప్రజా జ్యోతి)** బద్వేల్ నియోజకవర్గం అట్లూరు మండలం ముత్తుకూరు పంచాయతీ జొన్నవరం ఎస్పీ కాలనీకి చెందిన సోద్దల రామాంజనేయులు మృతి చెందడం పట్ల ఉమ్మడి కడప జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అనంతపురం కియా కంపెనీలో పని చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన రామాంజనేయులు భౌతిక కాయానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన చైర్మన్, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో చేతికి వచ్చిన కుమారుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, వారికి రావాల్సిన ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, అరవ శ్రీనివాసుల రెడ్డి, సీమాంక్ హాస్పిటల్ డైరెక్టర్ జహంగీర్ భాష, బోవిళ్ళ నరసింహారెడ్డి, మాచుపల్లి కృష్ణ రెడ్డి, రుండా చంద్రశేఖర్ రెడ్డి, రామారెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, గురు ప్రసాద్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, చింతకుంట కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## దేశం మొత్తం మార్పు కోరుకుంటోంది

-మొదటిపేజీ తరువాయి

ఒకటి తెలంగాణకు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌తో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, బీజేపీ దృష్టి ఎప్పుడూ అభివృద్ధి, ఉపాధి మీద మాత్రమే ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్‌ను గెలిపించినందుకు కర్ణాటక ప్రజలు బాధపడుతున్నారని, తెలంగాణలోనూ అలానే ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ విధానం మొదట ఓట్లు దండుకో, తర్వాత మర్చిపో అన్నట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్ పొత్తులు ఎప్పుడూ అభివృద్ధి నిరోధకులతోనే ఉంటాయని మండిపడ్డారు.

**నక్సలైట్ల రహిత రాష్ట్రంగా తెలంగాణ**

దేశాన్ని ఇప్పటికే నక్సలైట్ల రహితంగా మార్చివేశామన్న మోదీ తెలంగాణ కూడా నక్సలైట్ల రహితంగా మారిందని ప్రకటించారు. వికసిత్ తెలంగాణ లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందన్నారు. చాలా దేశాల్లో యూరియా బస్తా ధర రూ.3 వేలు ఉంటే భారత్‌లో మాత్రం రూ.300 లోపే ఉందన్నారు. కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులో సమస్యలు వచ్చాయని పెట్రోల్, డీజిల్, ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. యుద్ధాల వల్ల పొరుగు దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని ధరల భారాన్ని భారత దేశ ప్రజలపై పడకుండా చూశామన్నారు.

**ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు నిలిపేద్దాం**

దీర్ఘకాలంలో పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని మనం తగ్గించుకోవాలని మోదీ సూచించారు. రైల్వే రంగంలో డీజిల్ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తూ ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. సమీప భవిష్యత్ పెట్రోల్, డీజిల్ అవసరం మనకు భారీగా తగ్గుతుందని, పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గితే విదేశీమారక ద్రవ్యం మిగులుతుందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల వల్ల బంగారం ధరలు పెరుగుతున్నాయన్న ఆయన ఏడాదిపాటు బంగారం కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేద్దామని పిలుపునిచ్చారు. పండుగలు, శుభాకార్యాలకు బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలని చెప్పారు. బంగారం దిగుమతులు తగ్గితే విదేశీమారక ద్రవ్యం పెరుగుతుందని అన్నారు. వీదేశీ పర్యటనలు, డెస్టినేషన్ మ్యారేజ్‌లను తగ్గించుకోవాలని సూచించారు. "వంట నూనెను కూడా మనం దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఉంది. వంట నూనెలో స్వయం సమృద్ధి సాధించాలి. ఎరువుల వినియోగం తగ్గించి భూసారాన్ని కాపాడాలి. మనం ఇంట్లో వాడే వస్తువులను ఒకసారి పరిశీలించాలి. మన నిత్యావసర వస్తువులన్నీ విదేశాల నుంచి వచ్చినవే. అన్నింటికి దిగుమతులపైనే ఆధారపడితే దేశాభివృద్ధి ఎలా సాధ్యం?. మన నిత్యావసర వస్తువుల్లో స్వదేశీ వస్తువులే ఎక్కువగా ఉండాలని వాటినే వినియోగిస్తామని అందరూ ప్రతిజ్ఞ చేయాలి. స్వదేశీ అనేది కేవలం బీజేపీ నినాదం కాదు ఇది దేశ విధానం" -నరేంద్రమోదీ, ప్రధానమంత్రి

## ఇది కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదు..

## అభివృద్ధి ఉత్సవం

-మొదటిపేజీ తరువాయి

పూర్తయిపోయాయని, ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదని రేవంత్ పేర్కొన్నారు. అభివృద్ధి గురించే మాట్లాడదామని వ్యాఖ్యానించారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా పెట్టుకున్నామని గుర్తు చేసిన ఆయన, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని తెలంగాణ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. 2034 నాటికి తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ ఆశీర్వాదం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందని, కేంద్ర మంత్రులను తాను తరచూ కలుస్తుంటానని అన్నారు. కొన్ని పనులు అయ్యాయని, ఇంకొన్ని పనులు కావాల్సి ఉన్నాయని మోదీ దృష్టికి తెచ్చారు. తెలంగాణ కూడా మిగిలిన రాష్ట్రాల్లా అభివృద్ధి చెందాలని, తెలంగాణ ప్రాజెక్టులపై మోదీ దృష్టి సారించాలని కోరారు. దేశానికి 10 శాతం జీడీపీ ఇస్తామని వాగ్దానం చేస్తున్నామని, మోదీకి విశాల హృదయం ఉందని కిషన్‌రెడ్డి చెబుతుంటారని, మోజీ తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులకు సహకరిస్తే వేగంగా అభివృద్ధి చెందుతామని అన్నారు.

**నగరాలను కేంద్రం ప్రోత్సహించాలి**

దేశ జనాభాలో తెలంగాణ 3 శాతం వాటా కలిగి ఉందన్న సీఎం, దేశ జీడీపీకి తెలంగాణ 5 శాతం వాటా ఇస్తోందని గుర్తు చేశారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని, 30 ట్రిలియన్ డాలర్లలో తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల వాటా ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. దేశ జీడీపీకి 10 శాతం వాటా ఇవ్వాలనే లక్ష్యంతో సాగుతున్నామని, దేశాభివృద్ధిలో ఆరు మహానగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తున్నాయని, దేశానికి సింహభాగం ఆదాయం ఇస్తున్న ఆరు నగరాలను కేంద్రం ప్రోత్సహించాలని ప్రధానిని కోరారు.

**మోదీ సహకరించాలి**

రాష్ట్ర పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, తెలంగాణ ప్రాజెక్టులపై 2 గంటలు కేటాయించి సమీక్షించాలని మోదీకి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్, మూసీ ప్రాజెక్టు, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ – మచిలీపట్నం వరకూ 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవేకు సహకరించాలని కోరారు. "ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిపోయాయి. ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదు. అభివృద్ధి గురించే మాట్లాడదాం. మోదీ ఆశీర్వాదం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుంది. కేంద్ర మంత్రులను నేను తరచూ కలుస్తుంటాను. కొన్ని పనులు అయ్యాయి. ఇంకొన్ని పనులు కావాల్సి ఉన్నాయి. తెలంగాణ కూడా మిగిలిన రాష్ట్రాల్లా అభివృద్ధి చెందాలి. తెలంగాణ ప్రాజెక్టులపై మోదీ దృష్టి సారించాలి" – రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎం

## ఇంటర్ అడ్మిషన్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం



రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్ అడ్మీషన్లను యథావిధిగా కొనసాగించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేసే అంశంపై అధికారు లతో సమీక్షనిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది ఇంటర్ ప్రవేశాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండటం కారణంగా విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఇంటర్మీడియట్?ను రద్దు చేసి సీబీఎస్ఈలో మాదిరే 11, 12 తరగతులు నిర్వహించాలని ఫలితంగా డ్రాపౌవుట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదని గతంలోనే సర్కారు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొంది. దీంతో ఈ నెల 4వ తేదీన ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం షెడ్యూల్ విడుదల చేసిన బోర్డు మరుసటి రోజే షెడ్యూల్?ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణాలతో సీఎ రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.

**యథావిధిగా ఇంటర్ అడ్మీషన్ల ప్రక్రియ**

ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేయటంలో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి తన నివేదిక సమర్పించాలని సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మీషన్ల ప్రక్రియ కొనసాగుతుందని ప్రభుత్వం ప్రకటించింది.

## సంపాదకీయం

# అంకెల వలయంలో శ్రామికుడు!

ఈ నివేదికను పైపైన చూస్తే, భారతదేశంలో శ్రామికవర్గం పాలు తేనెల్లో తేలియాడుతున్నట్లు, వారి జీవితాల్లో ఏదో అద్భుతమైన స్వర్ణయుగం నడుస్తున్నట్లు అనిపిస్తుంది. బ్లూ కాలర్ కార్మికులు వైట్ కాలర్ ఉద్యోగుల కంటే వేగంగా ఎదుగుతున్నారని, వారి జీతాలు ఆకాశాన్ని తాకుతున్నాయని ఒక అద్భుతమైన భ్రమను అల్లుతుంది. కానీ, ఈ అంకెల తెరను చీల్చి చూస్తే అక్కడ కనిపించేది అభివృద్ధి కాదు, దశాబ్దాలుగా రక్తం చిందించి కార్మికులు సాధించుకున్న హక్కులపై ముప్పేట దాడి. వర్క్ ఇండియా నివేదిక యాజమాన్యాల ప్రయోజనాల కోసం పకడ్బందీగా అల్లిన ఒక కార్పొరేట్ కుట్ర. గణాంకాల గారడీ, ఆకలిని కప్పిపుచ్చే అంకెల అబద్ధం. ఈ నివేదిక ప్రకారం, 2024లో బ్లూ కాలర్ కార్మికుల సగటు వేతనం నెలకు రూ.14,056 ఉంటే, 2025 నాటికి అది 8.6శాతం పెరిగి రూ.15,265కు చేరిందట. కాగితాల మీద ఈ 8.6 శాతం అనేది ఒక అద్భుతమైన వృద్ధి లాగా కనిపిస్తుంది. కానీ ఈ దేశంలో వీధి అంచున నిలబడి బతుకు పోరాటం చేసే సగటు మనిషిని అడిగితేనే, ఈ రూ.1,200 పెరుగుదల వాస్తవానికి ఒక పెంపా లేక అవమానమా అనేది అర్థమవుతుంది. మార్కెట్‌లో నిశ్శబ్దంగా తిరుగుతూ పేదవాడి కంచంలోని ముద్దను ఎత్తుకుపోయే 'ద్రవ్యోల్బణం' అనే రాక్షసుడి గురించి ఈ నివేదిక ఎందుకు మాట్లాడదు? పెట్రోల్ ధరలు, కూరగాయల ధరలు, కరెంటు బిల్లులు, ఇంటి అద్దెలు ఇరవై ముప్పై శాతాలు పెరుగుతున్నప్పుడు, ఈ ఎనిమిది శాతం జీతం పెంపు అనేది కార్మికుడి కడుపు నింపుతుందా, లేక వాడిని మరింత అప్పుల ఊబిలోకి నెడుతుందా? జాతీయ లేబర్ వేజెస్ కమిషన్ స్వయంగా ఒక సెమీ-స్కిల్డ్ వర్కర్‌కు నెలకు కనీసం రూ.30,000 (రోజుకు రూ. 1,000) వేతనం ఉండాలని ఘోషిస్తుంటే, కార్పొరేట్ రాబందులు మాత్రం రూ.15,265 ఇచ్చి, అదేదో మహాభాగ్యం అన్నట్లు నివేదికలు వండివార్చడం వారి అహంకారానికి, శ్రమ దోపిడీకి పరాకాష్ఠ. నిజమైన వృద్ధి అనేది మార్కెట్ ధరలకు అనుగుణంగా ఉండాలి, దాని ప్రకారమైతే ఇక్కడ కార్మికుడి జీవితం పాతాళానికి దిగజారుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎప్పుడూ ఒక పాత వ్యూహం ఉంటుంది. "బాధితులను ఒకరిపై ఒకరిని ఉసిగొల్పు, అప్పుడు వారు అసలు దోపిడీదారుడిని ప్రశ్నించరు." వైట్ కాలర్, బ్లూ కాలర్ ఉద్యోగుల జీతాలను పోల్చడం వెనుక ఉన్న కుట్ర ఇదే. వైట్ కాలర్ ఉద్యోగికి (అడ్మినిస్ట్రేషన్ సపోర్ట్) కనీసం బేసిక్ జీతంతో పాటు ప్రతి ఏటా పెరిగే డీఏ, టీఏ వంటి రక్షణ కవచాలు ఉంటాయి. కానీ అగ్నిగుండం లాంటి ఫ్యాక్టరీలో, ఎండలో కరిగే బ్లూ కాలర్ కార్మికుడికి దక్కేది కేవలం ఆ కనీస వేతనం మాత్రమే. ఈ రెండు వర్గాలను పోల్చి, "చూడండి ఏసీ గదుల్లో ఉండే వైట్ కాలర్ ఉద్యోగుల కంటే బ్లూ కాలర్ కార్మికులకే జీతాలు ఎక్కువగా పెరుగుతున్నాయి" అని ప్రచారం చేయడం ఒక పచ్చి అబద్ధం. సమాజంలో కార్మికుల పట్ల ఉండే సానుభూతిని చంపేసి, "వారికి అన్నీ అందుతున్నాయి, వారు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారు" అనే ఒక తప్పుడు నెరేటివ్‌ను ప్రజల మెదళ్లలో నాటడానికే ఈ తరహా నివేదికలు వెలువడుతూంటాయి. ఈ నివేదికలు ఎందుకు ఇప్పుడే పుట్టుకొస్తున్నాయి? కార్మికులు శతాబ్ద కాలంగా రక్తం, కన్నీరు చిందించి, లాఠీ దెబ్బలు తిని సాధించుకున్న 29 చట్టాలను చెత్తబుట్టలో వేసి, కేవలం నాలుగు 'లేబర్ కోడ్స్'ను ప్రభుత్వాలు అమలు చేయబోతున్నాయి. ఈ కోడ్స్ అన్నీ యాజమాన్యాల దోపిడీని చట్టబద్ధం చేసేవే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ముసుగులో జరుగుతున్న ఈజ్ ఆఫ్ ఎక్స్‌ప్లాయిటింగ్ హ్యూమన్స్ (మనుషులను దోచుకునే వెసులుబాటు) ఇది. క్రూరమైన నాలుగు లేబర్ కోడ్స్‌కు సామాజిక మద్దతును కూడగట్టడానికే ఇలా కార్మికుల జీతాలపై అక్కసు వెళ్లగక్కుతూ నివేదికలు ఇప్పిస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు మానవత్వం ఉండదు, దానికి తెలిసింది లాభం మాత్రమే. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న మినీ వరల్డ్ వార్‌ను సైతం మన దేశంలోని కార్పొరేట్ శక్తులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నాయి. కార్మికుల జీతాల్లో కోత విధించడానికి, కనీస వేతనాలు పెంచకుండా ఉండటానికి అంతర్జాతీయ పరిణామాలను అవి ఒక సాకుగా వాడుకుంటాయి. సంక్షోభం వచ్చినప్పుడు నష్టాలను కార్మికుల నెత్తికి రుద్దడం, లాభాలు వచ్చినప్పుడు వాటిని స్విస్ బ్యాంకుల్లో దాచుకోవడం కార్పొరేట్ సంస్థల నైజం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కేవలం పీల్చుకోవడానికి గాలిని మాత్రమే కాదు, ప్రతి పౌరుడికి 'గౌరవప్రదమైన జీవన హక్కు'ను ప్రసాదించింది. పెరుగుతున్న ధరల మధ్య రూ.15,000తో నెట్టుకొచ్చే జీవితం గౌరవప్రదమైనది కాదు. ఇది కేవలం కొద్దిమంది జీతాల సమస్య కాదు. ఇది శ్రామిక వర్గం మనుగడకు, కార్పొరేట్ విధ్వంసానికి మధ్య జరుగుతున్న యుద్ధం. ఈ అంకెల గారడీని, ఈ నివేదికల విషాన్ని కార్మిక లోకం గుర్తించాలి. బ్లూ కాలర్, వైట్ కాలర్ అనే భేదాలు మర్చిపోయి ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా నిలబడాలి. మన నెత్తురును లాభాలుగా మార్చుకునే ఆ నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసే వరకు ఎలుగెత్తి పోరాడాలి.

# టైగర్ రిజర్వ్ కాదు.. చెంచు రిజర్వ్



పులికి ప్రపంచం అంతటా ఆవాసమే. చెంచులకు నల్లమల మాత్రమే నివాసం. ఎత్తైన గుట్టలు, దట్టమైన మట్టలు, ఎప్పటిదో ఈ నల్లమల పుట్టుక. పులి..పుట్ర.. పూరేడు..మారేడు జాతుల్లో తమ జీవనాన్ని వెతుకుంటూ చెంచులు నల్లమలకు ఏనాడొచ్చారో? జీవరాశితో కలిసి చెట్ల తొరల్లో నివశించే వీళ్లు చెట్టు దిగి పెంట మీదకి ఎప్పుడొచ్చారో? ఏమో..! కానీ ప్రపంచంలో ఒక్క నల్లమల అడవిలో తప్ప మరెక్కడా కనిపించని అత్యంత అరుదైన అడవి జాతి. జీవన వైవిధ్యంలో చెంచులది అతి సున్నిత స్థానం. పులి తరహాలోనే చెంచులు అంతరిస్తున్న జాతుల జాబితాలోనే ఉన్నారు. అటువంటి ఆదిమ మానవుని అస్తిత్వంపై రాజ్యం పగబట్టకుండా సానుకూల ఆలోచనలు చేయాలి. పులుల రిజర్వ్ ప్రాజెక్టు తరహాలో నల్లమలను చెంచుల కోసం రిజర్వు చేయాలి. 2003లోఅనుకుంటా చెంచుల మూలాలను తడుముంటూ వెళ్లి అమ్రాబాద్ మండలం కుమ్మెనపెంటలో రాత్రి నిద్ర చేశాను. అప్పుడప్పుడే చలికాలం వెళ్లిపోతూ వసంత కాలం చొరబడుతున్నది. అప్పటికీ అడవి మీద చలి ఆధి పత్యం కొనసాగుతున్నది. చెంచు సోదరులు ఆర్తి అంజన్న గుడిసె ముందు నెగడి అంటేస్తే..దాని పక్కన ముడ్సుకున్న. ఆ రాత్రి ఎలా గడిచిపోయిందో ఏమో..! తెల్లారి వేకువ పొద్దు వేళ 'వెంకన్న..పులి పులి' అని అరుస్తూ నన్ను తట్టి లేపిండు అంజన్న. నిద్రలోంచి ఉలిక్కి పడిలేచిన. గుడిసె ముందు నుంచి పులి మెల్లగా అడుగులు వేస్తూ వెళ్తున్నది. ఊళ్లలో ఇంటి ముందు కుక్కను చూపించినట్టు అంజన్న నాకు పులిని చూపించిండు. పులి మీద పడదా? అని అంజన్నను అడిగితే.. 'అది పెంటింది.. వేట రాదు..ఉరికి జంతువును కొట్టలేదు. అప్పుడో ఇప్పుడో జీవాన్ని కొడితే మిగిలిన మాంసాన్ని కూడ మేం ముట్టం, సేతగాంది అని అంత దానికే వదిలిపెడతం'అని చెప్పిండు. అంజన్న చెప్పింది అసాధారణ విషయం. తన పరిసరాల్లో ఉన్న పులి సైకాలజీ. తన చుట్టూ జీవుల మనుసెరిగి నడుచుకునే వైవిధ్య జీవనం వారిది. చెంచులు అడివిలో అంతర్భాగం. అడవిని, అకడి పక్షులను, జీవజాతులను, ఆదివాసీని వేరుగా చూడలేము. అటవి ఆవరణ గొలుసులో ఒకొక జాతి ఒకొక అంతస్థు. చెంచు వారు కూడ అటవీ ఆవరణ వ్యవస్థలో ఒక అంతస్థు అని పర్యావరణ శాస్త్రం చెప్తున్నది. చెంచులు రేపటి గురించి ఆలోచన చేయరు. దాచుకోవటం అనే మార్మికం తెలియదు. ఉన్నప్పుడు తినడం, లేనప్పుడు పస్తులు పండటం మాత్రమే తెలుసు. అడవిలో కాలానుగుణంగా దొరికే కాయలు, పండ్లు, గడ్డలు తిని బతుకుతారు. ఆహార సేకరణ పర్యావరణ సమతు ల్యతను సూచించే ఆహారపు గొలుసులోని నిబంధనలకు అనుగుణంగానే ఉంటుంది. ఉడతలు, ఉడుములు, ఎలుకలు, కుందేళ్లను వేటాడుతారు. అరుదుగా జింకల వేట కూడ చెంచు జీవనంలో ఉన్నది. పులులు తిని వదిలేసిన మాంసాన్ని కూడ తింటారు. ఒకసారి జంతువును వేటాడితే దాన్ని పూర్తిగా ఆరగించే వరకు ఆహార సేకరణ ఉండదు. చెంచులకు వ్యవసాయం లేదుకాబట్టి నల్లమలలో పోడు వ్యవసాయం లేదు. ఎకడా కూడా చెంచులు అడవిని నాశనం చేసినట్లు మనకు ఆధారాలు దొరకవు. అడవిలో వర్షాకాలం, చలికాలాల్లో ఐదు గంటలకే చీకటి పడుతుంది. చీకటి పడక ముందే ఇళ్లు చేరుతారు. కుందేటి సుక పొడిచే యాళ్లను నిద్ర పోతారు. అదే సమయంలో అడవి తావుల నుంచి జంతువులు బయటికి వస్తాయి. రాత్రంతా ఆహార అన్వేషణ చేస్తాయి. పొలిపొద్దు యాళ్లకు మళ్లీ తావుకు చేరుకుంటాయి. ఆ సమయంలో చెంచుల జీవన చర్య మొదలవుతుంది. జంతువుల జీవన చక్రంలో చెంచుల జీవన చర్యలు ఎకడ కూడ జోక్యం చేసుకోవు. ప్రకృతే చెంచులకు, అటవి జంతువుల మధ్య అటువంటి సర్దుబాటు చేసింది. మరి ఎందుకు చెంచులను అడవికి శత్రులుగా చిత్రీకరిస్తున్నారు? ఎందుకు వారిని అడవి నుంచి దూరం చేసే కుట్రలు చేస్తున్నారు? ఇకడ ఇంకో మాట చెప్పుకోవాలి. పులి ఆకలి తీరాలంటే కచ్చితంగా ఏదో ఒక జంతువును వేటాడాలి. ఆకలిగొన్న పులి తన కంటే పెద్ద జంతువును కూడా వేటాడి వెంటాడి చంపి తింటుంది. అంత మాత్రం చేత పులిని అటవీ వినాశనకారిగా భావించగలమా? అడవిలో పులికి, చెంచుకు పెద్దగా తేడా లేదు. అయినా.. ఆదివాసీ చెంచుల మీద రాజ్యం ఆగిఆగి దాడులు చేస్తూనే ఉన్నది. ప్రజలను, ప్రజా సంఘాలను ఏమార్చే ఎత్తుగడలు వేస్తూనే ఉన్నది. ఇదంతా ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్నది. మొదట పోలీసు బలగాలు అడవిలోకి చొరబడ్డాయి. అన్నలు, ఆదివాసీల హననం జరిగిపోయింది. తరవాత పులుల సంరక్షణ కోసమంటూ చెంచుల వెంట పడుతున్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో విస్తరించిన నల్లమలలో 338 చెంచు పెంటలున్నాయి. వేరుబడ్డ తెలంగాణలో 169 పెంటల్లో 14,438 మంది చెంచులు జీవిస్తున్నారని అంచనా. ఇది కూడ రాజ్యం ఉద్దేశ్యపూర్వకంగా వారి జనాభా లెకలను పెంచి చూపిస్తున్నది. 1921 మహా విభాజక సంవత్సరం నుంచి దేశ జనాభా పెరుగుతూ వస్తుంటే ..చెంచుల జనాభా మాత్రం ఊహించనంత వేగంగా తగ్గుకుంటూ వస్తున్నది. పాలకులు ఇదేమీ పట్టనట్టు చెంచులను అడవి దాటించే ప్రయత్నం చేస్తున్నారు. గిరిజనేతరుల అటవి ఆక్రమణను వదిలేసి చెంచులను మాత్రమే అటవికి దూరంగా తరలిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని మొదటి దశలో వట్వార్లపెల్లి, సార్లపెల్లి, కుడి చింతలబైలు, కుమ్మెనపెంట, కొల్లంపెంటను బలవంతంగా తరలించేందుకు సర్కార్ సిద్ధమైంది. ఎకో సెన్సిటివ్, సైలెంట్ జోన్ల పర్యవేక్షణ కోసం రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖలతో ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చారు. అటవీ ఆక్రమణలు, చెట్ల నరికివేత ల పేరుతో అడవిలో అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తున్నారు.తెలంగాణ వార్తలు నిజానికి చెంచులను అడవి దాటించే ప్రయత్నం ఈనాటిది కాదు.. 1910లో ఒకసారి, 1932-34 మధ్య కాలంలో మరోసారి, 1937లో ఇంకోసారి చెంచులను తరలించే ప్రయత్నాలు జరిగాయి. 1941-42 మధ్య కాలంలో అమ్రాబాద్ మండలం అప్పాపూర్ పరిసర ప్రాంతం చెంచు పెంటలను తరలించి, పునరావాసం కల్పించాలని ప్రభుత్వం భావించింది. తరలింపు కార్యక్రమం జరుగక ముందే 400 మంది చెంచులు గుండె పగిలి చనిపోయారు. దీంతో ప్రభుత్వం తన అభిప్రాయం మార్చుకుంది. వారిని స్థానిక ప్రాంతంలో ఉంచి అభివృద్ధి చేయాలని నిర్ణయించుకుంది. 2003లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 15 పెంటలకు చెందిన దాదాపు 300 మంది కుటుంబాలను బలవంతంగా తరలించారు. ఆప్రయత్నంలో 70 మంది చెంచులు మరణించారు. ఈ అనుభవాలను అధ్యయనం చేసిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చెంచులను అడవి దాటించాలనే ఆలోచనను వ్యతిరేకించారు. అటవి హకుల చట్టం కింద చెంచులకు సాంక్రమించిన 7380 ఎకరాల్లో పట్టా భూములకు చట్టబద్దత కల్పించారు. మరో 1000 ఎకరాలకు ఆర్‌వోఎఫ్ ఆర్ పట్టాలు ఇచ్చారు. ఈ భూములకు రైతుబంధు ఇచ్చారు. పట్టా భూముల్లో ఉపాధి హామీ పథకం కింద 150 రోజుల పని దినాలు కల్పించారు. నల్లమలలో యురేనియం తవ్వకాలు జరపవద్దని 2019లో కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, కేంద్రానికి పంపారు. 1940లో సామాజిక పరిశోధకుడు, రచయిత హైమండాఫ్ చెంచు పెంటలను సందర్శించినపుడు చెంచు గుడిసెల ముందు అకడకడ వ్యవసాయం కన్పించిందట. అదే హైమండాఫ్ తిరిగి 1970లో మరో సారి చెంచుల పెంటకు వెళ్లినపుడు వ్యవసాయం కన్పించ లేదని రాశారు. నాటి నుంచి ఇప్పటి వరకు వారు ఆహర సేకరణ నుంచి వ్యవసాయం వైపు పరివర్తనం చెందలేదనే చెప్పాలి. ప్రభుత్వం సేద్యం వైపు ప్రోత్సహిస్తే.. ఒకొక గూడెంలో 400 నుంచి 500 ఎకరాల సాగుభూమి అందుబాటులోకి వస్తుంది. ఈ భూమిని అభివృద్ధి చేసి చెంచులను వ్యవసాయం వైపు మళ్లించాలని హైమండాఫ్ అప్పట్లోనే సూచించారు. సాగునీటి సౌకర్యంతో పాటు వర్షాధారంగా పంటలు పండే భూమి నల్లమలలో ఉందని, ఇలాంటి భూమి దాదాపు లక్ష ఎకరాల వరకు ఉంటుందని, ఈ మైదాన భూమిని చెంచులకు రిజర్వ్ చేయాలని 1941లో ఆయన ప్రతిపాధించారు. హైమండార్ఫ్ ప్రతిపాదనలు పరిగణలోకి తీసుకున్న అప్పటి నిజాం ప్రిన్సిలీ స్టేట్ గవర్నమెంటు నల్లమల ప్రాంతం చెంచులకే చెందుతుందని 1942 మార్చి ఒకటిన డిక్లేర్ చేసింది. ఈ డిక్లరేషన్తో నల్లమల అడివి. అందులో సాగుకు అనుకూలంగా ఉన్న లక్ష ఎకరాల భూమి కూడా చెంచుల అధీనంలోకి వెళ్లిపోయింది. ఇక ఇకడి నుంచి చెంచులను తరలించటం చట్ట విరుద్ధమే. పులులకు అభయారణ్యాలను రిజర్వ్ చేసినట్టుగానే చెంచు జాతి కోసం నల్లమల ఫారెస్టును రిజర్వ్ చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞాపణ. అటవి హకుల చట్టం కింద చెంచులకు సాంక్రమించిన 7380 ఎకరాల్లో పట్టా భూములకు చట్టబద్దత కల్పించారు. మరో 1000 ఎకరాలకు ఆర్‌వోఎఫ్ ఆర్ పట్టాలు ఇచ్చారు. ఈ భూములకు రైతుబంధు ఇచ్చారు. పట్టా భూముల్లో ఉపాధి హామీ పథకం కింద 150 రోజుల పని దినాలు కల్పించారు. నల్లమలలో యురేనియం తవ్వకాలు జరపవద్దని 2019లో కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, కేంద్రానికి పంపారు.

# విజయ్ విజయంలో పాఠాలు, హెచ్చరికలు!

ప్రజాస్వామ్యంలో ఎంత బలముందో ఎన్నికల ఫలితాల రోజు మనకు అర్థమవుతుంది. కొన్నిసార్లు అద్భుతాలు జరగవచ్చు. అసోం, పశ్చిమ బంగ, తమిళనాడు, కేరళం, పుదుచ్చేరి (యూటీ) అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆ బలాన్ని, అద్భుతాన్ని మన ముందు ఆవిష్కరించాయి. ఈ ఐదు అసెంబ్లీల తాజా ఎన్నికల్లో దిగ్భ్రాంతిని, ఆశ్చర్యాన్ని ఎక్కువగా కలిగించినది తమిళనాడు ప్రజా తీర్పు. రెండు బలమైన పార్టీలు పాతుకుపోయినప్పుడు, అవి ఎంతో కొంత కొంత మంచి చేస్తున్నప్పుడు.. వాటిని ఇంటికి పంపించేసి కొత్తపార్టీని అధికారంలోకి తీసుకురావటం మన దేశ పరిస్థితుల్లో దాదాపు అసాధ్యం. కానీ, తమిళనాడు ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో అదే జరిగింది. ద్రవిడ పార్టీల మూస రాజకీయానికి గండిపడింది. ప్రస్తుతమున్న రాజకీయం కొనసాగటం సాధ్యం కాదు, ప్రజలు ఎప్పుడైనా ప్రభుత్వాల జాతకాలను తారుమారు చేయవచ్చు, కొత్త నేతలను, కొత్త పార్టీలనూ తీసుకురావచ్చు.. అన్నది తమిళ ప్రజల తీర్పులోని నిష్కర్ష. ఇది మంచి సంకేతం. అలాంటి హెచ్చరిక లేకపోతే పాతుకుపోయిన పార్టీలు తాము తప్ప ప్రజలకు ఇంకెవరూ గతిలేరని భావించే అవకాశముంది. దాన్నుంచి బయటపడటానికి ఇది మంచి అవకాశం. ఈ దేశ ప్రజాస్వామ్యంలో ఎలాంటి మార్పులు తేవాలి, ప్రజల్లో అసంతృప్తిని ఏ రకంగా తొలగించాలి ఇత్యాది అంశాలపై పార్టీలు ఇకనైనా దృష్టి పెడితే మంచిది. కానీ తమిళ ప్రజాతీర్పులో ప్రమాద ఘంటిక కూడా ఉంది. మంచి పాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడుతున్న పార్టీలను తిరస్కరించి కొత్త పార్టీకి పట్టం గట్టారంటే.. క్షణాల్లో మార్పు రావాలన్న కోరిక ప్రజల్లో కనిపిస్తోంది. ఈ సోషల్ మీడియా యుగంలో తమ జీవితాల్లోనూ అద్భుతాలు జరగాలని కోరుకుంటున్నట్లు కనిపిస్తుంది. వెంటనే మార్పు జరగాలనే కాంక్షతో, తొందరపాటుతో, ఆకాంక్షలు త్వరితంగా నెరవేరటంలేదనే అసంతృప్తితో గనక ఎన్నికల్లో ఓట్లు వేయటానికి ప్రజలు సిద్ధపడితే-- దేశంలో అస్థిరత పెరిగే అవకాశం ఉంది. కాబట్టి.. ఒకపక్కన అవకాశం, మరోపక్కన ప్రమాదం. దీన్ని కొంచెం లోతుగా అధ్యయనం చేసి పాఠాలు నేర్చుకోవాలి. తమిళనాడులో మైనారిటీలు-- క్రైస్తవులు, ముస్లింలు-- దాదాపు అందరూ విజయ్ పార్టీకి ఓటు వేశారు. అదే విధంగా 20 శాతంగా ఉన్న దళితులూ విజయ్ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే)కి ఓటు వేసినట్లు అంచనా. సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్న తమిళనాడులో ప్రజలు ఇలా ఓటు వేయటంపై మనం వెంటనే మేలుకోనట్లయితే, మన రాజకీయంలో ఉన్న పొరపాట్లు సవరించుకోనట్లయితే.. మూల్యం చెల్లించుకోకతప్పదు. రాజకీయ పార్టీలు, అందులోనూ సాంప్రదాయ రాజకీయ పార్టీలు -- జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న బీజేపీ, దాని మిత్రపక్షాలు కావచ్చు, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఇతర పార్టీలు కావచ్చు-- యధాలాపంగా ఈ పరిణామాన్ని తీసుకోకూడదు. సమాజంలో అట్టడుగున ఏం జరుగుతున్నదో గమనించాలి. పొరుగు శ్రీలంకలో అలా సరైన సమయంలో గమనించకపోవటం వల్ల ఆ దేశంలో ఏం జరిగిందో చూశాం. ఆ దేశ ప్రజలు ప్రధాన పార్టీలు రెండిటినీ తిరస్కరించి జనతా విముక్తి పెరమున (జేవీపీ) నేత అనూర కుమార దిస్సనాయకేను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అదేవిధంగా, నేపాల్‌లో బాలేంద్రషా. పెద్ద విప్లవంలా పరిణామాలు జరిగాక, అన్ని ప్రధాన పార్టీలనూ ఇంటికి పంపించేసి కొత్తగా వచ్చిన రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ వేదిక ద్వారా బాలేంద్రషాని ప్రధానమంత్రిని చేశారు. తమిళనాడులోనూ ఆ రకమైన భావజాలం కొంత కనిపిస్తుంది. కానీ అక్కడి పరిస్థితులు వేరు. శ్రీలంకలోగానీ, నేపాల్‌లోగానీ ప్రధాన పార్టీలు ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయాయి. ఉప్పెనలా ప్రజలు తిరగబడ్డాక జరిగిన ఎన్నికల్లో కొత్త పార్టీలొచ్చాయి. తమిళనాడులో పరిస్థితి అది కాదు. దేశంలోనే సమర్థ పాలన నందిస్తున్నారు, ఆర్థిక ప్రగతి బాగా ఉంది అనుకున్నా తిరస్కరించారంటే.. ప్రజలు చాలావేగంగా జీవితాల్లో మార్పు రావాలని కోరుకోవటం ప్రస్ఫుటమవుతోంది. ప్రజలకు నచ్చచెప్పగలగాలి, మార్పు అంత వేగంగా జరగకపోవచ్చని తెలియచెప్పాలి. అధికారాన్ని వికేంద్రీకరించి, ప్రజలకు భాగస్వామ్యం కల్పించగలగాలి. ఇక ఓట్లకు విజయ్ పార్టీ డబ్బులు పంచినట్లు దాఖలాలు లేవు. మిగతా దక్షిణాది రాష్ట్రాలలో కేరళం మినహాయిస్తే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలో వలే తమిళనాడులోని పార్టీలూ పుష్కలంగా డబ్బు పంచుతున్నాయి. డబ్బులున్నవారికే ఎన్నికల్లో సీట్లు ఇస్తున్నాయి. విజయ్ పార్టీ అలా కాదు. డబ్బుల ప్రభావం లేకుండా విజయం సాధించిందని చెబుతున్నారు. ఇది ఆలోచించదగ్గ అంశం. ఆహ్వానించదగ్గ పరిణామం. చిరంజీవి, పవన్ కళ్యాణ్, కమల్ హాసన్ లాంటి వారికి దక్కని విజయం విజయ్ పార్టీకే ఎలా దక్కిందో మనకు తెలుసు అనుకుంటే, మనల్ని మనం మోసం చేసుకోవటమే అవుతుంది. పాతుకుపోయిన పార్టీలు బలంగా ఉన్నప్పుడు, రెండు పార్టీల మధ్య గట్టి పోటీ ఉన్నప్పుడు, మూడవ పార్టీకి మన ఎన్నికల వ్యవస్థలో స్థానం చాలా తక్కువ. కాబట్టి, మూడో పార్టీ గెలవలేక పోవడం ఆశ్చర్యమేమీ కాదు. ఎన్నికల సమయంలో సమాచారం ప్రకారం.. టీవీకే ఒక ప్రభావశీల పార్టీగా ఉంటుందిగానీ, ఎన్నికల్లో గెలిచే స్థాయి దానికి ఉండదని భావించాను. అసలు ప్రధాన పార్టీలనే పక్కనపెట్టి టీవీకే విజయం సాధించే అవకాశం వస్తుందని ఊహించలేదు. సకల జీవన రంగాలలో మార్పు వేగంగా రావాలనే ప్రజల ఆరాటానికి టీవీకే సంచలన విజయం ఒక సంకేతం. సాంప్రదాయ రాజకీయాలు ఉన్నవి ఉన్నట్లు కొనసాగిస్తే, అంటే, డబ్బు, కులం వంటివి తప్ప.. సామర్థ్యం, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చటం, మౌలిక మార్పులు తేవటం మాకు అనవసరం అనే రకంగా వ్యవహరిస్తే-- ఇక కాలం చెల్లినట్లే. అయితే అక్కడి ప్రజలతో నేరుగా మాట్లాడకుండా, మనం కచ్చితంగా ఇది ఏ స్థాయిలో మార్పు అనేది చెప్పలేం.



# గర్భధారణ సమయంలో మహిళలకు వచ్చే ముఖ్యమైన సమస్యలు ఇవే..

గర్భధారణ ప్రతి మహిళ జీవితంలో ఎంతో ఆనందకరమైన దశ. అయితే ఈ సమయంలో శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకోవడంతో కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంటుంది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇవి తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి. అందుకే గర్భధారణ సమయంలో క్రమం తప్పని వైద్య పరీక్షలు, పోషకాహారం, ఆరోగ్యకర జీవనశైలి చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రక్తహీనత, అధిక రక్తపోటు, గర్భకాల మధుమేహం వంటి సమస్యలను ముందుగానే గుర్తిస్తే ప్రమాదాలను తగ్గించే అవకాశం ఉంటుంది. ప్రతి సంవత్సరం ఇదే విషయంపై నేషనల్ సేఫ్ మదర్‌హుడ్ డేను ఈ సమయంలో నిర్వహిస్తారు. గర్భిణీల ఆరోగ్యం, మాతృ మరణాల తగ్గింపు, సురక్షిత ప్రసవాలపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. సరైన వైద్య సేవలు, గర్భధారణ సమయంలో పరీక్షలు, ప్రసవానంతర సంరక్షణ ప్రతి మహిళకు అందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**గర్భస్థ సమయంలో మధుమేహం..**

ఇక గర్భధారణ సమయంలో ఎక్కువగా కనిపించే సమస్యల్లో గర్భకాల మధుమేహం ఒకటి. ఈ పరిస్థితిలో రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల శిశువు అధిక బరువుతో పుట్టే అవకాశం ఉండటంతో పాటు ప్రసవ సమయంలో సమస్యలు వస్తాయి. సంపూర్ణ ధాన్యాలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం, చక్కెర, ప్రాసెస్డ్ ఫుడ్ తగ్గించడం ద్వారా ఈ ప్రమాదాన్ని తగ్గించవచ్చు. వైద్యుల సూచనల మేరకు వ్యాయామం చేయడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే గర్భధారణ సమయంలో అధిక రక్తపోటు లేదా ప్రీ ఎక్లాంప్సియా వంటి సమస్యలు కూడా కనిపించే అవకాశం ఉంటుంది. ఇది గర్భాశయానికి రక్తప్రసరణపై ప్రభావం చూపి ముందస్తు ప్రసవానికి దారితీస్తుంది. క్రమం తప్పకుండా ప్రీనాటల్ చెకప్‌లు చేయించుకోవడం, ఉప్పు తగ్గించడం, ఒత్తిడిని నియంత్రించడం, శారీరక కదలికలు కొనసాగించడం వంటి చర్యలు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి.

**తీవ్రమయ్యే రక్తహీనత..**

ముఖ్యంగా గర్భిణీల్లో రక్తహీనత సమస్య తలెత్తుతూ ఉంటుంది. శరీరంలో తగినంత ఎర్ర రక్తకణాలు లేకపోవడం వల్ల అలసట, బలహీనత, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆకుకూరలు, పప్పులు, ఐరన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను తగ్గించవచ్చు. అలాగే ఐరన్, ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్లను వైద్యుల సూచనల మేరకు తీసుకోవడం అవసరం. అదే విధంగా గర్భధారణ సమయంలో కొన్ని ఇన్‌ఫెక్షన్లు తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి. ముఖ్యంగా యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లు, వైరల్ లేదా బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుంది. పరిశుభ్రత పాటించడం, సరైన టీకాలు వేయించుకోవడం, పాక్షికంగా వండిన ఆహారం తీసుకోకపోవడం ద్వారా ఈ సమస్యలను నివారించవచ్చు. అంతేకాకుండా గర్భిణీల్లో ముందస్తు ప్రసవం అనే సమస్య కూడా తలెత్తే అవకాశం ఉంది. 37 వారాలకు ముందే ప్రసవం ప్రారంభమైతే దాన్ని ముందస్తు ప్రసవంగా పరిగణిస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో పుట్టిన శిశువులకు అభివృద్ధి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఒత్తిడి, ఇన్‌ఫెక్షన్లు, ధూమపానం, మద్యం వంటి అలవాట్లు దీనికి కారణమవుతాయి. ఆరోగ్యకర జీవనశైలి పాటించడం, వైద్యుల సూచనలు కచ్చితంగా అనుసరించడం ద్వారా ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

**గర్భస్రావం జరిగే ప్రమాదం..**

వీటితో పాటు గర్భధారణ ప్రారంభ దశలో గర్భస్రావం జరగడం కూడా చాలామందిలో ఆందోళన కలిగించే అంశం. అన్ని సందర్భాల్లో దీన్ని పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, ఆరోగ్యకర జీవనశైలి పాటించడం ద్వారా ప్రమాదాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. హానికర పదార్థాలకు దూరంగా ఉండటం, దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రణలో ఉంచడం, సరైన విశ్రాంతి తీసుకోవడం చాలా అవసరం. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రస్తుతం అధిక వయస్సులో గర్భధారణ, ఊబకాయం వంటి కారణాల వల్ల గర్భధారణ సమస్యలు పెరుగుతున్నాయి. అయినప్పటికీ సరైన వైద్య పర్యవేక్షణ, క్రమం తప్పని పరీక్షలు,

# ఉదయం నిద్ర లేవగానే చాలా సేపటి వరకు నడుము బిగుతుగా ఉంటుందా.. అయితే కారణం ఇదే..



ఉదయం నిద్రలేవగానే నడుము బిగుసుకుపోయినట్టు అనిపించడం చాలామందికి సాధారణ సమస్యగా కనిపిస్తుంది. అయితే ఈ నొప్పి ప్రతిరోజూ కొనసాగుతూ గంటల పాటు తగ్గకపోతే, అది తీవ్రమైన వెన్నెముక సమస్యకు సంకేతం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అంకిలోజింగ్ స్పాండిలైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రారంభ లక్షణంగా దీన్ని పరిగణిస్తున్నారు. తాజాగా వచ్చిన ఒక అధ్యయనం ప్రకారం హోల్ బాడీ క్రయోథెరపీ అనే చికిత్సా విధానం ఈ సమస్యతో బాధపడుతున్న వారికి ఉపశమనం కలిగించే అవకాశముందని వెల్లడైంది. అంకిలోజింగ్ స్పాండిలైటిస్ అనేది వెన్నెముక, కీళ్లను ప్రభావితం చేసే దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేటరీ వ్యాధి.

**వెంటనే వైద్యులను సంప్రదించాలి..**

ఈ సమస్య ఉన్నవారిలో ఉదయం సమయంలో నొప్పి, బిగుతు, కదలికల్లో ఇబ్బందులు ఎక్కువగా కనిపిస్తాయి. శరీరం విశ్రాంతిలో ఉన్నప్పుడు కండరాలు గట్టిపడటం వల్ల ఉదయాన్నే నొప్పి తీవ్రమవుతుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా యువతలో ఈ సమస్య పెరుగుతున్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. నిపుణుల ప్రకారం కొన్ని లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఉదయం నడుము నొప్పి గంటకు పైగా కొనసాగడం, ప్రతిరోజూ పునరావృతం కావడం, విశ్రాంతి తీసుకున్నప్పుడు నొప్పి పెరగడం, కదలికలతో కొంత ఉపశమనం కలగడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. కుటుంబంలో ఆర్థరైటిస్ చరిత్ర ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. యూరోపియన్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన తాజా సమీక్షలో హోల్ బాడీ క్రయోథెరపీ వల్ల అంకిలోజింగ్ స్పాండిలైటిస్ రోగులకు ప్రయోజనం కలగవచ్చని వెల్లడైంది.

**క్రయోథెరపీతో మెరుగైన ఫలితాలు..**

మొత్తం 310 మంది రోగులపై నిర్వహించిన ఐదు అధ్యయనాల డేటాను విశ్లేషించగా, ఈ థెరపీ వల్ల నొప్పి, ఉదయపు బిగుతు తగ్గినట్లు గుర్తించారు. అలాగే శరీర కదలికలు మెరుగుపడటంతోపాటు రోగుల జీవన నాణ్యత కూడా కొంత మెరుగైనట్టు అధ్యయనంలో తేలింది. క్రయోథెరపీ అనేది శరీరాన్ని అత్యల్ప ఉష్ణోగ్రతలకు కొద్దిసేపు గురిచేసే చికిత్సా విధానం. సాధారణంగా మైనస్ ఉష్ణోగ్రతల్లో 80 సెకన్ల నుంచి మూడు నిమిషాల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. దీని వల్ల శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గి కండరాలు సడలుతాయి.

# భోజనం చేశాక ఈ మూడు రకాల గింజలను తినండి.. ఎలాంటి సమస్యలు రావు..



భోజనం చేసిన తర్వాత కడుపు ఉబ్బరం, గ్యాస్, అసిడిటీ, భారంగా అనిపించడం వంటి సమస్యలు చాలా మందిని వేధిస్తుంటాయి. ముఖ్యంగా ఆయిల్ ఎక్కువగా ఉన్న ఆహారం లేదా భారమైన భోజనం చేసినప్పుడు జీర్ణక్రియ నెమ్మదిగా మారుతుంది. ఇలాంటి సమస్యలకు సహజసిద్ధమైన పరిష్కారంగా సోంపు, వాము, జీలకర్ర గింజలను నమలాలని నిపుణులు సూచిస్తున్నారు. సరైన మోతాదులో ఈ గింజలను తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు పొట్ట అసౌకర్యాలు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. భోజనం తర్వాత ఈ మూడు గింజలను నమలడం భారతీయ సంప్రదాయంలో చాలా కాలంగా ఉంది. అయితే దీనికి శాస్త్రీయ కారణాలూ ఉన్నాయని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు. గింజలను నెమ్మదిగా నమలడం వల్ల వాటిలోని సహజసిద్ధమైన సంయోగాలు లాలాజలంతో కలిసి శరీరంలోకి చేరి జీర్ణక్రియను వేగవంతం చేస్తాయని చెబుతున్నారు.

**జీర్ణ సమస్యలకు అనేక కారణాలు..**

అసలు భోజనం తర్వాత జీర్ణక్రియ ఎందుకు నెమ్మదిస్తుంది అనే విషయాన్ని పరిశీలిస్తే, అధిక కొవ్వు, రిఫైన్ కార్బొహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు పేగులు ఆహారాన్ని జీర్ణం చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి. అలాగే ఒత్తిడి, శారీరక కదలికల లోపం, తక్కువ ఎంజైమ్ ఉత్పత్తి వంటి కారణాలు కూడా జీర్ణక్రియపై ప్రభావం చూపుతాయి. ఈ పరిస్థితుల్లో సోంపు, వాము, జీలకర్ర వంటి గింజలు సహజ డైజెస్టివ్ సపోర్ట్‌గా పనిచేస్తాయని చెబుతున్నారు. సోంపు గింజలు గ్యాస్, కడుపు ఉబ్బరాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. వీటిలో ఉండే అనేతోల్ అనే సంయోగం జీర్ణాశయ కండరాలను సడలించి ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా చేస్తుంది. అలాగే లాలాజల ఉత్పత్తిని పెంచి జీర్ణక్రియ ప్రారంభ దశను మెరుగుపరుస్తుంది. అయితే భోజనం చేసిన వెంటనే కాకుండా 5 నుంచి 10 నిమిషాల తర్వాత తీసుకుంటే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని సూచిస్తున్నారు.

**అజీర్తి, అసిడిటీని తగ్గించే వాము..**

వాము గింజలు ముఖ్యంగా అజీర్తి, అసిడిటీ, భారంగా అనిపించే వారికి ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. వాములో ఉండే థైమాల్ అనే సంయోగం గ్యాస్ట్రిక్ ఎంజైమ్‌ల విడుదలను పెంచి ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా చేస్తుంది. ఆయిల్ ఎక్కువగా ఉన్న భోజనం చేసిన తర్వాత వాము తీసుకోవడం వల్ల గ్యాస్, కడుపు అసౌకర్యం తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. జీలకర్ర గింజలు జీర్ణక్రియ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి ప్యాంక్రియాస్ నుంచి జీర్ణ ఎంజైమ్‌ల విడుదలను ప్రేరేపించి పోషకాలు శరీరానికి సులభంగా అందేలా చేస్తాయి. అలాగే పేగుల్లో ఇన్‌ఫ్లమేషన్ (వాపు)ను తగ్గించి మలబద్ధకం సమస్యను కూడా నియంత్రించడంలో సహాయపడతాయి. జీలకర్రను స్వల్పంగా వేయించి తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

**వీరు తీసుకోకూడదు..**

ఈ గింజలను సరైన విధంగా తీసుకోవడం కూడా ముఖ్యమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మొత్తం కలిపి సుమారు అర టీస్పూన్ పరిమాణం సరిపోతుందని సూచిస్తున్నారు. గింజలను మింగకుండా నెమ్మదిగా నమలాలని చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల వాటిలోని సహజ రసాయనాలు విడుదలై శరీరానికి ఎక్కువ మేలు చేస్తాయి. అయితే ప్రతి ఒక్కరికీ ఈ అలవాటు సరిపోదని హెచ్చరిస్తున్నారు. +జు=ణ, తీవ్రమైన జీర్ణ సమస్యలు ఉన్నవారు, గర్భిణీలు లేదా కొన్ని ప్రత్యేక మందులు వాడుతున్నవారు వైద్యుల సలహా తీసుకున్న తర్వాత మాత్రమే ఈ గింజలను తీసుకోవాలి. అధిక మోతాదులో తీసుకుంటే లాభాలకంటే దుష్ప్రభావాలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

**ఆహార అలవాట్లు కూడా ముఖ్యమే..**

ప్రస్తుతం ఈ గింజలతో తయారైన డైజెస్టివ్ టాబ్లెట్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ, సహజ గింజలను సరైన మోతాదులో తీసుకోవడమే మంచిదని సూచిస్తున్నారు. దీర్ఘకాలికంగా జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే ఆహార అలవాట్లతో పాటు ఇలాంటి సహజ పద్ధతులను పాటించడం ఉపయోగకరమని నిపుణులు చెబుతున్నారు. భోజనం తర్వాత సోంపు, వాము, జీలకర్ర గింజలను అర టీస్పూన్ పరిమాణంలో నమలడం ఒక సులభమైన అలవాటు. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడటంతో పాటు గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గించడంలో ఉపయోగపడుతుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# రోజువారి దినచర్యలో ఈ చిన్న మార్పులు చేస్తే.. ఎన్నో రోగాలకు చెక్ పెట్టవచ్చు..



ప్రస్తుతం ఉరుకుల పరుగుల బిజీ జీవితంలో చాలా మంది సరైన జీవనశైలిని పాటించడం లేదు. ఉదయం ఆలస్యంగా నిద్ర లేవడంతోపాటు రోజంతా అన్ని పనులను వేళ తప్పించి చేస్తున్నారు. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌లను టైముకు చేయడం లేదు. రాత్రి పూట ఆలస్యంగా తినడం, లేటుగా నిద్రించడం చేస్తున్నారు. అలాగే రోజంతా గంటల తరబడి కూర్చుని పనిచేస్తున్నారు. శారీరక శ్రమ ఉండడం లేదు. ఇలా అస్తవ్యస్తమైన జీవనశైలి కారణంగా చాలా మందికి అనేక వ్యాధులు వస్తున్నాయి. టైప్ 2 డయాబెటిస్, ఊబకాయం, గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు వస్తున్నాయి. కానీ రోజువారి అలవాట్లు లేదా జీవనశైలిలో కొన్ని సులభమైన, స్వల్ప మార్పులు చేసుకుంటే దాంతో ఎలాంటి రోగాలు రాకుండా ముందుగానే నివారించవచ్చు. రోజువారి దినచర్యలో పాటించే కొన్ని అలవాట్లే పెద్ద మార్పులను ఇస్తాయి. అలాంటి అలవాట్ల గురించి వైద్య నిపుణులు వివరిస్తున్నారు.

**సూర్యకాంతిలో గడపాలి..**

ఎయిమ్స్‌లో శిక్షణ పొందిన వైద్యుడు డాక్టర్ సౌరభ్ సేథీ భవిష్యత్తులో వచ్చే అనేక వ్యాధులను నివారించేందుకు కొన్ని సులభమైన రోజువారీ అలవాట్లు ఎంతో ఉపయోగపడతాయని వెల్లడించారు. చిన్నచిన్న జీవనశైలి మార్పులు గుండె జబ్బులు, మధుమేహం, ఊబకాయం, జీర్ణ సంబంధ సమస్యలు, మానసిక ఒత్తిడి వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తాయని ఆయన వివరించారు. ఉదయం లేవగానే సూర్యకాంతిలో కొంత సమయం గడపడం అత్యంత ఉపయోగకరం. ఇది శరీరంలోని సర్కేడియన్ రిథమ్‌ను సరిచేసి నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుందని తెలిపారు. అదనంగా విటమిన్–డి ఉత్పత్తికి సహాయపడటంతోపాటు మానసిక ఆరోగ్యంపైనా సానుకూల ప్రభావం చూపుతుందని చెప్పారు.

**30 నిమిషాల తేలికపాటి వ్యాయామం అవసరం..**

రోజుకు కనీసం 30 నిమిషాల నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయాలని ఆయన సూచించారు. దీని వల్ల రక్త ప్రసరణ మెరుగుపడటంతో పాటు గుండె ఆరోగ్యం బలపడుతుందని తెలిపారు. రెగ్యులర్ ఫిజికల్ యాక్టివిటీ ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచి మధుమేహ ప్రమాదాన్ని తగ్గిస్తుందని అన్నారు. ఆహారపు అలవాట్ల విషయంలో ప్రాసెస్డ్ ఫుడ్స్, అధిక చక్కెర, ఫాస్ట్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. బదులుగా ప్రోటీన్, ఫైబర్, పండ్లు, కూరగాయలు, సహజ ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు.

# మ్యాచర్ వచ్చిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం

ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు, బీఆర్ఎస్ నాయకుల రోడ్డుపై బైఠాయించి ధర్నా



**రుద్రంగి :** అకాల వర్షాలు పడుతున్న నేపథ్యంలో మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని సెస్ డైరెక్టర్ ఆఫ్ గంగారం అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని అకాల వర్షాల నేపథ్యంలో తడిచిన ధాన్యాన్ని రోడ్డుపై ఉంచి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం ఆదివారం కోరుట్ల వేములవాడ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి దాదాపు నెల రోజులు అవుతుందని మ్యాచర్ వచ్చిన ఇప్పటివరకు తూకం వేయడం లేదని ఆరోపించారు. అకాల వర్షాల నేపథ్యంలో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ రావాలంటూ నినదించారు. ధాన్యం ఎప్పుడు కొంటారో హామీ ఇవ్వాలని తహసీల్దార్ పుష్పలత, ఎస్ఐ మోతిరామ్, డీఎస్ఓ బుచ్చిబాబు, డీఎంసీఎస్ నరసింహను కోరారు. రుద్రంగి మీదుగా వెళ్తున్నా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పోవాలి కేసీఆర్ రావాలి అంటూ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లో రైతుల ధాన్యం త్వరిగతిన కొనుగోలు చేశామని అన్నారు. వ్యవసాయానికి అండగా కేసీఆర్ ప్రభుత్వం గతంలో పని చేసిందని ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగా చేసిందని ఎద్దేవా చేశారు. లారీల కొరత ఉందని సాకులు చెబుతూ మ్యాచర్ వచ్చిన వడ్లను తూకం వేయడంలో కూడా జాప్యం చేస్తున్నారని రైతులు ఆరోపించారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్దనే ధాన్యం కొనుగోలు చేస్తున్నారని సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఇప్పటివరకు కేవలం 4వేల క్వింటళ్ల ధాన్యం మాత్రమే కొన్నారని ఇంకా 30 వేల క్వింటాళ్ల ధాన్యం అలాగే ఉందని మళ్లీ పంటలు వేసే సమయం వచ్చిన ధాన్యం కొనడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పులూటి గణేష్ చెప్పాలని దేగావాత్ తిరుపతి, దయ్యాల కమలాకర్, మంచే రాజేశం, కంటె రెడ్డి, నాగులపల్లి రవి అల్లూరి గంగారెడ్డి, బోయిన చంద్రయ్య, కాదాస్ లక్ష్మణ్ కొడగంటి శ్యామ్, గంతే ప్రశాంత్, దయ్యాల నారాయణ, ఆకుల గంగాధర్ లావుడియా మోహన్, దయ్యాల పెద్దలు, ఇర్ణం రాజేశం, తర్రే గంగారెడ్డి, గడ్డం మహేందర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్‌పై పోక్సో కేసు పెట్టలేదు.. బాల్క సుమన్ కీలక వ్యాఖ్యలు



కేంద్ర మంత్రి బండి సంజయ్ కొడుకు భగీరథ్‌పై పోక్సోకేసు నమోదు చేయలేదని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. బాధిత మైనర్ బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల విషయంలో రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఇవాళ బాల్క సుమన్ హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. చెన్నూరు నియోజకవర్గంలో వడ్లుకొనే పరిస్థితి లేదని బాల్క సుమన్ అన్నారు. మంత్రి వివేక్‌కు కలెక్టర్ గుమాస్తా లాగా పనిచేస్తున్నారని విమర్శించారు. మంత్రి వివేక్ రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అకాల వర్షాల కారణంగా ప్రమాదవశాత్తూ లక్సెట్టిపేటలో నలుగురు రైతులు చనిపోతే ఎందుకు పరామర్శించలేదని మండిపడ్డారు.

## గీత కార్మికులకు సబ్సిడీతో జీవన ఆధారం కల్పించాలి : మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**సారంగపూర్ :** ప్రమాదకరమైన వృత్తిలో ఉన్న గీత కార్మికులకు ప్రభుత్వం సబ్సిడీ సౌకర్యాలు ఇచ్చి జీవన ఆధారం కల్పించాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి కోరారు. జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం లచ్చక్క పేట గ్రామంలో రేణుక ఎల్లమ్మ తల్లి ప్రాణ ప్రతిష్ట, పట్నాల మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎల్లమ్మ తల్లి ఆశీర్వచనాలు ,దీవెనలు గీత కార్మికుల పైన ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.అన్నింటి కన్నా ప్రమాదకరమైన వృత్తి గౌడ సోదరుల గీత వృత్తి అని,గీత కార్మికులకు ఈత వనానికి 50 శాతం సబ్సిడీ ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపులతో గౌడ సోదరుల వృత్తికి ప్రమాదం ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం బెల్ట్ షాపులను నిషేధిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా బెల్ట్ షాపులను ఎత్తివేయాలని కోరారు.

# 30 పడకల దవాఖానకు మోక్షమెన్నడో?

హాలియాలో రూ.3.5 కోట్లతో నిర్మాణం పూర్తి

వైద్యసేవలు అందక పేదరోగులు ఇక్కట్లు

ప్రారంభోత్సవానికి సమయం ఇవ్వని స్థానిక ఎమ్మెల్యే



**హాలియా :** నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవల పరిస్థితి దయనీయంగా ఉంది. హాలియాలో పేరుకే 24 గంటల దవాఖాన ఉన్నది. ఇక్కడ ఒక్కరే డాక్టర్. ఆయన మొదటి షిఫ్ట్‌లో పనిచేస్తారు. రెండు, మూడు షిఫ్ట్‌లలో పనిచేసేందుకు వైద్యులు లేరు. సాయంత్రమైతే డాక్టర్ అందుబాటులో ఉండరు. అలాగే దవాఖానలో సగం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయినప్పటికీ పట్టించుకునే వారే లేరు.

**పేద రోగులకు వైద్యం అందని ద్రాక్షే..**

హాలియాలో 30 పడకల దవాఖాన నిర్మాణం పూర్తి చేసిన కాంట్రాక్టర్ బిల్డింగ్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేసి రెండు నెలలు దాటినా ప్రారంభించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులకు సమయం దొరకడం లేదు.

**3.5 కోట్ల విడుదల చేసిన కేసీఆర్..**

హాలియా చుట్టుపక్క ప్రాంత ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ హాలియాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేశారు. ఇందుకు కావాల్సిన రూ.3.5 కోట్లు కూడా విడుదల చేశారు. అలాగే పోస్టుమార్టం గదిని కూడా మంజూరు చేశారు. కాంట్రాక్టర్ దవాఖాన నిర్మాణం పూర్తి చేసి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్వాధీనం చేసుకోవాల్సిందిగా కొరుతున్నా ఎమ్మెల్యే ప్రారంభించనిదే తాము చేసుకోలేమంటూ వెనకడుగు వేస్తున్నారు.

**పేరుకే 24గంటల దవాఖాన..**

ప్రస్తుతం హాలియాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పేరుకే 24 గంటల దవాఖాన. కానీ వైద్య సేవలు మాత్రం పగటి పూటకే పరిమితం. దవాఖానలో ఒక్క స్టాఫ్ నర్సు పోస్టు, పార్మాసిస్టు పోస్టు , ఒక సూపర్‌వైజర్ పోస్టు ఖాళీగా ఉంది. మండలంలో మొత్తం 12 సబ్ సెంటర్లు ఉన్నాయి. ప్రతి సెంటర్‌కు ముగ్గురు ఏఎన్ఎంలతో కలిపి మొత్తం 36 మంది ఏఎన్ఎంలు ఉండాలి. కానీ కేవలం 13 మందే ఉన్నారు. 8 మంది హెల్త్ అసిస్టెంట్లకు గాను నలుగురే ఉన్నారు. 2014లో రాష్ట్రంలో అధికారంలోనికి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజలు, గిరిజనులు, పర్యాటకుల వైద్య సేవలను దృష్టిలో పెట్టుకొని రూ.18 కోట్లతో కమలానెహ్రూ దవాఖానను ఆధునీకరించారు. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ కృషితో డయాలసిస్ సెంటర్ మంజూరు చేశారు.

## దళిత యువకుని దారుణ హత్య.. గాడిదల గండి సమీపంలో కుళ్లిన మృతదేహం లభ్యం



**మంథని :** రామగిరి మండలం సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జూల వంశీ అనే దళిత యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. మంథని మండలం గాడిదల గండి సమీపంలో కుళ్ళిన స్థితిలో ఆయన మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. ఏప్రిల్ 30న వంశీ కనబడకుండా పోవడంతో మూడు నాలుగు రోజుల తర్వాత అతని కుటుంబ సభ్యులు గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మృతుడి కాల్ డేటా ఆధారంగా హైదరాబాద్ కు సంబంధించిన ఒక యువతి ని కలవడానికి వెళ్ళినట్లు గుర్తించిన పోలీసులు ఆ యువతిని అతని భర్తను తీసుకొచ్చి విచారణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

**లవ్ ఎఫైరే హత్యకు కారణమా?**

సింగిరెడ్డిపల్లికి చెందిన వంశీ అదే గ్రామానికి చెందిన ఒక యువతి తో ప్రేమ వ్యవహారం నడిపాడు. తర్వాత క్రమంలో ఆమె వేరొకరిని ప్రేమ వివాహం చేసుకోవడంతో ఇద్దరి మధ్య బ్రేకప్ అయినట్లు తెలిసింది. కాగా ఇటీవల గ్రామ దేవతల కొలుపు సందర్భంగా తిరిగి గ్రామానికి వచ్చిన యువతితో మళ్లీ అతను చనువుగా వ్యవహరించడంతో ఇద్దరి మధ్య ఫోన్ సంభాషణలు మొదలయ్యాయి. ఇది తెలిసిన ఆ యువతి భర్త చాకచక్యంగా ఆ యువతి తోటే అతన్ని ఏప్రిల్ 30న హైదరాబాద్కు పిలిపించి హత్య చేసి అతని శవాన్ని మంథని సమీపంలోని గాడిదల గండిలో వేసినట్లు పోలీసుల ముందు ఒప్పుకోవడంతో వంశీ మృతదేహం కుళ్ళిన స్థితిలో లభ్యమైనట్లు సమాచారం. హత్య జరిగి సుమారు పది రోజులు కావడంతో అతని మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో లభ్యమైంది.

# జలం లేని భూపాలపల్లి జిల్లా ఆస్పత్రి



**జయశంకర్ భూపాలపల్లి :** సమైక్య పాలన సంకెళ్లు తెంచుకుని ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో నాటి సీఎం గా కేసీఆర్ వైద్యం, విద్య, నీటి వనరులపై ప్రత్యేక దృష్టి సారించారు. కేసీఆర్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం భూపాలపల్లిలోని కేటీపీపీలో ఏర్పాటు చేసిన సభలో 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేశారు. పక్కనే ఉన్న మహారాష్ట్ర ప్రజలకు సైతం సేవలందించేలా నిర్మాణం చేశారు. జిల్లా కేంద్రంలో దవాఖానతో పాటు టీ దయాగ్నొస్టిక్స్‌ను సైతం అందుబాటులోకి తీసుకురాగా ప్రైవేట్ హాస్పిటల్స్‌కు దీటుగా వైద్య సేవలందాయి.తెలంగాణ వార్తలు ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో మళ్లీ సీన్ రివర్స్ అయింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. కనీసం ఆస్పత్రిలో తాగునీరు దొరకని పరిస్థితి దాపురించింది. మరుగుదొడ్ల కోసం మున్సిపాలిటీ వాటర్ ట్యాంకర్ల ద్వారా నిత్యం నీరు సరఫరా అవుతున్నదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అవగతమవుతుంది. వేసవి సమీపిస్తే తాగునీటి ఎద్దడి ప్రారంభమవుతుందని తెలిసినా అధికార యంత్రాంగం, ప్రభుత్వం ఎలాంటి యాక్షన్ ప్లాన్ రూపొందించలేదు. ఇంత పెద్ద ఆస్పత్రిలో నీళ్లు దొరకక రోగులు, అటెండెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రభుత్వ పనితీరును ఎండగడుతున్నారు.

**ముందుచూపు లేని సర్కారు**

భూపాలపల్లిలోని మంజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ప్రధాన వైద్యశాలలో కేసీఆర్ ముందు చూపుతో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. నిత్యం సుమారు 700 వరకు ఓపీ నమోదవుతున్నది. నెలకు సుమారు 100 నుంచి 150 డెలివరీలు, ఇతర జనరల్ సర్జరీలు జరుగుతున్నాయి. ఇంత పెద్ద ఆస్పత్రిని నీటి సమస్య పట్టి పీడిస్తున్నది. దవాఖానకు వచ్చే ఔట్ పేషెంట్లు, అడ్మిట్ అయిన వారు, అటెండెంట్లు గొంతు తడుపుకోవడానికి నీళ్ల బాటిల్‌లు కొనుక్కోవాల్సిందే. హాస్పిటల్‌లో ఎక్కడ చూసినా వాటర్ బాటిల్‌లే దర్శనమిస్తాయి. గతంలో ఇక్కడ అన్నదానం చేసిన స్వచ్ఛంద సంస్థలు నీటి సమస్యతో నిలిపివేశాయి. ఇదిలా ఉండగా ఆస్పత్రిలో ఏ మరుగుదొడ్డి చూసినా నీళ్లు లేక కంపుకొడుతున్నాయి. మున్సిపల్ వాటర్ ట్యాంకర్లతో నీళ్లు తెప్పించి తాత్కాలికంగా శుభ్రం చేయించినా ఫలితం లేదు. మరుగుదొడ్లకు వెళ్లలేకపోతున్నట్లు రోగులు వాపోతున్నారు. పేషెంట్లు సైతం బహిర్భూమికి వాటర్ బాటిల్‌లు పట్టుకుని బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందంటే ప్రజా పాలన ఎలా ఉందో అవగతమవుతుంది. వేసవి వస్తే నీటికి ఇబ్బంది ఉంటుందని తెలిసీ అధికారులు, ప్రజాప్రతినిధులు అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడంలో విఫలమయ్యారని, హాస్పిటల్ ఆవరణలో అమృత్ 2.0 పథకం కింద నిర్మిస్తున్న ట్యాంకును ముందు చూపుతో త్వరితగతిన పూర్తి చేయిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని పలువురు వైద్యులు చెబుతున్నారు.

## సెల్‌ఫోన్ చూడొద్దన్నందుకు ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



**హైదరాబాద్ :** సెల్‌ఫోన్‌ను తరచూ చూడొద్దన్నందుకు ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ అఖిల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అశ్వరావుపేటకు చెందిన సంకుల పవన్ కుమార్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. వేసవి సెలవులకు ఇంటికి వచ్చిన పవన్ అదే పనిగా సెల్ చూడొద్దని ఈనెల 7న తండ్రి రాజు మందలించడంతో మనస్థాపం చెందిన పవన్ గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పవన్ మృతి చెందాడు. తండ్రి రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## నర్సాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి





**నర్సాపూర్ :** మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం ఆనంద్ గార్డెన్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలను ఆటో ఢీకొనగా ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. నర్సాపూర్ సమీపంలోని ఫంక్షన్ హాల్ లో ఫంక్షన్‌కు హాజరయ్యే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కౌడిపల్లి మండలం వెంకటరావుపేట గ్రామానికి చెందిన దిలీప్, మనోహర్ అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. శుభకార్యానికి వెళుతుండగా ఈ దుర్ఘటన జరగడం పట్ల కుటుంబ సభ్యులు తీవ్ర శోకసముద్రంలో మునిగిపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## బిజినెస్

### సీబీ 1000 హార్నెట్ ఎస్‌పీ బైకుల రీకాల్



**న్యూఢిల్లీ :** హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియాకు చెందిన సీబీ 1000 హార్నెట్ ఎస్‌పీ మోటర్‌సైకిళ్లను రీకాల్ చేస్తున్నట్టు ప్రకటించింది. చమురు పైపునకు సంబంధించి రెండు రకాల టెక్నికల్ సమస్యలు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నది. సెప్టెంబర్ 30, 2024 నుంచి ఆగస్టు 22, 2025లోపు తయారైన ఈ మోటర్‌సైకిళ్లలో రెండు సాంకేతిక సమస్యలు గుర్తించినట్టు, దీంట్లో ఇంధన సరఫరా గొట్టం అమరికకు సంబంధించనదని, నిర్దిష్ట పరిస్థితుల్లో ఆ పైపు సరిగ్గా బిగించబడి ఉండేలా నిర్ధారించుకోవడానికి తనిఖీ అవసరమని గుర్తించి వెంటనే ఈ బైకులను వెనక్కి పిలిపించినట్టు తెలిపింది.

### సింగరేణి భవిష్యత్తుకు 9 కొత్త గనులు

**ఈ ఏడాది మూడు, వచ్చే ఏడాది రెండు గనుల ప్రారంభం**

**సమీక్షించిన సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాశ్ జ్యోతి**

**హైదరాబాద్ :** బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన సింగరేణి ఉజ్వల భవిష్యత్తు కోసం మరో 9 గనులను ప్రారంభించనుంది. ఈ ఏడాది మూడు, వచ్చే ఏడాది రెండు కొత్త గనులతోపాటు పాత గనుల సామర్థ్యాన్ని భారీగా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ తొమ్మిది కొత్త ప్రాజెక్ట్‌లు చేపట్టేందుకు సంస్థ కేంద్ర బొగ్గు, అటవీ, పర్యావరణ శాఖల అనుమతికి ప్రతిపాదనలు సమర్పించింది.తెలంగాణ వార్తలు ఇప్పటికే కొత్తగూడెంలో వీకే కోల్‌మైన్ అనుమతులు లభించాయి. ఈ గని మట్టి తొలగింపు పనులు నడుస్తుండగా, త్వరలోనే బొగ్గు వెలికితీతను ప్రారంభించనున్నారు. కొత్త బొగ్గు గనులపై సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాశ్ జ్యోతి సమీక్షను నిర్వహించారు. కొత్త ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే 20 ఏండ్ల పాటు బొగ్గు ఉత్పత్తి జరగనుందన్నారు. 2027-28 ఆర్థిక సంవత్సరంలో సింగరేణిలో నాలుగు గనులు మూతపడుతుండగా, దీంతో 12.51 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోనున్నది. దీంతో కొత్తగా ప్రారంభించే గనుల ద్వారా ఈ లోటును భర్తీచేసుకునే అవకాశమేర్పడనుంది. గనుల ప్రారంభానికి, అనుమతులు పొందేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# హీట్ బీటర్స్.. కూల్‌గా ఉంచే బెస్ట్ గాడ్జెట్స్!



వేసవిలో ఎండ ఎంత పెరిగినా, మిమ్మల్ని మాత్రం కూల్‌గా ఉంచే బెస్ట్ హెల్పర్సే ఈ చిన్న గాడ్జెట్స్! ఇవి వేసవి కాలంలో చాలా ఉపయోగపడతాయి. ధర కూడా కొంత తక్కువగానే ఉండటం గమనార్హం. వీటి గురించి మరిన్ని వివరాలు ఇక్కడ..

**చల్లని టచ్‌తో గ్లోయింగ్ స్కిన్!**

వేసవిలో కూడా మీ ఫేస్ ఎప్పుడూ ఫ్రెష్‌గా, గ్లోయింగ్‌గా కనిపించాలని అనుకుంటున్నారా? అయితే ఈ చిన్న ఐస్ రోలర్ బ్యూటీ టూల్ మీ డైలీ స్కిన్ కేర్‌లో ఒక సూపర్ హెల్పర్ అవుతుంది. దీనిని ఫ్రిజ్‌లో కొద్దిసేపు పెట్టి, తర్వాత ముఖంపై నెమ్మదిగా రోల్ చేస్తే చల్లని థెరపీ లభిస్తుంది. ఇది ముఖానికి రిఫ్రెషింగ్ ఫీలింగ్ ఇచ్చి, పఫీనెస్ తగ్గించడంలో, స్కిన్ మరింత ఫ్రెష్‌గా కనిపించడంలో సహాయపడుతుంది. సిలికాన్‌తో తయారైన ఈ రోలర్ మళ్లీ మళ్లీ వాడుకునేలా డ్యూరబుల్‌గా డిజైన్ చేశారు. నీళ్లు లేదా గ్రీన్ టీ, రోజ్ వాటర్ లాంటి వాటితో ఫ్రీజ్ చేసి మీకు నచ్చిన విధంగా ఉపయోగించుకోవచ్చు. ధర కేవలం రూ. 140 మాత్రమే!

**మెడలోనే రక్షణ కవచం!**

బయట అడుగు పెడితే చాలు... దుమ్ము, ధూళి, పొగతో ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా ఉందా? అయితే వేరబుల్ పోర్టబుల్ ఎయిర్ ప్యూరిఫైయర్ మీ దగ్గర ఉండాల్సిందే! ఇది మీ మెడలో ఉంటే చాలు, మీరు ఎక్కడికి వెళ్లినా చల్లని, స్వచ్ఛమైన గాలి మీ వెంటే ఉంటుంది! గాలిలోని అత్యంత సూక్ష్మమైన కాలుష్య కణాలను, పొగను సెకన్లలో తొలగించి, ఇది గాలిని 99 శాతం స్వచ్ఛంగా మారుస్తుంది. పైగా ఫిల్టర్ మార్చాల్సిన అవసరం లేకుండా సులభంగా వాడుకునేలా డిజైన్ చేశారు. ట్రావెల్‌లో, ఆఫీస్‌లో లేదా బయట ఎక్కువసేపు ఉండాల్సిన వారికి ఇది ఒక స్మార్ట్ సపోర్ట్. ధర కేవలం రూ. 3,200.

**కూల్‌గా గేమ్ ఆడండి!**

వీడియో గేమ్స్ ఆడేటప్పుడు లేదా వీడియోలు ఎక్కువసేపు చూస్తుంటే ఫోన్ వేడెక్కి స్లో అవుతుందా? అయితే ఈ చిన్న 'ఫోన్ కూలర్' మీకు ఒక సూపర్ సొల్యూషన్. ఈ కూలర్‌ను ఫోన్‌కు జత చేస్తే చాలు, వేడి త్వరగా తగ్గించి ఫోన్‌ను కూల్‌గా ఉంచుతుంది. రెండు పవర్ మోడ్స్ ఉండటంతో అవసరానికి తగ్గట్టు కూలింగ్ లెవల్‌ను ఎంచుకోవచ్చు. గేమింగ్, వీడియో స్ట్రీమింగ్ లేదా లాంగ్ కాల్స్ సమయంలో ఇది మంచి సపోర్ట్‌గా ఉంటుంది. చిన్న సైజ్‌లో ఉండటం వల్ల ఫోన్ పట్టుకున్నప్పుడు ఏ అసౌకర్యం కలగదు. పైగా ఎక్కువ శబ్దం చేయకుండా నిశ్శబ్దంగా పనిచేస్తుంది. ధర కేవలం రూ. 1,100.

## సెమాగ్లుటైడ్ ధరలు తగ్గాయ్

**హైదరాబాద్:** ప్రపంచవ్యాప్తంగా మధుమేహం, ఊబకాయం చికిత్సలో సంచలనం సృష్టిస్తున్న సెమాగ్లుటైడ్ మందుల మార్కెట్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు చుక్కలనంటిన ఈ మందు తయారీకి వాడే యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియెంట్ (ఏపీఐ) ధరలు ఇప్పుడు అమాంతం నేల చూపులు చూస్తున్నాయి. గత ఏడాది కాలంలో ఈ ధరలు 80 శాతం మేర పడిపోవడం విశేషం. ముఖ్యంగా భారత మార్కెట్‌లో సెమాగ్లుటైడ్ పేటెంట్ గడువు మార్చిలో ముగియడంతో, దేశీయ ఫార్మా దిగ్గజాలు రంగంలోకి దిగడం ఈ ధరల పతనానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఈ పరిణామం భారతీయ జెనరిక్ కంపెనీలకు వరంగా మారింది. సామాన్య వ్యాధిగ్రస్తులకు బరువు తగ్గే మందులు అతి తక్కువ ధరకే అందుబాటులోకి రానున్నాయి. గతంలో సెమాగ్లుటైడ్ ఏపీఐ సరఫరా డానిష్ ఫార్మా దిగ్గజం నోవో నార్డిస్క్ వంటి కొన్ని కంపెనీల చేతుల్లోనే ఉండేది. దీంతో మార్కెట్లో ఒక గ్రాము సెమాగ్లుటైడ్ ఏపీఐ ధర ఏకంగా 900 డాలర్ల (రూ.83,000) వరకూ పలికేది. కానీ, ప్రస్తుతం ఈ ధరలు అమాంతం 160 డాలర్ల (రూ.14,500)కు పడిపోయాయి.

**దేశీయ కంపెనీల కన్ను..**

భారత్‌లో సుమారు 10 కోట్లకు పైగా మధుమేహ వ్యాధిగ్రస్తులు, 13.5 కోట్లకు పైగా ప్రజలకు ముందస్తు మధుమేహం ఉన్నట్లు అంచనా. 25 కోట్ల మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. దీంతో ఈ మందులకు దేశీయంగా భారీ గిరాకీ ఉంటుందని దేశీయ కంపెనీలు భావిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 2030 నాటికి బరువు తగ్గించే మందుల మార్కెట్ రూ.94,000 కోట్లకు (100 బిలియన్ డాలర్లు) చేరుకుంటుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ఇందులో భారత మార్కెట్ విలువ రూ.9,300 కోట్లుగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు భారత్‌లోని దాదాపు 50కి పైగా కంపెనీలు సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధాన్ని విడుదల చేశాయి.



**తక్కువ ధరకే..**

ప్రపంచ ఫార్మా రాజధానిగా పిలిచే హైదరాబాద్ ఈ మార్కెట్‌ను శాసించే దిశగా అడుగులు వేస్తోంది. డాక్టర్ రెడ్డీస్, నాట్కో, హెటిరో, ఎంఎస్ఎన్ ఫార్మాలు సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధాన్ని మార్కెట్లోకి తీసుకొచ్చాయి. సన్‌ఫార్మా, జైడస్ లైఫ్ సైన్సెస్, గ్లెన్‌మార్క్, లుపిన్, ఎరిస్ లైఫ్ సైన్సెస్ వంటి సంస్థలూ పోటీపడుతున్నాయి. ఏడాది క్రితం వరకూ నోవో నార్డిస్క్ ఉత్పత్తులైన వెగోవీ ఖర్చు నెలకు రూ.16,400, ఓజెంపిక్ ఖర్చు నెలకు రూ.11,000 వరకూ ఉండేవి. పేటెంట్ ముగిసిన తర్వాత దేశీయ సంస్థలు జనరిక్ వెర్షన్ల ధర నెలకు రూ.1,290 నుంచి రూ.4,200 వరకూ అందిస్తున్నాయి. మరోవైపు ఈ విభాగంలో తన గుత్తాధిపత్యం కాపాడుకునేందుకు నోవో నార్డిస్క్ సైతం తన మందుల ధరలను దాదాపు 48 శాతం మేర తగ్గించింది.

**నోటి మాత్రల రూపంలోనూ..**

ప్రస్తుతం ప్రీ-ఫిల్డ్ డిస్పోజబుల్ పెన్ రూపంలో వస్తున్న ఈ ఔషధాలు.. రానున్న కొన్ని రోజుల్లో మాత్రల రూపంలోనూ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ విషయంలో డాక్టర్ రెడ్డీస్‌కు గత నెలలోనే సీడీఎస్‌సీఈ అనుమతినిచ్చింది. వీటి ఉత్పత్తి ఎప్పటి నుంచి అనే విషయంలో ప్రస్తుతం స్పష్టత లేదు. మాత్రల రూపంలో అందుబాటులోకి వస్తే.. ఖర్చు మరింత తగ్గుతుందని అంచనా. అంతేకాకుండా, గ్రామీణ ప్రాంతాలకూ ఈ మందును సరఫరా చేయడం సులభం అవుతుంది. రాబోయే రెండేళ్లలో సెమాగ్లుటైడ్ మాత్రల మార్కెట్ 60 శాతానికి చేరుతుందని అంచనా. కొన్ని చైనా సంస్థలూ ఈ జీఎల్‌పీ-1 (గ్లూకగాన్-లైక్ పెప్టైడ్) ఔషధాల నోటి మాత్రల అభివృద్ధిని వేగవంతం చేశాయి. ఇవి అందుబాటులోకి వస్తే ధరల యుద్ధం మరింత పెరిగే అవకాశం ఉంది.

# చెపాక్‌లో ఉర్విల్ ఊచకోత..

## ఎనిమిదో ఓటమితో లక్నో ఔట్..!






లీగ్ దశ ఆఖర్లో గొప్పగా ఆడుతున్న సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ భారీ లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. చెపాక్‌లో ఉర్విల్ పటేల్(65) రికార్డు అర్ధ శతకంతో మెరవగా.. లక్నో సూపర్ జెయింట్స్ (ాూ+)పై సీఎస్కే 5 వికెట్లతో జయభేరి మోగించింది. 204 పరుగుల ఛేదనలో లక్నో బౌలర్ల భరతం పట్టిన ఉర్విల్.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(42)తో గెలుపు తోవలో నడిపాడు. కానీ.. మిడిల్ ఓవర్లలో షాదాబ్, దిగ్వేశ్ రథీల విజృంభణతో మ్యాచ్ లక్నోవైపు మళ్లింది. కానీ, డెత్ ఓవర్లలో ఇంప్యాక్ట్ సబ్ ప్రశాంత్ వీర్(18 నాటౌట్), శివం దూబే(15 నాటౌట్)లు కళ్లుచెదిరే సిక్సర్లతో లక్నో ఆశల్ని ఆడియాసలు చేశారు. పసుపు జెర్సీలతో నిండిపోయిన చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ విజయ గర్జన చేసింది. బౌలర్లు ప్రత్యర్థికి భారీ స్కోర్ సమర్పించిన చోట.. కుర్రాడు ఉర్విల్ పటేల్(65 : 23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా విరుచుకుపడగా లక్నో బౌలర్లు బెంబేలెత్తిపోయారు. ఆఖర్లో ఉత్కంఠ నెలకొన్నప్పటికీ.. డెత్ ఓవర్లలో ఇంప్యాక్ట్ సబ్ ప్రశాంత్ వీర్(18 నాటౌట్), శివం దూబే(15 నాటౌట్)లు ఒత్తిడికి లోన్వకుండా చెన్నైకి 5 వికెట్ల విజయాన్ని కట్టబెట్టారు. ఆరో విక్టరీతో 12 పాయింట్లు సాధించిన చెన్నై.. టాప్-5లో నిలిచింది. 11 మ్యాచుల్లో ఎనిమిదింటా ఓడిన లక్నో ప్లే ఆఫ్స్ రేసు నుంచి వైదొలిగింది.

లక్నో నిర్దేశించిన భారీ ఛేదనను ఓపెనర్ శాంసన్(28)ను ధాటిగా ఆరంభించాడు. బౌండరీలో చెలరేగిన సంజూను దిగ్వేశ్ రథీ బౌల్డ్ చేసి తొలి వికెట్ అందించాడు. అవేశ్ ఖాన్‌ను వణికించిన ఉర్విల్ పటేల్(65) చివరి మూడు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపగా 5 ఓవర్లకే చెన్నై స్కోర్ డబ్బై దాటింది. ఆ తర్వాతి ఓవర్లో దిగ్వేష్‌ను వదలని ఉర్విల్.. మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో స్టేడియాన్ని హోరెత్తించాడు. వరసగా రెండు ఓవర్లలో 25 చొప్పున రన్స్ రావడంతో పవర్ ప్లేలో సీఎస్కే వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది.

పవర్ ప్లే తర్వాత సింగిల్‌తో 13 బంతుల్లోనే ఉర్విల్ అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పాడు. ఆదే ఊపులో.. ఆడిన అతడు.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(42)తో చెన్నైని గెలుపు దిశగా నడిపాడు. షాదాబ్ ఓవర్లో అవేశ్ చేతికి చిక్కడంతో ఉర్విల్ తుఫాన్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. అప్పటికే సగం లక్ష్యం కరిగిపోవడంతో చెన్నైకి భారీ విజయం పక్కా అనిపించింది. కానీ, షాదాబ్ ఓవర్లో గైక్వాడ్ బౌల్డవ్వగా.. బ్రెవిస్(10)ను రథీ బౌల్డ్ చేశాడు. ఫామ్‌లో ఉన్న కార్తిక్ శర్మ(20)ను అవేశ్ పెవిలియన్ పంపడంతో ఇంప్యాక్ట్ సబ్‌గా ప్రశాంత్ వీర్(18 నాటౌట్) వచ్చాడు. 18 బంతుల్లో 30 రన్స్ అవసరమవ్వగా.. ప్రిన్స్ 9 రన్సే ఇవ్వడంతో ఉత్కంఠ మొదలైంది. రథీ, పూరన్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన ప్రశాంత్ రెండు సిక్సర్లతో మెరవగా.. మర్క్‌రమ్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో శివం దూబే(15 నాటౌట్) తొలి రెండు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపాడు. దాంతో 5 వికెట్లతో గెలుపొందిన సీఎస్కే 12 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది.

**రెచ్చిపోయిన ఇంగ్లిస్**

పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో లేని లక్నో సూపర్ జెయింట్స్ భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ జోష్ ఇంగ్లిస్(85) అర్ధ శతకంతో భారీ స్కోర్‌కు పునాది వేశాడు. కానీ, ఓవర్టన్(3-36), అన్షుల్ కంబోజ్(2-47)లు వికెట్ల వేటతో మిడిలార్డర్‌కు బ్రేకులు వేశారు. షాదాబ్ అహ్మద్(43 నాటౌట్), హిమ్మత్ సింగ్(17) డెత్ ఓవర్లలో ధనాధన్ ఆడి స్కోర్ రెండొందలు దాటించారు. ఒకదశలో 230 ప్లస్ కొట్టేలా కనిపించినా చివరకు వీరిద్దరి కృషి ఫలితంగా లక్నో 203కు పరిమితమైంది.

## స్పోర్ట్స్

### ఐపీఎల్‌లో సంచలనం.. రికార్డు హాఫ్ సెంచరీ బాదిన అన్‌క్యాప్డ్ ప్లేయర్..!



ఐపీఎల్‌లో అన్‌క్యాప్డ్ ప్లేయర్ ఉర్విల్ పటేల్ చరిత్ర సృష్టించాడు. పంతొమ్మిదో సీజన్‌లో తొలిసారి బ్యాట్ ఝులిపించిన ఈ చెన్నై చిన్నోడు రికార్డు అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పాడు. చెపాక్ స్టేడియంలో పూనకం వచ్చినట్టే ఆడిన ఉర్విల్.. ఏకంగా 13 బంతుల్లోనే యాభై రన్స్‌తో చెలరేగాడు. తద్వారా ఈ మెగా టోర్నీ చరిత్రలో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీతో యశస్వీ జైస్వాల్(ఝంష్ఝుంజఆ జీుఆంఝుశ్రీ) రికార్డను సమం చేశాడీ హిట్టర్. చెపాక్ స్టేడియంలో సిక్సర్ల వర్షం కురిపించాడు ఉర్విల్ పటేల్. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లను ఊచకోత కోసిన ఉర్విల్.. ఎదుర్కొన్న ఎనిమి ది బంతులను.. 1, 6, 6, 6, 6, 4, 6 గా మలిచి అర్ధ శతకానికి చేరువయ్యాడు. అవేశ్ ఖాన్, దిగ్వేజ్ రథీ బౌలింగ్‌ను తుత్తునియలు చేసిన ఉర్విల్.. షమీ, షాదాబ్‌ను ఉతికేస్తూ 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో చరిత్ర లిఖించాడు.

కోల్‌కతా నైట్ రైడర్స్(ఖఖ=)పై 2023లో యశస్వీ జైస్వాల్ నెలకొల్పిన వేగవంతమైన ఫిఫ్టీ రికార్డును ఉర్విల్ సమం చేశాడు. కమిన్స్, కేఎల్ రాహుల్, రొమారియో షెపర్డ్ 14 బంతుల్లో అర్ధ శతకంతో ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.

**ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ వీళ్లే..**

యశస్వీ జైస్వాల్ (రాజస్థాన్ రాయల్స్)- 13 బంతుల్లో -- కోల్‌కతాపై 2023లో.
ఉర్విల్ పటేల్ (చెన్నై సూపర్ కింగ్స్) -- 13 బంతుల్లో -- లక్నోపై 2026లో.
కేఎల్ రాహుల్(పంజాబ్ కింగ్స్) -- 14 బంతుల్లో -- ఢిల్లీ క్యాపిటల్స్‌పై 2018లో.
ప్యాట్ కమిన్స్(కోల్‌కతా నైట్ రైడర్స్) -- 14 బంతుల్లో ముంబై ఇండియన్స్‌పై 2022లో.
రొమారియో షెపర్డ్(ఆర్సీబీ)- 14 బంతుల్లో -- చెన్నై సూపర్ కింగ్స్‌పై 2025లో



# ప్రభాస్ స్పిరిట్ కొత్త షెడ్యూల్ రేపే షురూ కానుందా..?

గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ అభిమానులను ఎంటర్‌టైన్ చేసేందుకు బ్యాక్ టు బ్యాక్ సినిమాలను ట్రాక్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ స్పిరిట్ యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్నాడు. షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. తాజా రిపోర్ట్స్ ప్రకారం స్పిరిట్ కొత్త షెడ్యూల్ రేపు షురూ కానుందట. ప్రభాస్, వివేక్ ఒబెరాయ్ మధ్య వచ్చే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్‌ను ఈ షెడ్యూల్‌లో షూట్ చేయనున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు సుమారు 2 నెలలపాటు సుదీర్ఘంగా ఈ షెడ్యూల్ కొనసాగనుందట. ఇందులో ప్రభాస్ తొలిసారి పోలీసాఫీసర్‌గా నటిస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ మూవీలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది. సందీప్ రెడ్డి వంగా హోం బ్యానర్ భద్రకాళి పిక్చర్స్, టీ సిరీస్‌తో కలిసి సంయుక్తంగా తెరకక్కిస్తున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రాణే సంగీతం అందిస్తున్నాడు. స్పిరిట్‌లో బాలీవుడ్ యాక్టర్ వివేక్ ఒబెరాయ్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇక పాపులర్ సౌత్ కొరియన్ యాక్టర్ (డాన్ లీ) మడాంగ్‌సియోక్ విలన్‌గా నటిస్తున్నాడని వార్తలు రాగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వస్తే క్లారిటీ వచ్చే అవకాశముంది.

# హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్..

## హాట్ టాపిక్‌గా కృతిసనన్ కామెంట్స్



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేని భామ కృతిసనన్. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా టాలీవుడ్‌లో ఈ భామకున్న ఫ్యాన్ బేస్ ఎక్కువే అని చెప్పాలి. చాలా కాలంగా హిందీ సినిమాలకే పరిమితమైన ఈ ముద్దుగుమ్మ కాస్ట్ కటింగ్ కారణంగా హీరోయిన్లు ఎలా ప్రభావితం అవుతున్నారో చెప్పుకొచ్చింది కృతిసనన్. బడ్జెట్ నియంత్రణలో భాగంగా నిర్మాతలు మొదట హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్ పెడుతున్నారని తాజాగా ఓ చర్చ నెట్టింట కొనసా గుతుంది. ఈ విషయమై కృతిసనన్ మాట్లాడుతూ.. మధ్య శ్రేణి (మిడ్ రేంజ్ హీరోయిన్లు) రెమ్యున రేషన్లను నిర్మాతలు పున: పరిశీలిస్తున్నారంది. అయితే ఇండస్ట్రీలో స్టార్ హీరోలకు ఇచ్చే భారీ రెమ్యునరేషన్లపై ఇప్పటికీ అతి తక్కువ స్థాయిలో చర్చ నడుస్తుందని చెప్పింది. కాస్ట్ కటింగ్ ఎఫెక్ట్ ప్రధానంగా హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులపైనే పడుతుందని అభిప్రాయపడ్డింది. అదే సమయంలో కేవలం టాప్ హీరోల రెమ్యునరేషన్లు తగ్గించుకుంటేనే మార్పు మొదలవుతుందని ఓ వర్గానికి చెందిన దర్శకనిర్మాతలు నమ్ముతున్నారని చెప్పుకొచ్చింది. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే బ్యాక్ టు బ్యాక్ బాక్సాఫీస్ ఫెయిల్యూర్స్ కారణంగా, థియాట్రికల్ రెవెన్యూ పడిపోవడం కారణంగా నిర్మాతలు ప్రొడక్షన్ ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్.



# వ్యాఖ్యాతగా మారిన శిల్పా శెట్టి..

బాలీవుడ్ నటి శిల్పా శెట్టి కుంద్రా వ్యాఖ్యాతగా 'మా హై నా' అనే సరికొత్త హిందీ కామెడీ కుకింగ్ షో త్వరలో ప్రారంభం కాబోతుంది. ఈ మేరకు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 ఆదివారం అధికారిక ప్రకటనను విడుదల చేసింది. మొత్తం పది ఎపిసోడ్ల పాటు సాగే ఈ సిరీస్‌లో ఆరుగురు సినీ సెలబ్రిటీలు తమ తల్లులతో కలిసి పాల్గొనబోతున్నారు. లిల్ ఫ్రోడో ప్రొడక్షన్స్ హౌస్ నిర్మిస్తున్న ఈ షోలో నేటి తరం యువత జీవనశైలికి మరియు తల్లుల సాంప్రదాయ ఆలోచనలకు మధ్య ఉన్న అనుబంధాన్ని వంటగది వేదికగా ఆసక్తికరంగా చూపించనున్నారు.

ఈ కార్యక్రమంలో సునీతా అహుజా–టీనా అహుజా, ఊర్వశి ధోలాకియా–క్షితిజ్ ధోలాకియా, తాన్య మిట్టల్–సునీతా మిట్టల్, గుల్లు–మునేష్ తన్వర్, షాహిదా అన్సారీ–అఫ్ఘాన్, మరియు భాగ్యశ్రీ శర్మ–రింజు శర్మలు జంటలుగా సందడి చేయబోతున్నట్లు తెలుస్తుంది. వంటలు చేస్తూనే ఒకరికొకరు ఎదురయ్యే భావోద్వేగాలు, చిన్నపాటి గొడవలు మరియు జ్ఞాపకాలను ఈ షో కళ్లకు కట్టనుంది. యువతకు మరియు వారి తల్లులకు మధ్య ఉండే ప్రత్యేక బంధాన్ని సరికొత్త కోణంలో చూపించడమే ఈ షో ఉద్దేశమని జీ5 హిందీ బిజినెస్ హెడ్ కావేరి దాస్ తెలిపారు. శిల్పా శెట్టి తనదైన శైలిలో ఈ షోకు మరింత వినోదాన్ని జోడించనున్నారని నిర్మాతలు నీతి మరియు ప్రీతి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వినోదాత్మక కార్యక్రమం త్వరలోనే జీ5లో ప్రసారం కానుంది.

# 'మనీ హైస్ట్' ఫ్రాంచైజీ నుంచి మరో క్రేజీ సిరీస్.. అనౌన్స్‌మెంట్ టీజర్ విడుదల!



ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన స్పెయిన్ సిరీస్ 'మనీ హైస్ట్' (లా కాసా డి పాపెల్) అభిమానులకు నెట్‌ఫ్లిక్స్ తీపి కబురు అందించింది. 2021లో ఐదు సీజన్లతో ఈ ఒరిజినల్ సిరీస్ ముగిసినప్పటికీ, ఈ ఫ్రాంచైజీని మరింత విస్తరించనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా సిరీస్‌కి సంబంధించిన కొత్త టీజర్‌ను విడుదల చేసింది. మనీ హైస్ట్ ప్రపంచం కొనసాగబోతుంది అనే పేరుతో విడుదలైన కొత్త టీజర్ మరింత రసవత్తరంగా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ సిరీస్‌కు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించబోతున్నట్లు తెలిపింది.



# చిరంజీవి ఆ దర్శకుడిని ఎందుకు కలిసినట్టు?

2017లో రీఎంట్రీ ఇచ్చిన తర్వాత చిరంజీవి నుంచి ఇప్పటివరకు 7 సినిమాలు చేస్తే అందులో మూడు రీమేక్‌లే. కానీ చిరుపై రీమేక్ హీరో ముద్ర చాలా గట్టిగా పడిపోయింది. ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన 'మన శంకరవరప్రసాద్'కి బదులు ఓ రీమేక్ చేస్తారనే రూమర్స్ వచ్చాయి గానీ దాన్ని పక్కనబెట్టేశారు. ప్రస్తుతానికైతే ఎలాంటి రీమేక్స్ చేయట్లేదు. కానీ మలయాళ దర్శకుడు తరుణ్ మూర్తి.. చిరంజీవి ఇంటికొచ్చి కలవడంతో మళ్లీ రీమేక్ సందేహాలు వచ్చాయి. 'తుడురమ్' సినిమాతో హిట్ కొట్టిన మలయాళ దర్శకుడు తరుణ్ మూర్తి.. హైదరాబాద్ వచ్చి చిరుని కలిశాడు. అయితే ఎక్కడ రీమేక్ రూమర్స్ వస్తాయోనని ముందుగానే క్లారిటీ ఇచ్చేశాడు. 'తుడురమ్' రీమేక్ కోసం తాము కలవలేదని చెప్పాడు. ఆ ఫొటోలని సోషల్ మీడియాలో పంచుకున్నాడు. 'ఈ భేటీకి 'తుడురమ్' రీమేక్‌కి ఎలాంటి సంబంధం లేదు. చిరంజీవి టీమ్ నుంచి స్వయంగా కాల్ వచ్చింది. చిరంజీవి సర్ మిమ్మల్ని వ్యక్తిగతంగా కలవాలనుకుంటున్నారు అని చెప్పడంతో విమానం ఎక్కేసి ఆయన ఇంటికి వచ్చేశా. ఆయనతో సినిమా, నా వ్యక్తిగత జీవితం తదితర విషయాల గురించి చాలాసేపు మాట్లాడుకున్నాం. నేను తీసిన ప్రతి సినిమాని ఎంతో శ్రద్ధగా చూసి, అందులోని ప్రతి సీన్ గురించి వివరించి చెబుతుంటే నాకే ఆశ్చర్యమేసింది. ఎంతటి సూపర్‌స్టార్ అయినా సరే సినిమాలని ఇప్పటికీ చిన్నపిల్లల్లా ఆసక్తితో చూస్తూ అదే ఉత్సాహంతో చర్చించడం చిరంజీవిగారి ప్రత్యేకత' అని తరుణ్ మూర్తి రాసుకొచ్చాడు. ఇది తన జీవితంలోనే అత్యంత మధురమైన, ఉత్సాహభరితమైన సందర్భాల్లో ఒకటని దర్శకుడు తరుణ్ చెప్పుకొచ్చాడు. అయితే చిరంజీవిని ఈ మలయాళ డైరెక్టర్ కలవడం గురించి సోషల్ మీడియాలో అప్పుడే డిస్కషన్స్ మొదలుపెట్టేశారు. త్వరలోనే కొత్త ప్రాజెక్ట్ గురించి అనౌన్స్‌మెంట్ ఉండొచ్చని అనుకుంటున్నారు. ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న చిరంజీవి.. తర్వాత శ్రీకాంత్ ఓదెలతో కలిసి పనిచేస్తున్నారు. ఆ తర్వాత ఎవరితో చేస్తారనేది ప్రస్తుతానికైతే ఫిక్స్ కాలేదు. బహుశా ఆ ఛాన్స్.. మలయాళ డైరెక్టర్ తరుణ్ మూర్తి అందుకుంటాడేమో చూడాలి?

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,